www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పోలీసుల గంజాయి దందా?

పట్టుకున్న సరుకు పెద్దమొత్తంలో దారిమళ్లింపు

ఇద్దరు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్ 12

నిందితుల సమాచారం.. సంగారెడ్డిలో ఘటన

శంషాబాద్‌లో రూ.7 కోట్ల డ్రగ్స్ సీజ్

ఎయిర్‌పోర్టులో పట్టుకున్న అధికారులు

బ్యాంకాక్ నుంచి తెస్తూ దొరికిన మహిళలు 2

శనివారం | 2-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 214

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా. 8.21 తదుపరి విదియ; నక్షత్రం: విశాఖ తె. 5.58 తదుపరి అనూరాధ; వర్జ్యం: ఉ.9.41-11.27; దుర్ముహూర్తం: ఉ.6.17-7.48; అమృతఘడియలు: రా.8.16-10.01; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.17; సూర్యాస్తమయం: 5.39

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వామ్మో స్టిరాయిడ్స్!

నొప్పుల నివారణకు ఇష్టారాజ్యంగా ఇస్తున్న ఆర్‌ఎంపీలు

కొందరు వైద్యులదీ అదే దారి.. విచ్చలవిడిగా వాడితే దుష్ప్రభావాలు

తరచూ ఇన్ఫెక్షన్ల ప్రమాదం.. బోలు ఎముకలు, బరువు పెరగడం, చర్మం పల్చగా కావడం వంటి సమస్యలు 12

హృద్రోగ, కిడ్నీ వ్యాధుల గండం.. నిర్దేశిత రీతిలో వాడకుంటే ముప్పు



స్టిరాయిడ్స్.. రెండు వైపులా పదునైన అంచులున్న కత్తిలాంటి ఔషధాలివి! మానవాళి అభివృద్ధి చేసిన ప్రాణ రక్షక ఔషధాల్లో చాలా ముఖ్యమైనవి!! కానీ.. వీటి వాడకానికి ఒక లెక్క ఉంటుంది. ఆ లెక్క తప్పితే పెనుప్రమాదమే. ఉదాహరణ కావాలా.. కరోనా సమయంలో ఆ మహమ్మారి బారి నుంచి లక్షలాది మంది ప్రాణాలు కాపాడింది ఈ స్టిరాయిడ్‌లే. కానీ, వీటి విచ్చలవిడి వాడకం వల్ల బ్లాక్‌ఫంగస్ బారిన పడ్డవారెందరో!! మారుమూల పల్లెల్లో, పట్టణాల్లోని బస్తీల్లో.. ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాల్సిన ఆర్‌ఎంపీల (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు) నుంచి.. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెద్ద డాక్టర్ల దాకా చిన్న చిన్న సమస్యలకూ విచ్చలవిడిగా ఈ ఔషధాలను సిఫారసు చేయడం ఆందోళన కలిగిస్తోంది!

క్లాసెన్‌కు కాసుల పంట

రూ.23 కోట్లకు అట్టిపెట్టుకున్న సన్‌రైజర్స్

కోహ్లిని 21 కోట్లకు రిటైన్ చేసుకున్న ఆర్సీబీ


హైదరాబాదీ సిరాజ్‌ను వదిలేసిన బెంగళూరు

తిలక్‌వర్మకు ముంబై ఇండియన్స్ రూ.8 కోట్లు

చెన్నై అన్‌క్యాప్డ్‌గా ధోనీ.. రూ.4 కోట్లే

ఐపీఎల్ మెగా వేలంలోకి పంత్, రాహుల్

రిటెన్షన్ జాబితా వెల్లడించిన ఫ్రాంచైజీలు 11



కేసీఆర్‌పై

చర్యలు?



క్యాబినెట్, శాసనసభలో చర్చించిన తర్వాతే

విద్యుత్ ఒప్పందాలు, ప్లాంట్ల నిర్మాణం అంశాల్లో..

జస్టిస్ లోకూర్ నివేదిక ఆధారంగా సర్కారు అడుగులు


లాభదాయకం కాని ప్రాజెక్టులకు బాధ్యులన్న కమిషన్!

కేసీఆర్‌తో పాటు ఇతర పాత్రధారులపైనా చర్యలు

మంత్రివర్గ చర్చ తర్వాత నివేదిక బయటికొచ్చే చాన్స్

కమిషన్ నివేదికపై అధికారులతో సీఎం మంతనాలు

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'విద్యుత్' అవకతవకల అంశంలో జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ నివేదిక ఇవ్వడంతో తదుపరి చర్యల దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రానున్న క్యాబినెట్ సమావేశంలో ఈ నివేదికపై చర్చించి, ఆయా నిర్మాణాల్లో కీలకపాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు ఇతర పాత్రధారులపై చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అనంతరం కమిషన్ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి, తాము ఏ చర్యలు తీసుకుంటున్నాం అనేది సభలోనే ప్రకటించాలని సర్కారు భావిస్తోంది. జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ గడువు అక్టోబరు 29తోనే ముగియగా ఆ లోపే కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే, జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో కేసీఆర్ రాసిన లేఖనే ఆయన అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకున్న కమిషన్ నివేదిక రూపొందించింది. జస్టిస్ లోకూర్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' తొలుత ప్రచురించిన సంగతి తెలిసిందే. కాగా, జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ నివేదికలోని అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం రాత్రి అధికారులతో చర్చించారు. తదుపరి చర్యలు తీసుకునే అంశంపై మంతనాలు జరిపారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత విద్యుత్ రంగంపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన విద్యుత్ ఒప్పందంలో తప్పిదాలేంటి? 2000 మెగావాట్ల కోసం కారిడార్‌ను బుక్ చేసుకొని, ఆ మేరకు విద్యుత్ తీసుకోకుండా జరిమానాల రూపంలో పవర్ గ్రిడ్‌కు చెల్లించింది ఎంత? పిట్‌హెడ్(బొగ్గు గనుల ఉదరభాగంలో) విధానంలో కాకుండా సుదూరంలో

మిగతా 13వ పేజీలో...

త్వరలో పాదయాత్ర

కార్యకర్తల కోరిక మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడతా

వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు సర్కారు వేధింపులు

కుటుంబాలను రాజకీయాల్లోకి లాగడం నీచం

రేవంత్‌రెడ్డి వచ్చాకే ఈ సంస్కృతి మొదలైంది

మా వాళ్లపై రెచ్చిపోతున్న పోలీసుల పనిపడతాం

కొత్త సంవత్సరంలో సరికొత్తగా ప్రజల్లోకి కేసీఆర్

ఆస్క్ కేటీఆర్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల ఆకాంక్ష మేరకు త్వరలో పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆస్క్ కేటీఆర్ పేరిట గురువారం ఎక్స్ వేదికగా చేపట్టిన కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు, పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా తన పాదయాత్ర ఉంటుందన్నారు. హామీల అమలుతోపాటు ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో పారదర్శకత పాటించేలా ప్రజల తరఫున కొట్లాడతామన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ పాలన శాపంగా మారిందని, నాలుగేళ్ల తర్వాత ఆ పార్టీ అధికారం కోల్పోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థికప్రగతి పూర్తిగా పతనమయిందని, ఈ నష్టం నుంచి ఇప్పట్లో కోలుకోవడం

మిగతా 3వ పేజీలో...



తేల్చేద్దాం.. కారు కథ

ఫార్ములా ఈ-రేస్‌పై దర్యాప్తునకు ఏసీబీకి అనుమతి

అనుమతిచ్చిన సర్కారు.. జేడీ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

వచ్చే వారం రంగంలోకి.. ఐఏఎస్ సహా పలువురికి నోటీసులు

స్టేట్‌మెంట్ల ఆధారంగా అప్పటి ప్రజాప్రతినిధులపై దృష్టి

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణకు అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) ప్రభుత్వం అనుమతిచ్చింది. పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చేందుకు పచ్చజెండా ఊపింది. అవినీతికి బాధ్యులైనవారు ఎంతటివారైనా వదలొద్దని స్పష్టం చేసింది. ఈ రేస్‌లో రూ.55 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించిన మున్సిపల్ శాఖ.. మంగళవారం ఏసీబీకి ఫిర్యాదు చేసింది. ఐఏఎస్‌లు సహా అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు పెద్దల ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేసేందుకు అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వచ్చే వారం నుంచి ఏసీబీ రంగంలోకి దిగనుంది. ఉన్నత స్థాయి కేసు కావడంతో ఏసీబీలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) విభాగానికి దర్యాప్తు బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది. సీఐయూ జాయింట్ డైరెక్టర్ (జేడీ) నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి నిర్విరామంగా కేసు విచారణ చేపట్టనున్నారు. ప్రస్తుతం సెలవులో ఉన్న జేడీ సోమవారం విధుల్లో చేరనున్నారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత వచ్చే వారం నుంచి కేసుతో సంబంధం ఉన్నవారందరికీ విడివిడిగా నోటీసులు ఇచ్చి, విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నారు.



ఐఏఎస్‌లు మొదలు కీలక అధికారులు, నాటి ప్రజాప్రతినిధుల దాక వీరిలో ఉండే అవకాశం ఉంది. స్టేట్‌మెంట్ ఆధారంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే వీలుంది. ఫార్ములా ఈ రేస్‌కు

మిగతా 13వ పేజీలో...



ఇంటింటికీ స్టిక్కర్!

కులగణన సర్వేలో ప్రాంతాలవారీగా నజర్

ఆ వివరాల ఆధారంగానే బ్లాక్‌ల విభజన

150-175 ఇళ్లకు ఒక్కో ఎన్యూమరేటర్

50 వేల మందిపైగా టీచర్ల భాగస్వామ్యం

మధ్యాహ్నం వరకే ప్రాథమిక పాఠశాలలు

'ప్రత్యేక కమిషన్'పై సర్కారు అభ్యంతరం!

హైకోర్టులో కౌంటర్ దాఖలుకు నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కులగణనకు రంగం సిద్ధమైంది. ఈ నెల 6 నుంచి రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సరంజామాతో సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మొదట పట్టణ, గ్రామీణ ప్రాంతాలవారీగా ఇళ్ల వివరాలను సేకరించనున్నారు. ఆ ఇళ్ల వివరాలను బ్లాక్‌ల వారీగా విభజించి, దాని ప్రకారం ఎన్యూమరేటర్లను నియమిస్తారు. అనంతరం పది బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను ఏర్పాటు చేస్తారు. కులగణన మొదలు కావడానికి ముందే.. ఆయా వార్డులు, గ్రామాలకు ఎన్యూమరేటర్లు

మిగతా 13వ పేజీలో...

బడ్జెట్‌లోనే హామీలివ్వండి

ఐదు, ఆరు, పది అంటూ గ్యారెంటీలను ప్రకటించొద్దు



అమలులో విఫలమైతే ప్రభుత్వానికి చెడ్డ పేరు

ప్రజల్లో విశ్వాసం కోల్పోతాం: కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల నేతలకు సూచన

'ఉచిత బస్సు'పై పునరాలోచన: డీకే శివకుమార్

తన ప్రకటనను వక్రీకరించారని తర్వాత వ్యాఖ్య

కాంగ్రెస్ బండారం ప్రజల ముందు బట్టబయలు

2 ఆ పార్టీ బూటకపు హామీలతో జాగ్రత్త: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 1: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటిస్తున్న హామీలపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయా రాష్ట్రాల బడ్జెట్‌ను పరిగణనలోకి తీసుకోకుండా హామీలు ప్రకటించవద్దని త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. బడ్జెట్ పరిధిలోనే గ్యారెంటీలు ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ఖర్గే మీడియాతో మాట్లాడారు. 'త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో అయిదు, ఆరు, పది, ఇరవై వంటి గ్యారెంటీలు ప్రకటించవద్దని ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు సూచించాను. మీ రాష్ట్ర బడ్జెట్‌లో సరిపోయే హామీలే ఇవ్వండి. లేకుంటే రాష్ట్రం దివాలా తీసే పరిస్థితులు వస్తాయి. ప్రణాళిక రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. రోడ్లు వేయడానికి కూడా నిధులు లేకపోతే అందరూ మీకు వ్యతిరేకంగా మారిపోతారు. వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైతే ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడమే కాకుండా భావితరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది' అని ఖర్గే హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు సేవలు అందించే శక్తి పథకాన్ని పునఃసమీక్షిస్తామని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఖర్గే ఈ సూచనలు

మిగతా 2వ పేజీలో...

ఏం భాష ఇది? 2

- ఫిర్యాదు చేస్తే మా పార్టీ, నేతల మీద దాడులు చేస్తారా?
- ఈవీఎంల గురించి అడిగితే.. ఏవేవో సమాధానాలా?
- తటస్థత అవశేషాలను కూడా వదిలేసుకుంటున్నారా?
- కమిషనర్ అసమ్మతి నోట్‌ను ఎలా తొక్కిపెడతారు?
- న్యాయపోరాటమే మార్గం.. ఈసీపై కాంగ్రెస్ నిప్పులు
- 9 మంది సీనియర్ల లేఖ.. మళ్లీ 'హరియాణా' వివాదం



జూన్‌కల్లా సీఎం మార్పు

రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం దించేస్తుంది

సీఎంగా ఉత్తమ్ లేదా భట్టికి అవకాశం

రేవంత్ కాంగ్రెస్‌ను చీలిస్తే బీఆర్‌ఎస్‌దే పవర్

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్‌కల్లా కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దింపేస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్థానంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేదా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సీఎం పదవి దక్కవచ్చన్నారు. ఎవరిని నియమించాలన్నదానిపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోందని, ఇప్పటికే దీనిపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కమిటీ, అంతర్గతంగా సమీక్ష

మిగతా 3వ పేజీలో...

దీపావళి దాటింది.. రాజకీయ బాంబులు

పేల్చలేదేం 3

కాంగ్రెస్ నేతలపై ఉత్తర కుమార ప్రగల్భాలే

నాయకుడు లేని నావలా బీఆర్‌ఎస్: బండి

ప్రముఖ ఆర్థికవేత్త బిబేక్ దేబ్‌రాయ్ కన్నుమూత

» తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని

» ఆయన సిఫార్సుతోనే సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్ విలీనం



న్యూఢిల్లీ, నవంబరు 1: ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దేబ్‌రాయ్ (69) శుక్రవారం కన్నుమూశారు. మధుమేహం, హైపర్ టెన్షన్, గుండె సమస్యలతో గురువారం చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆయన చేరారు. చికిత్స కొనసాగుతుండగానే.. పేగుల్లో సమస్య తలెత్తి పరిస్థితి విషమించి ఆయన మరణించారు. బిబేక్ మృతిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణంతో దేశం ఒక ప్రజామేధావిని కోల్పోయిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు, ఆధ్యాత్మికత వంటి పలు రంగాల్లో నైపుణ్యం కలిగిన శిఖర సమాన మేధావి డాక్టర్ బిబేక్ దేబ్‌రాయ్ జీ. తన రచనలు, కృషి ద్వారా భారత మేధోరంగంపై చెరిగిపోని ముద్ర వేశారు' అని గుర్తు చేసుకున్నారు. బిబేక్ దేబ్‌రాయ్ 2017 నుంచి ప్రధాని ఆర్థిక సలహా మండలికి నేతృత్వం వహిస్తున్నారు. అమృత్ కాల్ మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ఆర్థికశాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి కూడా ఆయన సారథ్యం వహించారు. 2015 నుంచి 2019 వరకూ నీతిఆయోగ్‌లో సభ్యుడిగా ఉన్నారు. దేబ్‌రాయ్ కమిటీ సిఫార్సుల మేరకే.. కేంద్రం రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని పక్కనపెట్టి 2017-18 నుంచి సాధారణ బడ్జెట్‌తోపాటే రైల్వే బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టటం ప్రారంభించింది. ఆర్థికశాస్త్రం, రైల్వేలు, న్యాయశాస్త్రం, తత్వశాస్త్రం తదితర రంగాలపై బిబేక్ పలు రచనలు చేశారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలతోపాటు వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి ఇంగ్లి‌ష్‌లోకి అనువదించారు. తాజాగా మహాభారతం అనువాదాన్ని పది సంపుటాలుగా వెలువరించారు. మరణానికి 4 రోజుల ముందు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు బిబేక్ దేబ్‌రాయ్ ఒక వ్యాసం రాయటం విశేషం. 2015లో బిబేక్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్ కన్నుమూత



న్యూఢిల్లీ, నవంబరు 1: ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్ (63) శుక్రవారం ఇక్కడ కన్నుమూశారు. ఆయన ఏడాది కాలంగా హృద్రోగంతో బాధపడుతున్నారు. చివరిసారిగా గత నెలలో ఢిల్లీలో నిర్వహించిన లక్మే ఇండియా ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్నారు. ఆ సమయంలో ర్యాంపు వద్ద తూలి పడిపోవడంతో ఆయన ఆరోగ్యంపై అభిమానులు ఆందోళన చెందారు. సంప్రదాయాలు, ఆధునికతను మేళవించి దుస్తులకు రూపకల్పన చేయడం ద్వారా ఆయన ప్రత్యేకతను చాటుకున్నారు. కశ్మీర్‌కు చెందిన రోహిత్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో డిగ్రీ చదివారు. అంతర్జాతీయ సెలబ్రిటీలైన పమేలా అండర్సన్, నవోమీ క్యాంప్‌బెల్‌తో పాటు పలువురు బాలీవుడ్ నటులకు డిజైనర్‌గా పనిచేశారు.

భారీగా పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ, నవంబరు 1: మరోసారి వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. 19 కిలోల గ్యాస్ సిలిండర్‌పై 62 రూపాయలు పెంచుతున్నట్లు చమురు సంస్థలు తెలిపాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1802కు చేరింది. తాజాగా పెరిగిన రేట్ల ప్రకారం దేశంలోని ప్రధాన మెట్రో నగరాలైన ముంబైలో రూ.1754, చెన్నైలో రూ.1964, కలకత్తాలో రూ.1911గా ఉంది. అలాగే 5 కిలోల గ్యాస్ సిలిండర్‌పై 15రూపాయలు పెంచినట్లు చమురు సంస్థలు తెలిపాయి. ఈ పెంపు తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. వరుసగా నాలుగు నెలల నుంచి వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ చమురు సంస్థలు ప్రజలపై భారం మోపుతునే ఉన్నాయి.

మహారాష్ట్రలో మొత్తం ఓటర్లు 9.7 కోట్లు

ముంబై, నవంబరు 1: మహారాష్ట్రలో 100 నుంచి 109 మధ్య వయసున్న ఓటర్లు 47,392 మంది ఉన్నారని ఆ రాష్ట్ర ఎన్నికల అధికారి వెల్లడించారు. ఈనెల 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. 288 నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 9,70,25,119 మంది ఉండగా.. వారిలో 5,00,22,739 మంది పురుష ఓటర్లు, 4,69,96,279 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు వారు 22 లక్షల మందికి పైగా కొత్తగా ఓటు హక్కు పొందారు. ఇక అంతర్గత, పొత్తు రాజకీయాలతో ఇప్పటికే సతమవుతున్న ప్రధాన రాజకీయ పార్టీలకు ఇండిపెండెంట్లతో కొత్త చిక్కు వచ్చి పడింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల పేరును పోలిన పేరున్న వారు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగుతుండటం వారికి తలనొప్పి తెచ్చిపెడుతోంది.

ఐదేళ్లలో ఏడేళ్లు ఎలా పెరిగాడో?

జార్ఖండ్ సీఎం హేమంత్‌పై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు

కోల్‌కతా, నవంబరు 1: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వయసు వివాదాంశం అయింది. ఐదేళ్లలో ఏడేళ్లు పెరిగాడంటూ బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అఫిడవిట్‌లో సోరెన్ తన వయసు 42 ఏళ్లు అని పేర్కొనగా.. ఇప్పుడు 49 ఏళ్లు అని ప్రకటించారు. దీంతో ఈ విషయంపై బీజేపీ విమర్శనాస్త్రాలు సంధించింది. బీజేపీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా దేవ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "ఐదేళ్లలో ఎవరికైనా ఏడేళ్లు పెరగడం మీరెప్పుడైనా విన్నారా. ఇది జార్ఖండ్‌లో మాత్రమే సాధ్యం" అంటూ ఎద్దేవా చేశారు. దీనిపై జేఎంఎం అధికార ప్రతినిధి తనూజ్ ఖత్రి ప్రతిస్పందించారు. అఫిడవిట్‌తో సమర్పించిన డాక్యుమెంట్లు హేమంత్ సోరెన్ వయసును నిర్ధారిస్తున్నాయని, ఇపుడు ఆయన వయసు 49 అని స్పష్టం చేశారు.

రైల్వే టికెట్ రిజర్వేషన్ గడువు కుదింపు అమల్లోకి

న్యూఢిల్లీ, నవంబరు 1: ప్రయాణికులు అందరూ లబ్ధి పొందేలా రైల్వే తన టికెటింగ్ పాలసీలో మార్పులు చేసింది. ఈ మార్పులు నవంబరు 1, శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయి. గతంలో 120 రోజుల ముందుగా టికెట్లు బుక్ చేసుకొనే సదుపాయం ఉండేది. దానిని 60 రోజులకు కుదిస్తూ రైల్వే తీసుకున్న నిర్ణయం అమలులోకి వచ్చింది. అక్టోబరు 31లోపు రిజర్వేషన్ చేసుకున్న వారికి ఈ మార్పు వర్తించదు. నిర్ధారిత ప్రయాణికులను ప్రోత్సహించడానికే ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం గడువును కుదించినట్లు రైల్వే స్పష్టం చేసింది. వాస్తవ డిమాండ్‌ను అర్థం చేసుకోవడానికి ఈ మార్పు ఉపకరిస్తుందని రైల్వే భావిస్తోంది. ముందస్తు రిజర్వేషన్లలో 61 నుంచి 120 రోజుల మధ్యలో సుమారు 21% రిజర్వేషన్లు రద్దవున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఏం భాష ఇది? ఏం దాడులు ఇవి?

ఫిర్యాదు చేస్తే మా పార్టీ మీద, నేతల మీద దాడులు చేస్తారా?

» ఈవీఎంల గురించి మేం అడిగితే.. ఏవో సమాధానాలు ఎలా ఇస్తారు?

» ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ నిప్పులు



న్యూఢిల్లీ, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తాము వ్యక్తం చేసిన సందేహాలపై ఎన్నికల సంఘం (ఈసీ) రాసిన లేఖను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఏదైనా అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే కక్షిదారుల పిటిషన్లపై తీర్పులను వెలువరించే జడ్జీలు ఆ కక్షిదారులను తిడుతూ, దాడులు చేయరని.. కానీ, ఈసీ మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆక్షేపించింది. ఆధిపత్య ధోరణితో ఈసీ తమకు ఇచ్చిన ప్రతీ జవాబు.. తమ పార్టీని, తమ నాయకులను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లుగా ఉందే తప్ప తాము వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేసేలా లేదని తెలిపింది. 'తటస్థతకు సంబంధించి మిగిలి ఉన్న అవశేషాలేమైనా మిగిలి ఉంటే.. వాటిని కూడా తొలగించుకోవాలన్నదే ఈసీ లక్ష్యమైతే ఆ దిశగా ఈసీ అద్భుతంగా పని చేస్తున్నట్లుగానే కనిపిస్తోంది' అని పేర్కొంది. ఈసీ తీరు ఇలాగే ఉంటే తాము న్యాయపోరాటం చేయటానికి వెనుకాడబోమని హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, అశోక్ గెహ్లోత్, భూపేందర్ హుడా, అజయ్ మాకెన్, అభిషేక్ మను సింఘ్వీ, ఉదయ్ భాన్, ప్రతాప్ బజ్వా, పవన్ ఖేరా సంయుక్తంగా ఈసీకి లేఖ రాశారు.

మేం అడిగిందేమిటి.. మీరు చెప్పిందేమిటి?

హరియాణా ఎన్నికల్లో బీజేపీ గెలిచిన అన్ని నియోజకవర్గాల్లో ఈవీఎంల బ్యాటరీలు 99 శాతం చార్జింగ్‌తో ఉన్నాయని, తాము గెలిచిన అన్ని స్థానాల్లో ఈవీఎంల బ్యాటరీలు 60-70 శాతం చార్జింగ్‌తో ఉన్నాయని.. దీనికి కారణమేమిటని కాంగ్రెస్ ఈసీని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని తాజా లేఖలో ప్రస్తావిస్తూ.. 'ఆ యంత్రం ఎలా పని చేస్తుంది అన్నదానిపైనే మీ సమాధానం ఉందిగానీ.. మేం లేవనెత్తిన ఒక కచ్చితమైన ఫిర్యాదుపైన మీరు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. మా ప్రశ్నలన్నింటికీ మీ సమాధానాలు ఇదే తరహాలో ఉన్నాయి. స్పష్టమైన జవాబులివ్వటం కంటే మాపైన, మా ఫిర్యాదులపైన దాడి చేయటం మీదనే మీరు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు' అని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు. 'మీకు మీరు క్లీన్‌చిట్ ఇచ్చుకోవటం మమ్మల్ని ఆశ్చర్యపర్చలేదు. ఎందుకంటే, అలా జరుగుతుందని మాకు తెలుసు. అయితే, మా పార్టీపై మీరు ఉపయోగించిన భాష, మాపై చేసిన ఆరోపణలు మేం మళ్లీ స్పందించాల్సిన అవసరం కల్పించింది. మా ఫిర్యాదులను, మా వాదనలను వినే బాధ్యత మీకుంది. అందుకు మీరు ఇష్టపడకపోతే.. మీ చేత ఆ పని చేయించటం కోసం మేం ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాన్ని చట్టాలు కల్పిస్తున్నాయి' అని తెలిపారు. తమ మీద చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేదంటే న్యాయపోరాటం మినహా తమకు మరో మార్గం లేదన్నారు. తమకున్న స్వల్ప వనరుల ద్వారా లభించిన సమాచారాన్ని ఈసీ దృష్టికి తీసుకొచ్చామని, ఈసీ వద్ద అపారమైన వనరులుంటాయని.. వాటితో, తాము పేర్కొన్న అంశాల్లో వాస్తవం ఉందా? లేదా? అని పరిశీలించవచ్చన్నారు. అనేక సందర్భాల్లో తాము లేవనెత్తిన అంశాలు సరైనవని ఈసీ కూడా గుర్తించిందని తెలిపారు.

ఎన్నికల కమిషనర్ నోట్‌ను తొక్కిపెడతారా?

ఈసీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ఆరోపణలు చేసే ఉద్దేశమే తమకు ఉంటే.. ఇటీవలి కాలంలో ఈసీ కీర్తికి భంగం కలిగించిన పలు అంశాలను తాము ప్రస్తావించేవారమని కాంగ్రెస్ నేతలు ఈ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మోదీ, అమిత్‌షాల ప్రసంగాలపై తాము వందకుపైగా ఫిర్యాదులు చేస్తే.. కనీసం ఒక్కదానిపై కూడా వారి మీద ఈసీ చర్య తీసుకోలేదని గుర్తు చేశారు. కానీ, తమ అధ్యక్షుడు ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీల ప్రసంగాలను మాత్రం పలుమార్లు ఈసీ ఆక్షేపించిందన్నారు. ఈ విషయంలో.. స్వయంగా ఎన్నికల సంఘానికి చెందిన ఒక మాజీ కమిషనర్ ఇచ్చిన అసమ్మతి నోట్‌ను కూడా బయటికి రాకుండా ఈసీ తొక్కిపట్టిందని వెల్లడించారు. ఎన్నికల్లో పారదర్శకతను పెంచటానికి చేసిన ప్రతి ప్రయత్నాన్ని ఈసీ అడ్డుకుందని, సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాతగానీ వీవీపాట్ల సంఖ్య పెంపునకు అంగీకరించలేదని గుర్తు చేశారు.

'బడ్జెట్'లోనే హామీలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)



చేశారు. కాగా, 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఖర్గే తోసిపుచ్చారు. పార్లమెంట్‌లో ఏకాభిప్రాయం లేకుండా ఒకేసారి ఎన్నికల నిర్వహణ అసాధ్యమని తెలిపారు. 'ప్రధాని ఏం చెప్పారో అది చేయరు. ఎందుకంటే ఈ బిల్లు పార్లమెంటుకు వచ్చినప్పుడు అందరి అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే అది సాధ్యం. కానీ అది జరిగే పని కాదు. జమిలి ఎన్నికలు అసాధ్యం' అని ఖర్గే పేర్కొన్నారు. కాగా, మోదీ మోసాలకు పాల్పడి ఎన్నికల్లో గెలుస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ఈవీఎంల ప్రామాణికతను ఆయన ప్రశ్నించారు. 'మోదీ ఏ ఎన్నికల్లోనూ గెలవలేదు. అంతా మోసమే. ప్రతిసారీ పది వేల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడమో లేదా 10వేల నుంచి 20వేల మంది పేర్లు కొత్తగా చేర్చడమో చేస్తున్నారు. అయితే ఈ నిజాన్ని ఎలా నిరూపించాలనేదే ప్రశ్న' అని ఖర్గే పేర్కొన్నారు.

కాంగ్రెస్ బూటకపు హామీలతో జాగ్రత్త: మోదీ

బడ్జెట్ పరిధిలోనే గ్యారెంటీలు ప్రకటించాలంటూ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. 'బూటకపు వాగ్దానాలు చేయడం సులభమే. వాటిని అమలు చేయడం ఎంత కష్టమో, అసాధ్యమో కాంగ్రెస్ గుర్తిస్తోంది' అంటూ ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా ప్రచారంలో హామీలతో ఊదరగొట్టారని, ఇప్పుడేమో ప్రజల ముందు వారి బండారం ఘోరంగా బట్టబయలైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ బూటకపు వాగ్దానాల సంస్కృతితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు.

మోదీ ట్వీట్లపై ఖర్గే కన్నెర్ర

ప్రధాని మోదీ విమర్శలపై ఖర్గే కన్నెర్ర చేశారు. బీజేపీ అంటేనే మోసపూరిత హామీలిచ్చే పార్టీ అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ధరల పెరుగుదలకు అడ్డుకట్టే లేకుండా పోయిందని, మంచి రోజుల సంగతి ఏమైందని, వికసిత్ భారత్ ఎక్కడ అంటూ ఆయన మోదీకి వరుస ప్రశ్నలు సంధించారు. మోదీ ఇచ్చే గ్యారంటీ అనేది 140 కోట్ల మంది భారతీయులపై వేసిన క్రూరమైన జోక్ అని ఖర్గే మండిపడ్డారు. ఇతరులపై వేలుపెట్టి చూపే ముందు మోదీ దీన్ని గుర్తించుకోవాలని సుచించారు.

లోకం తీరు



'ఉచిత బస్సు'పై పునరాలోచన

» కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

» డీకే వ్యాఖ్యలపై ఖర్గే తీవ్ర అసంతృప్తి



బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంశంపై పునరాలోచన చేస్తామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. టికెట్ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, డబ్బులు ఇస్తున్నా కండక్టర్లు తీసుకోవడం లేదని పలువురు మహిళలు తనకు మెయిల్ చేస్తున్నారని, అందుకే ఉచిత బస్సు ప్రయాణంపై మంత్రివర్గంలో చర్చించి పునరాలోచన చేస్తామని తెలిపారు. ఈ వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇందిరాగాంధీ వర్ధంతి సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య దీనిపై స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఐదు గ్యారెంటీలూ కొనసాగుతాయని, శక్తి గ్యారెంటీపై పునరాలోచన చేసే ఆలోచన ఏదీ లేదని సీఎం స్పష్టం చేశారు. డీకే వ్యాఖ్యలపై ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పథకాల అమలులో ఏమాత్రం వెనుకడుగు వేయరాదని, ఐదు గ్యారెంటీలు అమలు కావాల్సిందేనని అన్నారు. మరోవైపు, శక్తి పథకాన్ని పునఃసమీక్షించే అంశంపై తన ప్రకటనను వక్రీకరించారని డీకే శివకుమార్ అన్నారు. 'పార్టీ అధిష్ఠానం ఏం చెబితే దాన్ని పాటిస్తాం. నా ప్రకటనను వక్రీకరించారు. పథకాన్ని పునఃసమీక్షించాలని కొందరు సూచించారని మాత్రమే చెప్పాను. పథకాలను నిలిపివేసే ప్రసక్తే లేదు. బీజేపీ దీనిపై రాజకీయం చేయాలనుకుంటోంది' అని డీకే ఆరోపించారు.

దేశంలో అస్థిరతకు యత్నాలు!

బాహ్య, అంతర్గత శక్తుల ఎత్తులు.. సరిహద్దులపై రాజీ ప్రసక్తే లేదు

» అంగుళం భూమి కూడా వదులుకోం: ప్రధాని

» సర్ క్రీక్ వద్ద జవాన్లతో దీపావళి వేడుకలు



భుజ్, నవంబరు 1: భారత్ నానాటికీ శక్తిమంతంగా ఎదుగుతుండడం.. ఐకమత్య భావన పెరుగుతుండడం దేశ శత్రువులకు కంటగింపుగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. అందుకే దేశంలో అస్థిరత, అరాచకం సృష్టించేందుకు బాహ్య, అంతర్గత శత్రువులు పన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. ఖలిస్థానీ ఉగ్రవాదుల విషయంలో కెనడా-భారత్ దౌత్య సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా దీపావళి నాడు ఆయన జవాన్లతో గడిపారు. గుజరాత్‌లోని రణ్ ఆఫ్ కచ్ జిల్లాలోని సర్ క్రీక్ లైన్ వద్ద త్రివిధ దళాలు, బీఎస్ఎఫ్ సిబ్బందితో సంభాషించారు. అలాగే సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా నర్మద జిల్లాలో ఏకతా విగ్రహం వద్ద నివాళులు అర్పించి.. అక్కడకు వచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశ సరిహద్దులపై రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అంగుళం భూమిని కూడా వదులుకునేది లేదన్నారు. 'సర్ క్రీక్ ప్రాంతాన్ని యుద్ధరంగంగా మలిచేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయి. మన శత్రువు ఎంతో కాలంగా దీనిపై కన్నేసింది. దౌత్యం పేరిట కబళించాలని చూసింది. కానీ నాడు గుజరాత్ సీఎంగా ఉన్న నేను ఆ కుయుక్తులపై గళమెత్తాను. మీరంతా (సైనికులు) రక్షణ కవచంలా నిలిచినందున మాకెలాంటి ఆందోళనా లేదు. ఇది మన శత్రువుకు కూడా తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. అయితే దేశం లోపల, వెలుపల కొన్ని శక్తులు, వికృత మనస్తత్వాలు కలిగినవారు.. వక్రీకరించిన ఆలోచనలతో ఉన్నవారు.. అరాచకం, అస్థిరతల సృష్టికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అర్బన్ నక్సల్స్ దేశాన్ని చీల్చాలని చూస్తున్నారని.. వారితో ఎవరెవరికి బంధం ఉందో గుర్తించాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఇక కచ్ ప్రాంతంలో పర్యాటక రంగానికి అధిక అవకాశాలు ఉన్నాయన్నారు.

తూర్పు లద్దాఖ్‌లో పూర్వస్థితి

» పండుగ వేళ స్వీట్లు పంచుకున్న భారత్-చైనా బలగాలు

న్యూఢిల్లీ, నవంబరు 1: తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో భారత్-చైనా దేశాల బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవడంతో సరిహద్దు గస్తీని పునరుద్ధరించారు. డెమ్‌చోక్‌లో శుక్రవారం నుంచి గస్తీని నిర్వహిస్తోన్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. డెప్సాంగ్‌లో సైతం త్వరలోనే మొదలుపెట్టనున్నట్లు చెప్పాయి. మరోవైపు నాలుగేళ్లుగా కొనసాగిన ఘర్షణలు సద్దుమణగడంతో దీపావళి పండుగ వేళ వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి పలుచోట్ల రెండు దేశాల సైనికులు గురువారం ఒకరికొకరు స్వీట్లు పంచిపెట్టుకున్నారు. 2020 జూన్ 15న గల్వాన్ లోయ ప్రాంతంలో బలగాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్రరూపం దాల్చడంతో నాలుగేళ్లుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణకు చెందిన కల్నల్ సంతోష్‌బాబుతో సహా 20 మంది సైనికులు, పలువురు డ్రాగన్ సైనికులు మరణించారు. దాంతో రెండు దేశాల సైనికులు ఆ ప్రాంతంలో మోహరించాయి. ఇటీవల కుదిరిన ఒప్పందం మేరకు అక్టోబరు 29 నాటికి బలగాల ఉపసంహరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. దీంతో ఎల్ఏసీ వెంబడి 2020 నాటి యథాతథా స్థితి కొనసాగనుంది.

రష్యాకు సాయంపై అమెరికా కన్నెర్ర

400 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు..జాబితాలో భారత సంస్థలు

వాషింగ్టన్, నవంబరు 1: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు సాయం చేస్తున్న కంపెనీలు, వ్యక్తులపై అమెరికా కన్నెర్ర చేసింది. 400 సంస్థలు సహా వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో భారత్, చైనా, టర్కీ, థాయ్‌లాండ్, మలేషియా, దుబాయ్ దేశాలకు చెందిన కంపెనీలు, వ్యక్తులు ఉన్నారు. ఈ మేరకు అమెరికా విదేశాంగ, వాణిజ్య, ఆర్థిక శాఖలు వేర్వేరుగా ఆంక్షలు విధించాయి. విదేశాంగ శాఖ 120 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించగా, ఆర్థిక శాఖ 270 సంస్థలు, వ్యక్తులపై, వాణిజ్య శాఖ 40 మంది వ్యక్తులు, సంస్థలపై విడివిడిగా ఆంక్షలు విధించాయి. ఆయా వ్యక్తులు, కంపెనీల నుంచి రష్యా 'అక్రమ యుద్ధానికి' అందుతున్న సాంకేతికత, పరికరాలు, ఇతర సహాయక చర్యలకు బ్రేకులు వేయడమే ఈ ఆంక్షల ప్రధాన ఉద్దేశమని అమెరికా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. "రష్యా సైన్యానికి ఏ రూపంలో సాయం అందినా దానిని నిర్వీర్యం చేయాలన్నది అమెరికా లక్ష్యం" అని అమెరికా స్పష్టం చేసింది.

హిందూ అమెరికన్లకు రక్షణ కల్పిస్తాం: ట్రంప్

వాషింగ్టన్, నవంబరు 1: బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై ఇటీవల జరిగిన అనాగరిక దాడులను అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన ట్వీట్‌లో అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులను అధ్యక్షుడు బైడెన్, ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. రాడికల్ లెఫ్ట్ మత వ్యతిరేక ఎజెండా నుంచి హిందూ అమెరికన్లకు రక్షణ కల్పించడంతో పాటు వారి స్వేచ్ఛ కోసం పోరాడతామని చెప్పారు. భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామన్నారు.

బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ గురువు చిన్మయపై దేశద్రోహం

ఢాకా, నవంబరు 1: ప్రముఖ హిందూ సాధువు, ఇస్కాన్ గురువు చిన్మయ కృష్ణపై బంగ్లాదేశ్‌లోని మధ్యంతర ప్రభుత్వం దేశద్రోహం కేసు నమోదు చేసింది. ఆయనతో పాటు మొత్తం 19 మంది మైనార్టీ నేతలపై ఈ కేసులు నమోదు చేశారు. దీంతో బంగ్లాదేశ్‌లోని మైనార్టీలు ఆందోళనలు తీవ్రం చేశారు. రాజధాని ఢాకాతో పాటు అనేక చోట్ల మైనార్టీలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మహ్మద్ యూనిస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షేక్ హసీనా ప్రధాని పదవి నుంచి దిగిపోయాక బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై 2వేల సార్లు దాడులు జరిగాయని ఆరోపించారు.

లద్దాఖ్‌లో మార్స్ వాతావరణం!

» అంతరిక్ష కార్యక్రమాల కోసం ఇస్రో అనలాగ్ మిషన్.. దేశంలో ఇదే మొట్టమొదటిసారి

న్యూఢిల్లీ, నవంబరు 1: చంద్రుడు, అంగారకుడు లాంటి గ్రహాల్లోని వాతావరణాన్ని పోలిన పరిస్థితులను సృష్టించి, ఆ వాతావరణంలో వ్యోమగాములు ఎదుర్కొనే సవాళ్లను అధ్యయనం చేసేందుకు దేశంలోనే మొట్టమొదటి 'అనలాగ్ స్పేస్ మిషన్'ను ఇస్రో శుక్రవారం ప్రారంభించింది. ఇందుకోసం లద్దాఖ్‌లోని లేహ్‌లో ఎత్తైన కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసింది. లద్దాఖ్‌లో ఉండే ప్రత్యేకమైన, కఠినమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో లేహ్‌ను ఈ మిషన్ కోసం ఎంచుకున్నారు. హర్యామన్ స్పేస్‌ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లద్దాఖ్ యూనివర్సిటీ, ఐఐటీ బాంబేతో కలిసి ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. దీనికి లద్దాఖ్ కొండ ప్రాంతాల అభివృద్ధి సంఘం కూడా మద్దతు తెలిపింది. లద్దాఖ్ మంచు ఎడారి. అక్కడ ఉష్ణోగ్రతలు ఎండా కాలంలో 3-35డిగ్రీలు, చలికాలంలో -20 నుంచి -35డిగ్రీలు ఉంటాయి. నాసా ప్రకారం.. అనలాగ్ మిషన్ అనేది ఒక ఫీల్డ్ టెస్టు. భూ గ్రహాంతర వాతావరణ పరిస్థితుల్లో కొత్త సాంకేతికలు, రోబోటిక్ పరికరాలు, వాహనాలు, కమ్యూనికేషన్, విద్యుత్ వినియోగం ఇలా అంతరిక్ష యాత్రకు అవసరమైన అన్నింటిని పరీక్షిస్తారు. వాటిని పరిమితుల మేరకు ఎలా ఉపయోగించుకోవాన్నది దీని ద్వారా అంచనా వేస్తారు. వ్యోమగాములకు శిక్షణ ఇస్తారు.

పెళ్లైన కుమార్తెకూ కారుణ్య ఉద్యోగ హక్కు

» అమ్మాయికి పెళ్లైనా కుటుంబసభ్యురాలే

» ఎనిమిది వారాల్లో తగిన ఉద్యోగమివ్వండి

» దేవాదాయ శాఖకు ఏపీ హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివాహమైందనే కారణంతో కారుణ్య నియామకం కింద చనిపోయిన ఉద్యోగి స్థానంలో కుమార్తెకు దేవదాయశాఖ అధికారులు ఉద్యోగం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. తండ్రి మృతి చెందేనాటికి భర్త నుంచి విడాకులు తీసుకొని, తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నట్లు ఆ పెళ్లైన కుమార్తె ఆధారాలు చూపించాలన్న ప్రభుత్వ నిబంధనలు వివక్షాపూరితంగా ఉన్నాయని పేర్కొంది. పెళ్లికాని కుమార్తె, కుమారుడి విషయంలో ఇలాంటి నిబంధన ఏదీ లేదని గుర్తుచేసింది. పెళ్లి అయిందనే కారణంతో కారుణ్య నియామకం కింది ఉద్యోగం నిరాకరించడానికి వీల్లేదని కోర్టు తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో పిటిషనర్ సిరిపల్లి అమ్ములుకు ఉద్యోగం ఇవ్వకపోవడం చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. ఆమెకు తక్షణం స్వీపర్‌గా లేదా తగిన ఉద్యోగం కల్పించాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించింది. 2013 జూన్ 24 నుంచి సర్వీసు బెనిఫిట్స్ కల్పించాలని స్పష్టం చేసింది. ఉత్తర్వులను 8వారాల్లో అమలు చేయాలని తేల్చిచెప్పింది.

ఏం జరిగింది?

విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న వి.జగదీశ్ 2013 జూన్ 24న మరణించారు. సర్వీసులో ఉండగానే మరణించిన నేపథ్యంలో సర్వీసుతో పాటు ఇతర ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ పిటిషనర్ సిరిపల్లి అమ్ములు, అక్క ఏడుకొండలు మోహన ఆలయ ఈవోను పలుమార్లు కోరారు. జగదీశ్ వారసురాలిగా అమ్ములును ధ్రువీకరిస్తూ విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జారీ చేసిన వారసత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను ఈవోకు అందజేశారు. అయితే కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేందుకు భర్త నుంచి విడాకులు తీసుకున్నట్లు కోర్టు ఇచ్చిన డిక్రీ తీసుకురావాలని అమ్ములును ఆదేశిస్తూ 2016లో ఈవో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీనిపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పెళ్లైన కుమార్తెను కుటుంబసభ్యురాలిగా గుర్తించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. పెళ్లైనా, కాకున్నా కుమారుడు, కుమార్తె ఇద్దరూ జీవితకాలం కుటుంబంలో సభ్యులేనని స్పష్టం చేశారు. చట్ట నిబంధనలు పరిశీలిస్తే తల్లిదండ్రుల బాగోగులు చూడాల్సిన బాధ్యత కుమారుడిపై ఎంత ఉందో.. పెళ్లైన కుమార్తెపై కూడా అంతే ఉందన్నారు.

10 జన్‌పథ్ అంటే అంత ఇష్టమేం లేదు

న్యూఢిల్లీ, నవంబర్ 1: దేశ రాజధాని ఢిల్లీలోని 10జన్‌పథ్ నివాసంలో చాలా కాలం ఉన్నా తనకు ఆ ఇల్లంటే పెద్ద ఇష్టమేమీ లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. ఈ నివాసంలో ఉంటున్న సమయంలోనే 1991 మే 21న శ్రీపెరంబుదూర్‌లో తన తండ్రి రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారని గుర్తు చేశారు. రాజీవ్ హత్య తర్వాత ఆ ఇంటిని సోనియాకు కేటాయించారు. రాహుల్ ఇదే నివాసంలో పెరిగారు. ఎంపీగా తనకు కేటాయించిన నివాసాన్ని అనర్హత సమయంలో ఖాళీ చేసి ప్రస్తుతం తల్లితో కలిసి 10 జన్‌పథ్‌లోనే ఉంటున్నారాయన. దీపావళి సందర్భంగా టెన్ జన్‌పథ్‌లో రంగులు వేసేందుకు వచ్చిన కార్మికులతో రాహుల్ ముచ్చటించారు. వారితో కలిసి రంగులద్దారు. ఈ సందర్భంగా తీసిన వీడియోను ఆయన తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో షేర్ చేశారు. భారత్‌ను ప్రకాశవంతం చేసే వారితో దీపావళి అంటూ ట్యాగ్‌లైన్ ఇచ్చారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టివేత

» రూ.7కోట్ల విలువైన మత్తు పదార్థాలు..

» బ్యాంకాక్ నుంచి తెస్తూ పట్టుబడ్డ ఇద్దరు మహిళలు

శంషాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఇద్దరు మహిళా ప్రయాణికులు గురువారం తెల్లవారుజామున బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగారు. అధికారులు వారి బ్యాగులు తనిఖీ చేయగా అందులో హైడ్రోపోనిక్ వీడ్ కలిపిన మూటను గుర్తించారు. అందులో కెల్లోస్ చాక్లెట్ ప్యాకెట్లలో 13 వ్యాక్యూమ్‌లు కనిపించాయి. వాటిని ప్రత్యేక పరికరంతో పరీక్షించగా డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించారు. దాని బరువు దాదాపు 7.096 కేజీలుగా ఉంది. మార్కెట్ విలువ దాదాపు రూ.7 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు అంచనా వేశారు. మహిళా ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారించగా డ్రగ్స్ తీసుకొస్తున్నట్లు అంగీకరించారు. దీని వెనకాల ఎవరి హస్తం ఉంది? ఎక్కడి నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు? ఇందులో ఎంతమంది పాత్ర ఉంది? అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. పట్టుబడిన డ్రగ్స్‌ను సీజ్ చేశారు. శుక్రవారం ఆ ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ఆంధ్రజ్యోతి ఎడిటర్‌గా రాహుల్ కుమార్

ఎండీ వేమూరి రాధాకృష్ణ సమక్షంలో బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక నూతన ఎడిటర్‌గా ఎన్.రాహుల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 16 ఏళ్లకుపైగా ఆంధ్రజ్యోతి ఎడిటర్‌గా విశిష్ట సేవలందించిన కె.శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సమక్షంలో ఎడిటర్‌గా రాహుల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎడిటర్‌ను కె.శ్రీనివాస్ అభినందించారు. ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అసిస్టెంట్ ఎడిటర్ కృష్ణ ప్రసాద్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, ఇతర ఎడిటోరియల్ సిబ్బంది రాహుల్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలోకి విచారణ నిమిత్తం వెళ్తున్న రాజ్‌పాకాల

విచారణకు రాజ్‌పాకాల హాజరు

- ఆయనతోపాటు నాగేశ్వర్‌రావుపై ప్రశ్నల వర్షం
- 7గంటల పాటు కొనసాగిన విచారణ
- ఫామ్‌హౌజ్‌లో పార్టీకి మా కుటుంబ సభ్యులే హాజరయ్యారని చెప్పా: రాజ్‌పాకాల

చేవెళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడా ఫామ్‌హౌస్ కేసు విచారణ చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో కొనసాగింది. శుక్రవారం మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల, మరో వ్యక్తి నాగేశ్వర్‌రెడ్డిని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్, చేవెళ్ల సీఐ శ్రీలత ప్రశ్నించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 7 గంటల పాటు విచారణ కొనసాగింది. ఈ కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న రాజ్‌పాకాల, మరోవ్యక్తి నాగేశ్వర్‌రెడ్డి ముగ్గురు న్యాయవాదులతో కలిసి ఎక్సైజ్ అధికారుల ఎదుట హాజరయ్యారు. విదేశీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది..? ఎవరి వద్ద కొనుగోలు చేశారు..? ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి ఇంకా ఎవరెవరు హాజరయ్యారు.? అందులో ఇంకా మీ స్నేహితులు ఎంత మంది ఉన్నారు..? విజయ్ మద్దూరికి డ్రగ్స్ మీరే ఇచ్చారా..? గతంలో ఇంకా పార్టీలు ఎక్కడెక్కడా జరిగాయి? తదితర వాటిపై రాజ్‌పాకాల, నాగేశ్వర్‌రెడ్డిలపై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. ఇరువురి ఫోన్‌లను స్వాధీనం చేసుకొని స్టేట్‌మెంట్ రికార్డు చేసి అనంతరం వారిని విడిచిపెట్టారు. బీఎన్ఎస్ఎస్ 35 (3) సెక్షన్ కింద మరోసారి పిలిస్తే విచారణకు రావాలని అధికారులు వారికి సూచించారు. ఈ సందర్భంగా జన్వాడ కేసు విచారణ నిమిత్తం చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయం వద్ద చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. కాగా, జన్వాడ ఫామ్‌హౌస్ కేసులో రాజ్‌పాకాల విచారణకు సహకరిస్తున్నాడని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ తెలిపారు. అలాగే విచారణలో భాగంగా చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయానికి రావాలని అధికారులు పిలవడంతో వచ్చానని, వారు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇచ్చానని రాజ్‌పాకాల చెప్పారు. ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి తమ కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారని, పార్టీలో ఉపయోగించిన మద్యం కూడా లోకల్‌దే అని అధికారులకు తెలిపానని పేర్కొన్నారు.

త్వరలో పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

కష్టమని పేర్కొన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం రాజకీయ వేధింపులను ప్రారంభించిందని, వీటికి భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవాచేశారు.

ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజల్లోకి కేసీఆర్

కొత్తసంవత్సరంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజల్లోకి వస్తారని కేటీఆర్ తెలిపారు. తమ పార్టీ అధినేత సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, పార్టీ నాయకులందరికీ ఆయా అంశాలపై మార్గదర్శనం చేస్తున్నారని తెలిపారు. బాధ్యత కలిగిన ప్రతిపక్షనేతగా కొత్త ప్రభుత్వం తన హామీలు అమలు చేసేందుకు సరిపడా సమయం ఇచ్చారని, కొద్ది నెలల్లో కార్యాచరణ ప్రకటిస్తారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో.. ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదని కేటీఆర్ గుర్తు చేశారు. 20ఏళ్ల రాజకీయ జీవితంలో తన కుటుంబ సభ్యులను అవహేళనచేసి మాట్లాడినప్పుడు ఎంతో ఆవేదన కలిగిందన్నారు. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థం కాదని, ఈవిషయం అత్యంత బాధాకరమన్నారు. ఇవన్నీచూసి రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురయ్యానని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకనే.. ఈ నీచమైన రాజకీయ సంస్కృతి మొదలైందని, ఈ దశకూడా త్వరలో ముగిసిపోతుందన్న నమ్మకం తమకుందన్నారు. తమపై కక్షతో.. కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న నీచరాజకీయాలపై ప్రజల మద్దతుతో పోరాడతామన్నారు. రాజకీయపరమైన అంశాలపై విభేదాలే తప్ప తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ అగ్ర నాయకులందరితో తనకు వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందన్నారు.

అధికారంలోకి వచ్చాక పోలీసులపై చర్యలు

ప్రభుత్వ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనుల్లో కొంతమంది పోలీసు అధికారులు బిజీగా ఉన్నారని.. దీంతో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయన్నారు. అధికార పార్టీ పెద్దల మాటలు విని.. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై చట్ట విరుద్ధంగా రెచ్చిపోతున్న పోలీస్ అధికారులను గుర్తుపెట్టుకుంటాం. మేం అధికారంలోకి వచ్చాక వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

దళారులతో కుమ్మక్కై..

దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని.. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో విత్తుల కేటాయింపు జరగలేదని కేటీఆర్ ఆరోపించారు. ఈసీజన్లో



91.28లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని.. అక్టోబరు 28వరకు 913మంది రైతుల నుంచి కేవలం 7,629టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెడుతుంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం డైవర్షన్ పాలిటిక్స్‌లో బిజీ బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

నయవంచనపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి

అధికారం కోసం అలవిగాని హామీలతో తెలంగాణ ప్రజలను నమ్మించి నయవంచన చేసినందుకు కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రబడ్జెట్‌ను మించి గ్యారెంటీలు ఇస్తే.. దివాళాతీసే పరిస్థితి వస్తుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ స్పందించారు. ఆరు గ్యారంటీలతో వల వేసినప్పుడు తెలంగాణ బడ్జెట్ గురించి తెలియదా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ గ్యారెంటీలు నమ్మిన పాపానికి.. ఏడాదికాలంగా తెలంగాణకు జరిగిన నష్టం పూడ్చలేనిదని, కాంగ్రెస్ చేసిన మోసం క్షమించరానిదని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకు.. కేటీఆర్ పాదయాత్ర డ్రామా: బీర్ల ఐలయ్య

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకు పాదయాత్ర పేరుతో కేటీఆర్ డ్రామాలు మొదలు పెట్టారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ధ్వజమెత్తారు. హరీశ్‌రావును ఎక్కడ ప్రతిపక్ష నేతను చేస్తారోనన్న భయంతోనే ఆయన పాదయాత్రకు పూనుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు కేటీఆర్ డ్రామాలు అన్నీ తెలుసునని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన పార్టీకి డిపాజిట్లు కూడా రావని అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేటీఆర్ ఈ కొత్త డ్రామాలను పక్కన పెట్టి ముందు కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటికి తీసుకురావాలన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ప్రజాపాలన నడుస్తోందని, రైతులకు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, పేదలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండరు ఇస్తున్నామని ఐలయ్య పేర్కొన్నారు.

కార్ డ్రైవింగ్ చేస్తుండగా గుండెపోటు

- ఈఎస్ఐ డాక్టర్ మృతి



డాక్టర్ శ్రీనివాస్ (ఫైల్)

అల్లాదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవింగ్ చేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఓ వైద్యుడు మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పెద్దఎడిగి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ (40) సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఆయన స్వగ్రామానికి వెళ్లి, శుక్రవారం ఉదయం తిరిగి ఆస్పత్రికి వెళ్తున్న క్రమంలో చిల్వర్ గ్రామ సమీపంలో ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన తన కారును 161వ జాతీయ రహదారి పక్కన ఆపివేశారు. అటుగా వెళ్తున్న గ్రామస్థులు గమనించి 108కు సమాచారం అందించగా, వారు వచ్చి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. డాక్టర్ శ్రీనివాస్ భార్య సీత బింధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన పాఠశాలలో విద్యార్థినులకు అస్వస్థత

- 3 రోజుల్లో 45 మందికి వాంతులు, విరేచనాలు

వాంకిడి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలోని విద్యార్థినులు మూడు రోజుల నుంచి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవుతున్నారు. బుధవారం దాదాపు 30 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో వారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గురువారం మరో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో బాలికలను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మరో 11మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రోజురోజుకూ అస్వస్థతకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు. సమాచారం తెలుసుకున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ.. గురువారం స్థానిక గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను, ప్రభుత్వవైద్యశాలను సందర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

అప్పుల బాధతో రైతు, గల్ఫ్ కార్మికుడి ఆత్మహత్య





మల్లయ్య, ఆవునూరి భాస్కర్(ఫైల్)

ఏటూరునాగారం, గంభీరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు రైతు, మరో ఘటనలో గల్ఫ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన చెన్నూరి మల్లయ్య(55)కు ఆరెకరాల భూమి ఉండగా మిర్చి పండిస్తున్నాడు. సుమారు రూ.7 లక్షల అప్పు అయ్యింది. అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందిన మల్లయ్య బుధవారం తన పొలం వద్ద గడ్డి మందు తాగాడు. ఇంటికి వచ్చి సొమ్మసిల్లిన అతడిని కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా గురువారం సాయంత్రం మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఆవునూరి భాస్కర్(28) బతుకు దెరువు కోసం అప్పులు చేసి మూడుసార్లు గల్ఫ్‌కు వెళ్లాడు. వెళ్లిన ప్రతీసారి సరైన పనిలేక అవస్థలు పడ్డాడు. పస్తులు ఉండే పరిస్థితి రావడంతో స్వదేశానికి తిరిగి వచ్చాడు. అప్పులు సుమారు రూ.5 లక్షల వరకు పేరుకుపోయాయి. అవి తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయాడు. గురువారం తెల్లవారుజామున పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు.

విత్తనాలు విత్తే యంత్రంలో పడి మహిళ.. రోటోవేటర్‌లో నలిగి రైతు మృతి

- హార్వెస్టర్‌లో ఇరుక్కొని తెగిపడ్డ డ్రైవర్ చెయ్యి



రేణుక(ఫైల్)

కొత్తకోట, శంకరపట్నం, హత్నూర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రాలతో పనులు చేస్తుండగా జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో ఓ రైతు, మహిళా కూలీ మరణించగా ఓ వ్యక్తి చెయ్యి మణికట్టు వరకు తెగిపోయింది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నాటవెల్లి పెద్దతండాలో గురువారం జరిగిన ఘటనలో విత్తనాలు విత్తే యంత్రంలో పడి రేణుక(30) అనే కూలీ మరణించింది. ఇక, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బడంపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగిన ఘటనలో గవ్వల కొమురయ్య(50) తన పొలంలో ట్రాక్టర్ రోటోవేటర్‌తో దుక్కి చదును చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం చింతలపల్లి శివారులో గురువారం జరిగిన ఘటనలో వరి కోస్తుండగా హార్వెస్టర్‌లో ఇబ్బంది తలెత్తింది. దీంతో హార్వెస్టర్ డ్రైవర్ పోనేటి శ్రీకాంత్ మరమ్మతు చేస్తుండగా అతని చెయ్యి హార్వెస్టర్ కట్టర్‌లో ఇరుక్కొని మణికట్టు వరకు తెగిపడింది.



చిన్న భీమన్న(ఫైల్)



రాల్లావత్ మాల్యానాయక్(ఫైల్)

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

మామడ, బిజినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రానికి చెందిన రెడ్డి చిన్న భీమన్న(46) అనే రైతు తన పంట చేలో పసుపు పంటకు గురువారం నీరు పెట్టేందుకు వెళ్లి మోటార్‌కు విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైర్ తెగి ఉండడం గమనించక విద్యుత్ షాక్ తగిలి మరణించారు. ట్రాన్స్‌ఫార్మర్ జంపర్‌కు మరమ్మతు చేయబోయి విద్యుదాఘాతానికి గురై రాత్లావత్ మాల్యానాయక్(34) అనే మరో రైతు మృతి చెందాడు. నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలోని వసురాం తండా పంచాయతీ పరిధిలోని అలుగు తండాకు చెందిన మాల్యానాయక్‌తో పాటు అదే తాండకు చెందిన ఇద్దరు రైతులు, గంగారం గ్రామానికి చెందిన మరో ఇద్దరు రైతులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం అలుగు తండా వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు చేసేందుకు పూనుకున్నారు. మాల్యానాయక్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపైకి ఎక్కాడు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఒక విద్యుత్ లైన్ ఫ్యూజు వైర్ పట్టుకుపోయి ఉండటాన్ని గమనించని మాల్యానాయక్ జంపర్ వేసేందుకు యత్నించాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై పెద్ద మంటలు వచ్చి కింద పడి మృతి చెందాడు. పక్కనే ఉన్న నలుగురు రైతులు అప్రమత్తమై దూరంగా వెళ్లి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

జూన్‌కల్లా సీఎం మార్పు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తోందన్నారు. శుక్రవారం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లోని ఒకవర్గం రేవంత్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో లాబీయింగ్ చేస్తోందని చెప్పారు. మంత్రులు, సీనియర్ నాయకుల ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్.. రేవంత్ 7సార్లు ఢిల్లీకి వెళ్లినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. "హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట రేవంత్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, సీనియర్ నేత కేవీపీ రాంచందర్‌రావు సహా కొందరు మంత్రులు, సీనియర్ నాయకులు సోనియా దృష్టికి తీసుకువెళ్లారు. సోనియా గాంధీ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఫోన్‌చేసి రేవంత్‌తో మాట్లాడాలని సూచించారు. అయితే, డీకే ఫోన్‌కు రేవంత్ స్పందించలేదు. పైగా, అధిష్ఠానం నుంచి ఫోన్ వచ్చినా తాను స్పందించలేదని రేవంత్ ఇటీవల గొప్పగా చెప్పుకొన్నారు. దీనిని కూడా హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది" అని మహేశ్వర్‌రెడ్డి వివరించారు. "తనను సీఎం చేస్తే బీఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్‌ఎల్పీలో విలీనం అవుతుందని రేవంత్ కాంగ్రెస్ అధినాయకత్వానికి చెప్పారు. కానీ పది మందికి మించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాలేదు. పార్టీ అధినాయకత్వానికి రేవంత్‌పై ఆగ్రహానికి ఇది కూడా మరో కారణం" అని తెలిపారు. అయితే, కాంగ్రెస్ అధినాయకత్వం సీఎం మార్చి, రేవంత్ కాంగ్రెస్‌ను చీలిస్తే.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని మహేశ్వర్‌రెడ్డి జోస్యం చెప్పారు.

ఆయన చిలక జోస్యం చెప్పుకోవాలి: అడ్లూరి

మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. ఆయన ఎమ్మెల్యే కంటే చిలక జ్యోతిష్యుడిగా సరిపోతారని ఎద్దేవా చేశారు. మరోవైపు, మహేశ్వర్‌రెడ్డికి సొంత పార్టీ బీజేపీలోనే ప్రాధాన్యం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు.

దీపావళి దాటింది.. రాజకీయ బాంబులు పేల్చలేదేం

కాంగ్రెస్ నేతలవి ఉత్తర కుమార ప్రగల్భాలే

నాయకుడు లేని నావలా బీఆర్ఎస్: బండి

బెజ్జంకి/సిరిసిల్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): "దీపావళి తర్వాత రాజకీయ బాంబులు పేలుతాయని కాంగ్రెస్ నేతలు చెప్పారు. పండుగ దాటినా ఎలాంటి బాంబులు పేలలేదు. కాంగ్రెస్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలే" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెల్జీపూర్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే దేవాలయాలపై దాడులు జరగడం ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు లేని నావలా తయారైందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటేనన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరు నెలలుగా ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారని, కుటుంబానికి ఆపదొస్తే తప్ప ఆయన నోరు విప్పరని విమర్శించారు. మూసీ పునరుజ్జీవం పేరుతో కాంగ్రెస్ నేతలు డ్రామాలాడుతున్నారని, రూ.లక్షన్నర కోట్లు దోచుకునే కుట్రకు తెరదీస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులు ఎన్నో ఆశలతో గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమైనా ప్రభుత్వం వారిని పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీవో 29ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్రాంచ్ మేనేజరే ప్రధాన నిందితుడు

- రూ.1.24 కోట్లతో పరారైన వ్యక్తి అరెస్టు
- 'మణప్పురం గోల్డ్‌లోన్ బ్యాంకు' కేసును ఛేదించిన వికారాబాద్ పోలీసులు

వికారాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన మణప్పురం గోల్డ్‌లోన్ బ్యాంకు కేసును పోలీసులు ఛేదించారు. బెట్టింగులు, జల్సాలకు అలవాటు పడ్డ బ్యాంకు మేనేజరే ప్రధాన నిందితుడని తేల్చారు. బంగారు ఆభరణాలు కుదువపెట్టే వారిలో 20 మంది కస్టమర్ల పైన 63 నకిలీ ఇన్వెంటరీ ఐడీలు సృష్టించి ఏకంగా రూ. 1.24 కోట్లు కాజేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ నారాయణ రెడ్డి వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా ఔరాద్ తాలూకా నారాయణపూర్ గ్రామానికి చెందిన విశాల్ వికారాబాద్ పట్టణంలోని మణప్పురం ఫైనాన్స్ (గోల్డ్ లోన్) లిమిటెడ్‌లో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అక్టోబరు 10న వికారాబాద్ బ్రాంచ్‌లో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలను ఆడిటర్ తన బృందంతో కలిసి తనిఖీ చేయగా, ఒక బంగారం ప్యాకెట్ తక్కువ వచ్చింది. దీంతో సంస్థ రీజినల్ మేనేజర్ రవీంద్ర కుమార్ అదేనెల 17న మణప్పురం బ్రాంచ్‌కు వెళ్లగా.. అక్కడ మేనేజర్ విశాల్ అందుబాటులో లేడు. అతడికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే ఆడిటింగ్ బృందం, ఇతర సిబ్బందితో కలిసి స్ట్రాంగ్ రూమ్‌లో పరిశీలించగా 2,944.226 గ్రాముల 63 బంగారం నగల ప్యాకెట్లు కనిపించలేదు. దీంతో విశాల్ నగలను దొంగతనం చేశాడని అనుమానించారు. విశాల్‌కు అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు శివప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి ఆడిటర్ రాజ్‌కుమార్‌లు సహకరించారని తెలుసుకున్న ఆర్ఎం రవీంద్రకుమార్ ముగ్గురిపై వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ సీఐ బలవంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం విశాల్‌ను తన సొంత గ్రామమైన నారాయణపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. బంగారం కుదువపెట్టకుండానే నకిలీ ఐడీలు సృష్టించి బ్యాంకు డబ్బును కాజేసినట్లు తేలింది. నిందితుడి నుంచి 83 గ్రాముల బంగారం, 10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.



మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లిలో గృహ నిర్బంధంలో కుటుంబ సభ్యులతో ఉన్న అఘోరీ

గృహ నిర్బంధంలో అఘోరీ

- ఆత్మార్పణ ప్రకటనతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మంచిర్యాల జిల్లా కుశ్నపల్లికి తరలింపు
- తల్లిదండ్రులకు అప్పగింత..

నెన్నెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం కోసం సికింద్రాబాదు ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆత్మార్పణం చేస్తానని ప్రకటించిన మహిళా అఘోరీని పోలీసులు మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లిలోని ఆమె స్వగృహంలో నిర్బంధించారు. నెల రోజులుగా అఘోరీ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలను సందర్శిస్తోంది. ముత్యాలమ్మ ఆలయంపై దుండగుల దాడి అనంతరం సనాతన ధర్మం ప్రమాదంలో ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం కేదారినాథ్ పర్యటనకు వెళ్లింది. ధర్మ పరిరక్షణ కోసం దీపావళి మరుసటి రోజున ముత్యాలమ్మ గుడి వద్ద ప్రాణత్యాగం చేస్తానని అఘోరీ కేదారినాథ్ నుంచే ప్రకటించడం కలకలం రేపింది. అనంతరం అక్టోబరు 28న రాష్ట్రానికి తిరిగి వచ్చింది. ఆత్మాహుతి ప్రకటనతో అప్రమత్తమైన పోలీసులు బుధవారం రాత్రి ఆమెను సిద్దిపేట వద్ద అదుపులోకి తీసుకొని బందోబస్తు మధ్య గ్రామానికి తీసుకొచ్చారు. తల్లిదండ్రులు చిన్నయ్య, చిన్నమ్మలకు అప్పగించారు. మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి ప్రజలను, మీడియాను అనుమతించడం లేదు. ముందుగా ప్రకటించినట్లు అఘోరీ తన ఇంట్లోనే శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రాణత్యాగం చేసుకుంటుందని ప్రచారం జరిగింది. అఘోరీ కుటుంబీకులతో చర్చించిన పోలీసులు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆమెకు సూచించారు. పలువురు కౌన్సెలింగ్ ఇచ్చారు. అఘోరీ తల్లిదండ్రులను బెల్లంపల్లికి తరలించిన పోలీసు ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు.

పూజలు చేసి...సచివాలయ భద్రత చేపట్టిన ఎస్పీఎఫ్

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం మేరకు సచివాలయం భద్రత విధుల్లో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(టీజీఎస్పీఎఫ్) సిబ్బంది చేరారు. సచివాలయం పరిధిలోని అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం, కవాతు చేశారు. ఆ తర్వాత సచివాలయ భద్రత విధుల్లో చేరారు. సచివాలయ భద్రతకు ప్రస్తుతం 212 మంది ఎస్పీఎఫ్ సిబ్బందిని ఉన్నతాధికారులు కేటాయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అన్నీ గుజరాత్‌కేనా..?

స్పెయిన్ అధినేత పెడ్రో శాంచేజ్‌తో కలసి, ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల గుజరాత్‌లోని వడోదరలో ఘనంగా ఆరంభించిన టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ ఇప్పుడు మహారాష్ట్రలో ఎన్నికల ముందు అధికారపక్ష కూటమిని ఆత్మరక్షణలో పడవేసింది. పదేళ్ళక్రితమే నరేంద్రమోదీ ప్రధాని అయినా, స్వరాష్ట్రం గుజరాత్‌మీద ఉన్న ప్రేమ మిగతారాష్ట్రాల మీద లేకపోయిందని, ఇతర రాష్ట్రాలకు దక్కాల్సిన ప్రాజెక్టులను కూడా ఆయన తన రాష్ట్రానికి తరలించుకుపోతున్నారని విపక్షాలనుంచి తరచుగా విమర్శలు వినబడుతూనే ఉన్నాయి. సి–295 సైనిక రవాణా విమానాల తయారీ నిమిత్తం ఏర్పాటు చేసిన ఆ కాంప్లెక్స్‌ని ఆరంభిస్తూ, ఆ విమానం ఎంత అద్భుతమైనదో ప్రధాని వివరించారు. వడోదరలో తయారైన విమానాలు ఇతరదేశాలకు ఎగుమతి అవుతాయనీ, ఈ ప్రాజెక్టు 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' ఆశయాన్ని బలోపేతం చేస్తుందని ప్రకటించారు. భారతదేశంలో తొలిసారిగా పర్యటించిన పెడ్రో శాంచేజ్‌తో కలసి రోడ్‌షో కూడా నిర్వహించారు. నరేంద్రమోదీ వ్యాఖ్యానించినట్టుగా, భారత్ గత దశాబ్దకాలంలో విమానయానరంగంలో సాధించిన ప్రగతికి, దేశం ఏవియేషన్ హబ్‌గా మారుతున్న తీరుకూ నిదర్శనంగా దీనిని యావత్ దేశం చూస్తుందని బీజేపీ నాయకులు భావించడం సహజం. అయితే, ఎన్నికలు దగ్గరపడుతున్న మహారాష్ట్రలో ఈ అంశం విపక్షాలకు అయాచిత ఆయుధంగా అందివస్తుందని మహాయుతి నేతలు ఊహించలేదు.

నాగపూర్‌లో ఏర్పాటు కావాల్సిన ఈ కర్మాగారం నరేంద్రమోదీ ఒత్తిడిమేరకు గుజరాత్‌కు తరలిపోయిందని మహారాష్ట్రలోని విపక్షపార్టీలు ఆరోపిస్తున్నాయి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ నాయకులంతా మహారాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుట్ర చేశారని కాంగ్రెస్‌పార్టీ, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన ప్రచారం చేస్తున్నాయి. మహారాష్ట్రకు రావాల్సిన ప్రాజెక్టులన్నీ ఎవరో కక్షకట్టినట్టుగా గుజరాత్‌కు వరుసపెట్టి పోతున్నాయని వారి ఆరోపణ. మహారాష్ట్రలో అధికారంలో కొనసాగడమే ముఖ్యమనుకొనేవారు ఉంటే, మరోపక్క గుజరాత్ కోసం ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేస్తూ అన్నీ తరలించుకుపోతున్నారని ఓ విపక్షనేత వ్యాఖ్యానించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ–ఎస్పీ) అధినేత శరద్‌పవార్ మరో అడుగుముందుకు వేసి అప్పుడెప్పుడో జరిగిన కొన్ని పరిణామాలను వివరించారు. మహారాష్ట్రలోనే ఈ ప్రాజెక్టు స్థాపించాలని రతన్‌టాటా నిర్ణయించుకున్నారని, నాగపూర్ ఎంఐడీసీ ఏరియాలో దీనికోసం ఐదువందల ఎకరాలను మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కేటాయించిందని, ఇంతలో ప్రభుత్వం మారడంతో నరేంద్రమోదీ స్వయంగా రతన్‌టాటాను పిలిపించుకొని, ప్రాజెక్టును వడోదరకు మార్చేయమని ఒత్తిడిచేశారని శరద్‌పవార్ వ్యాఖ్యానించారు. ఈ వయసులో ఇన్ని అబద్ధాలా అంటూ అధికారపక్షనేతలు ఆయనమీద ప్రతిదాడి చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రతిపాదన దశలో కూడా మహారాష్ట్ర పేరు లేదని, కేవలం గుజరాత్, యూపీ మాత్రమే ఉన్నాయని ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమర్థించుకున్నారు.

ఒకపక్క రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, గుజరాత్‌లో ఈ ప్రాజెక్టు ఆరంభం ఘనంగా జరగడం, తరలిపోయిందన్న ప్రచారం ఎక్కువకావడం మహాయుతి నేతలను ఇరకాటంలో పెడుతున్నది. 2022లో వేదాంత–ఫాక్స్‌కాన్ ప్రాజెక్టు కూడా ఇదే విధంగా చేజారిపోయిందంటూ ప్రత్యర్థులు ఇప్పుడు మళ్ళీ దానిని ఓటర్లకు గుర్తుచేస్తున్నారు. ఆఖరుక్షణంలో, రాష్ట్రప్రజలకు, నిరుద్యోగయువతకు వెన్నుపోటుపొడుస్తూ బీజేపీ అప్పట్లో ఈ ప్రాజెక్టు లోకేషన్ మార్చేసిందని వారి విమర్శ. గుజరాత్‌లో గిఫ్ట్‌సిటీ తెరమీదకు వచ్చినప్పుడు అది ముంబైలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్‌ను దెబ్బతీయడానికేనని ఓ ప్రచారం జరిగింది. గుజరాత్–మహారాష్ట్ర మధ్య జన్మవైరం దశాబ్దాలుగా ఉన్నదే. ఆవిర్భావం నాటి ఆగ్రహం, అక్కసు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. మరాఠీ ఆత్మగౌరవం, ఆధిపత్యంమీద తిరుగుబాటు వంటి మాటలు ఈ ఎన్నికలకాలంలో మరింత వినబడుతుంటాయి. టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వివాదం వల్లనే కాబోలు, గుజరాత్, మహారాష్ట్రలలో ఏది ఎక్కువ విదేశీ పెట్టుబడులను ఆకర్షించిందో వివరించే డేటా ఒకటి ఇప్పుడు ప్రచారంలోకి వచ్చింది. కానీ, వాస్తవాలకంటే భావోద్వేగాలే ఎన్నికల్లో ఎక్కువగా పనిచేస్తాయని నాయకుల నమ్మకం.

భయపెడుతున్న ఆర్థిక భవితవ్యం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ సరికొత్తగా ద్రవ్య విధాన ప్రకటన చేసింది. అది మీడియా పతాక శీర్షికల్లో అందరినీ ఆలోచనామగ్నులను చేసింది. రెపో రేటు విధానమే అందుకు కారణమని మరి చెప్పనవసరం లేదు. బ్యాంకులు తమ వద్దనున్న అదనపు నిల్వలను రిజర్వ్ బ్యాంకు వద్ద ఉంచి నిధులు తీసుకోవడాన్ని రెపో అంటారు. ప్రభుత్వ సెక్యూరిటీల హామీతో ఆర్బీఐ తీసుకొనే ఒక స్వల్పకాలిక వడ్డీతో కూడిన అప్పు ఇది. ఈ అప్పుమీద తీసుకునే వార్షిక వడ్డీరేటునే రెపో రేటు అంటారు. రెపో రేటు వడ్డీరేట్లకు ప్రధాన సంకేతంగా మారింది. రెపో రేటు తగ్గడం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకునేవారికి ఆనందదాయక విషయం. ఎందుకంటే అవి, రిజర్వ్ బ్యాంక్ నుంచి తక్కువ వడ్డీ రేటుపై అప్పులు తీసుకుంటాయి. ఈ సొమ్మును తక్కువ వడ్డీపై తిరిగి ప్రజలకు అప్పుగా ఇస్తాయి. రెపో రేటు పెరగడం ద్రవ్యోల్బణం తగ్గాలని ఆశిస్తున్న వారికి సంతోషకరమైన విషయం. ఎందుకంటే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు రెపో రేటు ఒక సాధనం. రెపోరేటు యథాతథంగా ఉండిపోవడం జరిగితే అప్పులు తీసుకునేవారు, ద్రవ్యోల్బణం ఎప్పుడు తగ్గుతుందా అని నిరీక్షిస్తున్నవారు తమ ఆర్థిక భవితవ్యం విషయమై వివిధ అంచనాలకు రావడాన్ని అనివార్యం చేస్తుంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మార్చి 27, 2020న రెపోరేటును 5.0 శాతం నుంచి 4.0 శాతానికి తగ్గించారు. ఇది చాలా పెద్ద కోత. కోవిడ్ ప్రభావిత ఆర్థిక వ్యవస్థ మాంద్యం ముప్పు నెదుర్కొంటున్న కారణంగా రెపో రేటును తగ్గించారు. ఆ తగ్గిన రేటు 26 నెలల పాటు అమలులో ఉన్నది. కోవిడ్ విలయం ముగిసి, ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుంటున్న సూచనలు కన్పించగానే రెపోరేటును స్వల్పంగా పెంచారు. ద్రవ్యోల్బణ అంచనాలను నియంత్రించేందుకై రెపోరేటును 4 నుంచి 4.40 శాతానికి పెంచారు. ఫిబ్రవరి 2023 నాటికి అది 6.50 శాతానికి పెరిగింది. గత 20 నెలలుగా అది అలానే ఉండిపోయింది ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మే 2022 నుంచి ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు అయితే రెపో రేటు మార్పుని కారణంగా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో ఆర్బీఐ ఇంతవరకు సఫలం కాలేదు.

ఆర్బీఐ గవర్నరే కాదు, ఏ కేంద్ర బ్యాంకు గవర్నర్ కూడా అందరినీ తన నిర్ణయాలతో సంతృప్తిపరచలేడు. యూపీఏ ప్రభుత్వం ఒక ద్రవ్య విధాన కమిటీని నియమించింది. ఆర్బీఐ గవర్నర్ బాధ్యతల బరువు పంచుకోవడమే ఆ కమిటీ ఏర్పాటు లక్ష్యం. అయితే రెపో రేటుగానీ మరేదైనా విషయమై గానీ తుది నిర్ణయం మాత్రం ఆర్బీఐ గవర్నర్‌దే.

ద్రవ్యోల్బణాన్ని 4 శాతంగా ఉంచాలన్నది లక్ష్యం. అయితే ద్రవ్యోల్బణం ఆ లక్ష్య దిశగా లేదు. ఆహార, ఇంధన ధరలు పరిస్థితులను క్లిష్టం చేస్తున్నాయి. వడ్డీరేటు మార్పుకు అవి ప్రతిస్పందించడం లేదు. సెప్టెంబర్ 2024లో గత ఏడాది ధరల కంటే టొమాటో ధర 42.4 శాతం, ఉల్లిపాయల ధర 66.2 శాతం, పొటాటో ధర 65.3 శాతం పెరిగాయి. రెపో రేటును యథాతథంగా ఉంచడాన్ని ఆర్బీఐ గవర్నర్ సమర్థించారు. రెపో రేటు అధిక స్థాయిలో ఉంటే ఆర్థిక వ్యవస్థ పెరుగుదల కుంటుపడుతుందనేది ఒక ప్రతి వాదన.

ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, ద్రవ్యోల్బణం అదుపు అనేవి అటు ప్రభుత్వ, ఇటు ఆర్బీఐ ప్రాథమిక బాధ్యతలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండగలదని శక్తికాంత దాస్ అంచనా వేశారు. అలాగే ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండగలదని ఆయన భావిస్తున్నారు ద్రవ్యోల్బణం ఇంకా ఆ స్థాయికి రాలేదు. ద్రవ్యోల్బణం రేటు సెప్టెంబర్ 2024లో 5.49 శాతంగా ఉన్నది. అఖిల భారత వినియోగదారు ఆహార ధర సూచీ 9.24 శాతం వద్ద ఉన్నది. ఈ నెలలో విడుదలైన ఆర్బీఐ ద్రవ్య విధాన నివేదిక ఆ రెండు అంశాలపై ఏమి చెప్పిందో వివరంగా చూద్దాం.

ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సంబంధించి ప్రభుత్వ గణాంకాలను ఏకరవు పెట్టిన తరువాత ఆ నివేదిక ఇలా వ్యాఖ్యానించింది: 'అనిశ్చిత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, పెచ్చరిల్లుతున్న భౌమ రాజకీయ ఘర్షణలు, పెరుగుతున్న సరఫరా గొలుసు ఒత్తిళ్ల మొదలైనవాటి కారణంగా ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఆశాజనకంగా లేదు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్‌లో తగ్గుదల, వాతావరణ మార్పు కారణంగా తరచు ప్రాకృతిక విపత్తులు వాటిల్లడం మొదలైనవి కూడా ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సానుకూలంగా లేవు'.

ఇక ద్రవ్యోల్బణం అదుపు విషయమై ఎదురవుతున్న చిక్కుల గురించి ఆ నివేదిక ఇలా పేర్కొంది : పెరుగుతున్న ప్రపంచ సరఫరా ఒత్తిళ్లు, ప్రతికూల వాతావరణ సంఘటనలు, వర్షపాతం అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా లేకపోవడం, ఎడతెగకుండా కొనసాగుతున్న భౌమ రాజకీయ ఘర్షణలు, తత్ఫలితంగా సరఫరాలకు అంతరాయం, ఆహార, లోహ, ధరల పెరుగుదల, క్రూడాయిల్ ధరల చంచల స్వభావం మొదలైనవి ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు దోహదపడడంలేదు. ఆర్థిక మంత్రిత్వ శాఖ 'మంత్లీ ఎకనామిక్ రివ్యూ' అంచనా నిక్కచ్చిగా ఉన్నది. భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు 'సంతృప్తికరం'గా ఉందని పేర్కొంటూ డిమాండ్ పరిస్థితులను జాగ్రత్తగా గమనించవలసి ఉన్నదని హెచ్చరించింది. భౌమ రాజకీయ ఘర్షణలు అంతకంతకూ పెచ్చరిల్లిపోవడం, కొన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలోని ద్రవ్యవిపణులలో మూల్య నిర్ధారణలు అధిక స్థాయిలో ఉండడం మొదలైనవి కూడా మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సానుకూలంగా లేవని 'మంత్లీ ఎకనామిక్ రివ్యూ' పేర్కొంది. ఎన్‌సిఎఇఆర్‌కు మంత్లీ ఎకనామిక్ రివ్యూ అంచనా సమతౌల్యంగా ఉన్నది. పెరుగుదలకు దోహదం చేస్తున్న అంశాలను ప్రస్తావించిన తరువాత పలు ప్రతికూల అంశాలను పేర్కొంది. బ్యాంకు రుణాల మంజూరులో తగ్గుదల, వ్యక్తిగత రుణాలలో తగ్గుదల, రూపాయి విలువ పడిపోవడం, విదేశీ పెట్టుబడుల రాక తగ్గిపోవడం మొదలైన వాటిని ప్రస్తావించింది.



ఆర్థిక వ్యవస్థపై విహంగ దృష్టి కంటే అందుకు వ్యతిరిక్తంగా కింది నుంచి పరిశీలించవలసిన అవసరమున్నది. స్థూల ఆర్థిక రంగాన్ని పరిశీలించడంలో విహంగ దృష్టి ముఖ్యమైనది అయినా కింది నుంచి చేసే పరిశీలనలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న యాతనలు విశదమవుతాయి. ఈ ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు సవ్యంగా లేవు. దేశీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు సమస్యల మయంగా ఉన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు జాగరూకతతో ఉండడం అవశ్యం.

నా అభిప్రాయంలో ఆర్థిక వ్యవస్థపై విహంగ దృష్టి కంటే అందుకు వ్యతిరిక్తంగా కింది నుంచి పరిశీలించవలసిన అవసరమున్నది. స్థూల ఆర్థిక రంగాన్ని పరిశీలించడంలో విహంగ దృష్టి ముఖ్యమైనది. అయితే కింది నుంచి చేసే పరిశీలనలో సామాన్య ప్రజలకు సమకూరుతున్న ప్రయోజనాలు, వారు ఎదుర్కొంటున్న యాతనలు విశదమవుతాయి. ప్రజలను అమితంగా ఆందోళన పరుస్తున్న విషయాలు: పెచ్చరిల్లుతున్న నిరుద్యోగిత, అధిక ద్రవ్యోల్బణం, ఎదుగుబొదుగు లేని వేతనాలు, పేదలు, సంపన్నుల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మితిమీరిన క్రమబద్ధీకరణ, జీఎస్టీ పాలనా వ్యవహారాలు కఠోరంగా, భరించలేనివిగా ఉండడం, నాణ్యత కొరవడిన విద్య, అందుబాటులో లేని వైద్య సేవలు, ప్రభుత్వోద్యోగుల నిర్లక్ష్య వైఖరులు, పేదల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన సొమ్మును సంపన్నులకు అనుకూలంగా వ్యయపరచడం మొదలైనవి. వీటితో పాటు మరెన్నో విషయాలు ప్రజల శ్రేయస్సుకు తీవ్ర భంగం కలిగిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనవి యుద్ధాలు. పశ్చిమాసియాలో అమానుష యుద్ధం, దాని ప్రభావం మరిన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై పడుతోంది. అలాగే రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో నాటో దేశాలు సైతం పాల్గొనడం అనివార్యమయ్యే పరిస్థితులు క్రమంగా నెలకొనడం. సరే, ఈశాన్య భారత రాష్ట్రమైన మణిపూర్‌లో పరిస్థితులు ఏ క్షణాన అయినా బద్దలయ్యే అగ్ని పర్వతంలా కొనసాగుతుండడం ఎంతైనా ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్ర ఎన్నికలలో ప్రజల తీర్పు ఆశ్చర్యకరంగా ఉండవచ్చు. చైనా–తైవాన్, అలాగే ఉభయ కొరియాల మధ్య పరిస్థితులు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవచ్చు. మొత్తం మీద దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఆశాజనకంగా లేదన్నది ఒక కొట్టివేయలేని వాస్తవం. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలు జాగ్రత్తపడడం అవశ్యం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఫ్రీలాన్స్ జర్నలిజం... 'సుప్రీం' వ్యాఖ్యలు సబబేనా?

న్యాయవాద వృత్తిలో ఉంటూ జర్నలిస్టు వృత్తిలో ఎలా కొనసాగుతారంటూ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ అనే న్యాయవాది, బ్రజేష్ భూషన్ అనే ప్రజాప్రతినిధిపై వేసిన పరువునష్టం దావాపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో ఈ విషయమై ప్రస్తావన వచ్చింది. ఇదే అంశంపై జూలై 29న "అడ్వకేట్ వర్కింగ్ యాజ్ ఫ్రీలాన్సర్ ఈజ్ మిస్ కండక్ట్" అంటూ అడ్వకేట్ కమ్రాన్ విషయంపై విచారించాల్సిందిగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)కి లేఖరాసింది. అయితే ఈ విషయానికి అప్పట్లో అంత ప్రాచుర్యం లభించలేదు. తాజాగా "మహ్మద్ కమ్రాన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్" కేసులో మళ్లీ అడ్వకేట్ డ్యుయల్ రోల్‌పై సుప్రీంకోర్టు కీలక ప్రకటన చేసింది. బీసీఐకి మరో లేఖ పంపినట్టు వార్తలు వచ్చాయి. న్యాయవాది రెండు వృత్తులను ఎలా నిర్వహిస్తారు అన్నది ఇక్కడ సుప్రీంకోర్టు అభ్యంతరం.

వాస్తవానికి జర్నలిస్టుకూ, ఫ్రీలాన్స్ జర్నలిస్టుకూ చాలా తేడా ఉంది. జర్నలిజం అనేది వృత్తి, కానీ ఫ్రీలాన్స్ జర్నలిజం కేవలం ప్రవృత్తి మాత్రమే. జర్నలిస్టులు/ రిపోర్టర్‌లు నిత్యం వార్త సేకరణ పనిలో ఉంటారు. వారు పని చేసే సంస్థలు వారికి ఇచ్చిన అసైన్‌మెంట్ పూర్తిచేసే పనిలో ఉంటారు. రెవెన్యూ, సర్క్యులేషన్ పెంచడం కూడా ఇటీవల వారి విధుల్లో భాగమైపోయింది. కానీ ఫ్రీలాన్స్ జర్నలిస్టుకు ఏ సంస్థతోనూ పూర్తిస్థాయి బాధ్యతాయుతమైన సంబంధాలు ఉండవు. వారు కేవలం కొన్ని విషయాలను మాత్రమే మక్కీకి మక్కీ అందించాలి. ఎందుకంటే కొన్ని కొన్ని న్యూస్ ఏజన్సీలు మాత్రమే వీరిని వార్తల కోసం ఆశ్రయిస్తాయి. ప్రధాన స్రవంతి మీడియాలో వీరికి అవకాశాలు చాలా తక్కువ. ఫ్రీలాన్స్ జర్నలిస్టులు ఏ వ్యక్తికి లేదా సంస్థకు లేదా వ్యవస్థలకూ వ్యతిరేకంగా వార్తలు రాయరు. వివాదాల్లో తలదూర్చరు. ఏ సంస్థ పేరు మీద కూడా వ్యాపార ప్రకటనలు, లేదా ఇతర ఆర్థిక లావాదేవీలు జరిపే అవకాశం లేదు. వ్యాసకర్తలుగా సమాజంలో వస్తున్న ఆధునిక పోకడలు, విపత్తులు, మారుతున్న సామాజిక పరిస్థితులపై విశ్లేషణలు రాయడం వరకు ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు సాధ్యమయ్యే పని. ఈ ప్రవృత్తిలో వీళ్లకు ఆర్థిక ప్రయోజనాలు ఉండే అవకాశాలు మృగ్యం. కానీ మహ్మద్ కమ్రాన్ విషయంలో జరిగింది పూర్తిగా విరుద్ధం. అతను ఫ్రీలాన్స్ జర్నలిస్టు ముసుగులో ఒక ప్రజాప్రతినిధిని టార్గెట్ చేయడంతో ఫ్రీలాన్స్ జర్నలిజాన్ని ఒక వృత్తిగా భావించి అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.



వ్యాసకర్తలుగా సమాజంలో వస్తున్న ఆధునిక పోకడలు, విపత్తులు, మారుతున్న సామాజిక పరిస్థితులపై విశ్లేషణలు రాయడం వరకు ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు సాధ్యమయ్యే పని. ఈ ప్రవృత్తిలో వీళ్లకు ఆర్థిక ప్రయోజనాలు ఉండే అవకాశాలు మృగ్యం. కానీ మహ్మద్ కమ్రాన్ విషయంలో జరిగింది పూర్తిగా విరుద్ధం. అతను ఒక ప్రజాప్రతినిధిని టార్గెట్ చేయడంతో ఫ్రీలాన్స్ జర్నలిజాన్ని ఒక వృత్తిగా భావించి అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

న్యాయవాది ఫ్రీలాన్స్ వ్యాసకర్తగా పని చేయడానికి వీల్లేదు అన్నప్పుడు న్యాయ విషయాలకు సంబంధించి, న్యాయస్థానాలకు సంబంధించి, వివిధ కోర్టు తీర్పులకు సంబంధించిన వార్తలు ఎవరు రాయాలీ అనే సందేహం కలగక మానదు. ఎందుకంటే సహజంగా రాసే వార్తలకూ న్యాయ పరిభాషలో రాసే వార్తలకూ కొంత వ్యత్యాసం ఉంటుంది. ఆయా జడ్జిమెంట్‌లను అర్థం చేసుకొని వార్త రూపంలో మలవాలంటే అది న్యాయవాద వృత్తిలో ఉంటూ భాష మీద పట్టు ఉన్నవాళ్లకు మాత్రమే సాధ్యమయ్యే విషయం. అలాగే రెండు వృత్తులు నిర్వహిస్తే రెండు వృత్తుల్లోనూ ఆర్థిక ప్రయోజనాలు ఉండాలి. కానీ ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేని వ్యాస రచనా ప్రవృత్తిని వృత్తిగా ఎలా గుర్తిస్తారనేది కూడా ఆలోచించాల్సిన విషయం. తాజాగా భారత ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుప్రీంకోర్టు వార్తలు కవర్ చేయడానికి న్యాయవిద్య పూర్తిచేసి ఉండాల్సిన పని లేదని స్పష్టం చేశారు. న్యాయస్థానం వార్తలను కవర్ చేయాలి అంటే న్యాయవాది అయి ఉండాల్సిన పనిలేదన్న సీజేఐ వ్యాఖ్యలకు ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఈ వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

లీగల్ కంట్రిబ్యూటర్స్ ఫ్రీలాన్స్ జర్నలిస్టుల కిందికి వస్తారా లేక వాళ్లకు ఈ నియమం వర్తించదా? అన్న విషయానికి వద్దాం. లీగల్ కంట్రిబ్యూటర్స్ అన్న పదంలోనే కంట్రిబ్యూషన్ అనే మాట ఉంది. అంటే విరాళం అని అర్థం. న్యాయవాదులుగా పని చేస్తూ ఏదో ఒక పత్రికకు లీగల్ కంట్రిబ్యూటర్‌గా పనిచేస్తూ వాటికి లీగల్ అప్‌డేట్స్ అందించడం వీరి పని. శిక్షపడ్డ తీర్పులు, చెక్ కేసులు, ఐపీ దాఖలు వార్తలు, లోక్ అదాలత్ వార్తలు, కొత్తగా విధుల్లో చేరిన విషయాలపై వార్తలు, న్యాయాధికారుల ఇతర సిబ్బంది బదిలీ వార్తలు, న్యాయవాద సంఘాల కాన్ఫరెన్స్‌లు... ఇలా న్యాయస్థానానికీ, దాని అనుబంధ వర్గాలకూ సంబంధించిన వార్తలను మాత్రమే లీగల్ కంట్రిబ్యూటర్స్ అందిస్తారు తప్ప ఏ వ్యక్తికి గానీ వ్యవస్థలకు గానీ అనుకూలంగానో, ప్రతికూలంగానో రాసే అవకాశమే లేదు. ఇందుకు గానూ వీరికి ఏ రకమైన ఆర్థిక ప్రయోజనాలు ఉండవు. కేవలం కంట్రిబ్యూషన్ మాత్రమే. వీరి విలువైన సమయాన్ని కేటాయించి, సదరు కాన్ఫరెన్స్‌లకు, జడ్జి గారి ప్రెస్ మీట్‌లకు హాజరై వార్తలు, ఫోటోలు పంపించినందుకు వీళ్లకు దక్కేది కేవలం ఒక గుర్తింపు మాత్రమే.

ప్రస్తుతానికి మహ్మద్ కమ్రాన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో ఇంకా తుది తీర్పు రాలేదు. తీర్పు వెలువడ్డాక ఈ అంశంపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యాయవాద విషయ విరాళ సేవకులు తమ విలువైన సమయాన్ని కేటాయించి స్వచ్ఛంద సేవ చేయాలా లేక న్యాయవాద వృత్తికే పరిమితమవ్వాలా అనే విషయంపై లీగల్ కంట్రిబ్యూటర్లు పునరాలోచించుకోవాల్సిన సందర్భం ఇది.

• అయితగాని జనార్దన్

పర్యావరణానికీ, నిర్వాసితులకూ మధ్య హైడ్రా!

భూ కబ్జాలు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచే జరిగాయి. అందులో చెరువులు, కుంటలు, నాలాలు అధికంగా కబ్జాకు గురి అయినాయి. దేశంలో ఏ మహానగరానికీ లేనంతగా మన హైదరాబాద్ నగరంలో నిజాం నిజాం సర్ఫేకాసు భూములన్నీ ప్రభుత్వ భూములుగా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం కారణంగా ఈ నీటి వనరులన్నీ మాయమయ్యాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ పేరుతో అవన్నీ తొలగించాలని హైడ్రా పేరున విస్తృతాధికారాలతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. పాత చట్టంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారికి రూ.1000 జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష, లేదా రెండూ చట్టంలో పొందుపరచబడి ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ భూమి దురాక్రమణ (నిరోధక) 1982 చట్టంగా ఉండింది. నమోదు కాబడిన చాలా కేసులపై లోతైన విచారణలు జరిగాయి. నేరం రుజువైనప్పటికీ ఎవరికీ శిక్ష పడలేదు, కనీసం జరిమానా కూడా విధించలేదు. 2016లో ఆ చట్టమే తీసివేశారు. అందుకే చట్టం పట్ల భయం లేదు. సమాజంలోని గౌరవనీయ స్థానంలో ఉన్నటువంటి వారి తప్పిదాలకు సాధారణ పౌరులు నష్టపోతున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో 168 నోటిఫైడ్ కాబడిన చెరువులు ఉన్నాయి. అవి ఇరవై నుంచి తొంభై శాతం వరకు కబ్జాకు గురయ్యాయి. వీటన్నింటికీ బౌండరీలు, హద్దులు, ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టిఎల్) పూర్తి స్థాయి నీటి మట్టం స్థిరీకరించి 30 ఫీట్లు అదనంగా నీటి నిలువను అంచనా వేస్తూ బఫర్ జోన్‌ను కూడా స్థిరపరిచారు. నిజానికి ఈ ఆక్రమణలు అన్ని తీసివేయాల్సిందే. అధికారులు, రాజకీయ నాయకులు, బిల్డర్లు, ప్రభుత్వ స్థలాలను అమ్మిన వాళ్లందరినపై ఏ చర్య తీసుకోకుండా వదిలేయడం సరైనది కాదు. అలాగే ఏ తప్పూ చేయని పేదలు హైడ్రాకు బలి కాకుండా చూడాలి. గత పది సంవత్సరాల నుండి కబ్జాలు మరీ యథేచ్ఛగా జరిగిపోయాయి. గొలుసుకట్టు లింకులు మూసీ నది ఆక్రమణలకు గురి అయ్యాయి. ఈ ఆక్రమణలకు ప్రధాన సూత్రధారులు బస్తీ లీడర్లు, గల్లీ లీడర్లు. వీరికి బలమైన అండగా ఉండేది స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు.

గమనించవలసిన విషయం ఏమిటంటే– బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ వీటిపై 1948 నుండి ఇప్పటి వరకు తుది నివేదిక లేదు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ పీకల్లోతు అవినీతితో కూరుకుపోయింది. చెరువులు, కుంటలు, నాలాలు అన్ని కబ్జాలు అయి పెద్దపెద్ద మాల్స్ వెలిసాయి. రెవిన్యూ సర్వేయర్, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి హద్దు రాళ్ళు వేసినారు. ఆ హద్దు రాళ్ళను దౌర్జన్యంగా తొలగించి ముందుకు జరిపారు. అధికారులు బదిలీ అయ్యాక పాత అధికారి ఇక్కడివరకే బౌండరీ గుర్తులు వేశారు అని దబాయించి మరీ అమ్మిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్ కూడా మూడు వందల ఎకరాల పైచిలుకు ఆక్రమణకు గురి అయింది. అందులో ప్రధాన పాత్ర గత ప్రభుత్వాలదే. అన్ని విచారణలూ చేసి లోన్ ఇచ్చిన బ్యాంకులకు ఇబ్బంది లేదు. వారు ఇచ్చిన డబ్బు మాఫీ కాదు. ఎఫ్‌టిఎల్ అని, బఫర్ జోన్ అని అన్ని విచారణలూ పూర్తి చేసి లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాతే బ్యాంకు లోన్ ఇస్తుంది. ఇందులో బ్యాంకు పాత్ర కూడా ఉంది. కూల్చివేయబడిన ఇంటికి తీసుకున్న రుణం మాఫీ అవ్వదు. తన లోన్ రికవరీని నిలుపుదల చేయదు. ఈ ప్రశ్నను బ్యాంకు అధికారులు వేసుకోవాల్సిన అవసరం ఉంది.

స్వాధీనం చేసుకోబడిన భూమిని ఏం చేస్తారు? ప్రజలు మాకు అధికారమిచ్చారు కాబట్టి మేము ఏదైనా చేయగలం అనేది సరికాదు. ప్రజలకు ప్రశ్నించే అధికారం ఉంది. మీరు హైడ్రా పేరు మీద తీసుకునే భూములలో వేల కోట్ల విలువైన భూములు ఉన్నాయి. అందులో వ్యాపార, వాణిజ్య స్థలాలు కూడా ఉన్నాయి. వాటిని ఏం చేస్తారు? అమ్మేస్తారా, లేక పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇస్తారా? ముందుగా ఉన్న చెరువును యథాస్థితికి తీసుకొస్తారా? ఇప్పుడు అంతటి విస్తీర్ణం గల చెరువులు పునరుద్ధరించడం సాధ్యమైతే కాదు. హైడ్రా మొదలైంది, ఆపడం ఎలా అనే సందిగ్ధంలో ఉన్న దశలో రాష్ట్ర హైకోర్టు ఈ పనిని ఆపగలిగింది. ఈ గ్యాప్ ఇలాగే ఉంటుందా? ఆగితే హైడ్రా పరిస్థితి ఏమిటి? దాని పర్యవసానం ఎలా ఉండబోతుంది? పర్యావరణ ప్రేమికులుగా మనం చూస్తూ ఊరుకోలేం. మరో పక్క ఏ తప్పూ చేయని వారు కూల్చిన ఇళ్లను చూసుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నారు. ఈ రెండింటి మధ్యా ఒక సమన్వయాన్ని హైడ్రా సాధించగలగాలి.

– వి.బాలరాజు, రిటైర్డ్ తహసిల్దార్

రైతుకు ఆసరా ఇవ్వని కొనుగోలు కేంద్రాలు

'ఈ ఏడాది ఆరు ఎకరాల్లో పత్తి వేశా. రూ.50వేల చొప్పున రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టిన. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. వరద వానలతో తెగుళ్లు విజృంభించి పంట ఎండిపోయింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. కష్టానికి కూడా ప్రతిఫలం దక్కేలా లేదు. ప్రభుత్వం పత్తి రైతులకు బోనస్‌తో పాటు నష్టపరిహారం కూడా ఇచ్చి ఆదుకోవాలి' అని భూపాలపల్లికి చెందిన చిట్యాల రైతు ర్యాకం రవీందర్ అంటున్నాడు. ఇలా పత్తి రైతులతో పాటు వరి, ఇతర పంటలు పండించిన రైతులు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు. రైతుల వేడుకోలు న్యాయమైనదే.

తెగుళ్ళు, చీడ పీడలు, వర్షాలను ఎదుర్కొని ఎలాగోలా రైతులు పత్తి తీసి విక్రయించటానికి నెలపాటు ఎదురు చూశారు. అదిగో ఇదిగో అంటూ అక్టోబరు మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా 269 కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం ప్రకటించింది. రైతులు ఆనందించారు. పత్తి మార్కెట్‌లో అమ్మి అప్పులు తీర్చుకోవచ్చని ఆశపడ్డారు. కానీ, కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తీరు చూసి ఆవేదన చెందుతున్నారు. తేమ అధికంగా ఉందంటూ అన్నదాతలను వెనక్కి పంపుతున్నారు. దీన్ని వ్యాపారులు అవకాశంగా తీసుకొని అతితక్కువ ధరలకు కొనుగోలు చేసి దోచుకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వ తప్పుడు విధానమే కారణం. పత్తి రైతులకు తేమ నిబంధనలు శాపంగా మారరాదు. సీసీఐ నిబంధన ప్రకారం పత్తిలో 8శాతం నుండి 12శాతం మధ్య తేమ ఉంటేనే మద్దతు ధర ఇవ్వాలి. అయితే ఈ సంవత్సరం వాతావరణం మబ్బుగా ఉండటం, తుఫానుల పేరుతో రాష్ట్రంలో వర్షాలు పడుతుండటం వల్ల తేమ శాతం అధికం కావటం సహజం. కనుక గతంలో వలే తేమ 15శాతం వరకు ఉన్నా కొనుగోళ్లు చేస్తూ, ప్రత్యేక పరిస్థితుల్లో 16శాతం నుంచి 25శాతం వరకు సడలించాలి. లేదంటే వ్యాపారులు తేమ శాతం ఎక్కువ చూపి రూ.1000–1500 తగ్గించి చెల్లిస్తే రైతు భారీగా నష్టపోతున్నాడు. అసలు ఎంఎస్‌పీ నిర్ణయమే తక్కువ. అది కూడా రైతుకు దక్కనందునే రాష్ట్రంలో పలుచోట్ల రోడ్డెక్కవలసివస్తున్నది.



కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తీరు చూసి పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. తేమ అధికంగా ఉందంటూ అన్నదాతలను వెనక్కి పంపుతున్నారు. దీన్ని వ్యాపారులు అవకాశంగా తీసుకొని అతితక్కువ ధరలకు కొనుగోలు చేసి దోచుకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వ తప్పుడు విధానమే కారణం. పత్తి రైతులకు తేమ నిబంధనలు శాపంగా మారరాదు.

ఈ సంవత్సరం రాష్ట్రంలో 1.60కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని, అందులో వరి 65లక్షల ఎకరాలు, పత్తి 63.53 లక్షల ఎకరాలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. కానీ పత్తి రాష్ట్రంలో 43,76,043 ఎకరాల్లో సాగయింది. దిగుబడి 25.33 లక్షల టన్నులు వస్తుందని అంచనా. పత్తి, వరి, ఇతర అన్ని పంటలూ అంచనాలకు తక్కువగానే సాగయినాయి. కాలం రైతుకు సహకరిస్తుందని నిపుణులు ప్రకటించినప్పటికీ, గతి తప్పిన వాతావరణ మార్పులతో అతివృష్టి, అనావృష్టి వరదలతో, చీడలతో, పంటలు బాగా దెబ్బతిన్నాయి. రైతులు పత్తికి ఎకరానికి రూ.40–60 వేల వరకు, వరికి ఎకరానికి రూ.30 వేలు వరకు, మిర్చికి రూ. లక్ష వరకు పెట్టుబడులు పెట్టి ఉన్నారు. ఇంత పెట్టుబడి పెట్టినా దిగుబడి సగమే వచ్చే పరిస్థితి ఉంది. 33శాతం పంట నష్టం జరిగితేనే పరిహారం ఇస్తానన్న ప్రభుత్వాలు 50శాతం నష్టపడ్డా సరిగా పట్టించుకున్న పరిస్థితి లేదు. పత్తి ఎకరానికి 10–12 క్వింటాళ్లు రావాలి. కానీ 3–5 క్వింటాళ్లకు మించదు. ఇలాంటి పరిస్థితుల్లో పండిన పంటలనైనా ప్రభుత్వం తన సంస్థల ద్వారా సకాలంలో కొనడానికి అన్ని జిల్లాలలో కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించలేదు. దీనితో ప్రైవేటు వ్యాపారులు ఎమ్ఎస్‌పీ కంటే తక్కువ ధరలకు కాజేస్తున్నారు. కేంద్రం ప్రకటించిన ఎమ్ఎస్‌పీ కూడా తక్కువగా ఉంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పత్తికి రూ.18,500, వరికి రూ. 5 వేలు కనీస మద్దతు ధర నిర్ణయించాలి. అలా నిర్ణయించనందునే రైతు నష్టపడి అప్పులపాలై ఆత్మహత్యల పాలవుతున్నాడు.

గత ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతులకు అనేక వాగ్దానాలు చేసి, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్, మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కానీ సంవత్సరం కావొస్తున్నా చేసిన హామీలు అమలు కావటం లేదు. ఒక్క రుణమాఫీకి సంబంధించి అనేక నిబంధనలు పేరిట రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు కూడా అమలు చేయలేదు రాష్ట్ర ప్రభుత్వం. రేపు మాపు అంటూ కాలం వెళ్ళదీస్తున్నది. తక్షణమే వ్యవసాయ మార్కెట్‌లలో పత్తి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్ని జిల్లాల్లో విస్తృతంగా ఏర్పాటు చేసి ప్రభుత్వ సంస్థలతో కొనుగోలు చేయాలి. వ్యాపారుల అక్రమ దోపిడీని అరికట్టాలి. పత్తి తేమ శాతం 16శాతం నుంచి 25శాతం వరకు పెంచాలి. వర్షాల వల్ల రంగు మారిన పంటలను కూడా ప్రభుత్వం ఎమ్ఎస్‌పీ ప్రకారమే కొనుగోలు చేయాలి. ఎమ్ఎస్‌పీని స్వామినాథన్ కమీషన్ సిఫార్సు ప్రకారం సి2+50% ధర నిర్ణయించాలి. మార్కెట్లలో, బయట ఉత్పత్తులు తడవకుండా కప్పటానికి టార్పాలిన్‌లు సరఫరా చేయాలి. షరతులు లేకుండా రూ.2లక్షల రుణ మాఫీ పథకం అర్హులందరికీ వెంటనే పూర్తి చేయాలి. రైతు భరోసా ఖరీఫ్–రబీ సీజన్లకు చెందిన రూ.15వేలు రైతుల ఖాతాలో వెంటనే వేయాలి. దొడ్డు, సన్న ధాన్యంతో పాటు అన్ని పంటలకు బోనస్ చెల్లించాలి. పసుపు, మిర్చి, చెరుకు పంటలకు ఎమ్ఎస్‌పీ నిర్ణయించాలి. 58 సంవత్సరాలు నిండిన రైతులందరికీ పెన్షన్ నెలకు రూ.10వేలు ఇవ్వాలి. రైతు బీమా, పంటల బీమాకు ప్రీమియం ప్రభుత్వమే భరించి అమలు చేయాలి. ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి. పంట ఉత్పాదకాలకు సబ్సిడీలు ఇవ్వాలని రాష్ట్ర రైతాంగం సమైక్యంగా, చైతన్యంతో పోరాడాలి. పాలకులు ఎన్నికల్లో రైతులకు చేసిన వాగ్దానాలన్నింటినీ అమలు చేయమని ఒత్తిడి చేయాలి. అప్పుడే రైతాంగ సమస్యలు కొన్నైనా పరిష్కారం అవుతాయని గుర్తించాలి.

■ కెచ్చెల రంగారెడ్డి
అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు

బెటాలియన్ వ్యవస్థను రద్దు చేయాలి!

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరి జీవితాలతో పాటుగా బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాల బ్రతుకులు కూడా మారుతాయి అనే ఆకాంక్షతో ఎదురుచూసిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబాల్లో నిరాశే మిగిలింది. గతంలో రాజకీయ పార్టీలు ఏక్ పోలీస్ వ్యవస్థ ఏర్పాటు విషయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగస్థులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు.

నాడు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పెరుగుతున్న వామపక్ష భావజాలాన్ని నియంత్రించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు ఈ బెటాలియన్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ గ్రే హౌండ్స్ అనే కొత్త పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ, మలిదశ తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో విప్లవ పార్టీలు కూడా తెలంగాణ రాష్ట్రానికై పోరాడాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తదనంతరం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూ, కొంతవరకు యువత ఆధునిక భావాల వైపు వెళ్తున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన కేసీఆర్, చంద్రబాబు నాయుడు కూడా నక్సలిజం ప్రభావం తగ్గిందని ప్రకటించారు. అంతేగాక, సీఆర్‌పీఎఫ్ లాంటి కేంద్ర బలగాలు జాతీయ స్థాయిలో దేశ రక్షణలో బాధ్యత వహిస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ పోలీస్ ఇండియన్ రిజర్వ్ అనే పేరుతో తెలంగాణ రాష్ట్ర బెటాలియన్ పోలీసులను వివిధ రాష్ట్రాలలో పని చేయించడం కూడా సహేతుకం కాదు. దేశంలో శాటిలైట్, ఇంటర్నెట్, జీపీఎస్ సదుపాయాల ద్వారా నిఘా వ్యవస్థలు కూడా పటిష్టమవుతున్న నేపథ్యంలో తెలంగాణ బెటాలియన్ స్పెషల్ పోలీస్ వ్యవస్థ ఆవశ్యకతా, మనుగడా నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ బెటాలియన్ పోలీస్ వ్యవస్థలో ఉన్న అంతర్గత అధికారిక ఒత్తిడి, వివక్షల కారణంగా ఎంతో మంది కానిస్టేబుల్ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. కానీ, ఇప్పటివరకు, ఆత్మహత్యలపై ఒక్క నిజనిర్ధారణ కమిటీ నియమించలేదు. ఒకే పోలీసు నియామక బోర్డు ద్వారా ఎంపికైన భిన్న విభాగ పోలీస్ వ్యవస్థలలో బెటాలియన్ వ్యవస్థకు సంబంధించిన పోలీసు ఉన్నతాధికారులు కంపెనీ మూమెంట్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీస్ స్టేషన్లను కేటాయించినప్పుడు సివిల్, ఏఆర్ లాంటి ఇతర పోలీసు విభాగాల నుంచి వివక్షలకు గురి కావడం ఒక రకమైన కుల వ్యవస్థని తలపిస్తుంది.

ఎన్నో సంవత్సరాలుగా నష్టపోతున్న పోలీస్ కానిస్టేబుల్ కార్మిక కుటుంబాలు డిమాండ్ చేస్తున్న అంశం అయిన 'ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ విధానం'ను ఇప్పటికైనా అమలుపరచాలి. ఒకే పనిపై వాళ్ళని నియమించి, ఎనిమిది గంటల పని విధానాన్ని కల్పించాలి. కానిస్టేబుల్స్‌ను వివక్షకు గురి చేయకుండా, అనైతిక బానిసత్వం నుంచి విముక్తి కలిగించి, వృత్తిపరంగా గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించాలి. కుటుంబానికి దూరంగా ఉంచి, వారి పిల్లల భవిష్యత్తుకి ఆటంకం కలిగించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సమకాలీన సమాజంలో ప్రాధాన్యత లేని ఈ బెటాలియన్ పోలీస్ వ్యవస్థ నిర్వహణ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రంలో బెటాలియన్ స్పెషల్ పోలీస్ వ్యవస్థను రద్దు చేసి 'ఏక్ స్టేట్ ఏక్ పోలీస్' విధానం తీసుకొని రావడం ద్వారా కానిస్టేబుల్స్ కుటుంబాల జీవితాల్లో గుణాత్మక మార్పులు సాధ్యం అవుతాయి.

– గాదె వంశీధర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం



సమగ్ర కులగణనకు సమాయత్తం

- 6వతేదీ నుంచి నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు
- 60 రోజుల్లో ప్రక్రియ పూర్తికి కార్యాచరణ
- ఎన్యూమరేటర్ల నియామకానికి కసరత్తు
- 75 ప్రశ్నలతో సర్వే పత్రం విడుదల
- ఉమ్మడి జిల్లాలో సుమారు 42లక్షల మంది బీసీలు



హనుమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సామాజిక సర్వే (సమగ్ర కుల గణన) సన్నాహాలు మొదలయ్యాయి. వచ్చే నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఉమ్మడి జిల్లాలోని అధికార యంత్రాంగం ఆ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువు 60 రోజుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 42లక్షలమంది బీసీల వివరాలను సేకరించేందుకు సిద్ధమైంది. అయితే పారదర్శకంగా కులగణనను నిర్వహించేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు అన్ని బీసీ సంఘాలు సమగ్ర కుల గణనను పక్కాగా నిర్వహించేలా చూడటంతో పాటు బీసీలు ఈ కులగణనలో విధిగా పాల్గొనేలా చేయడానికి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. జానాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీలు 56 శాతం అంటే సుమారు 42 లక్షల మంది వరకు ఉండవచ్చునని బీసీ సంఘాలు అంచనా వేస్తున్నాయి. వరంగల్ జిల్లాలో బీసీలు అత్యధికంగా 58శాతం ఉన్నట్టు అంచనా. మహబూబాబాద్, ములుగు జిల్లాలో తక్కువగా ఉన్నారు. బీసీలో మొత్తం 126 కులాలు ఉండగా వీరిలో పద్మశాలి, మున్నూరుకాపు, యాదవ, గౌడ్లు, విశ్వబ్రాహ్మణ, రజక, బెస్త, గంగపుత్ర, నాయి బ్రాహ్మణ, వడ్డెర, పెరిక, కుమ్మరి, వడ్రంగి, కూనపులి తదితర కులాలు వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువగా ఉన్నారు. వీరితో పాటు ఉపకులాలు, ఆశ్రిత కులాల వారు సైతం గణనీయంగానే ఉన్నారు. ఉపకులాలు, ఆశ్రిత కులాల వారు బతుకు తెరువు కోసం ఎక్కువగా హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వలస వచ్చి స్థిరపడ్డారు. వీరిలో ఎక్కువగా సంచార జాతుల వారు ఉన్నారు. పొట్టకూటి కోసం ఆయా ప్రాంతాలకు తరుచూ వలస వెళ్లే వీరి గణన విషయం కొద్దిగా ఇబ్బందిగా ఉండే అవకాశం ఉంది.

సిబ్బంది నియామకం

ఇంటింటి సర్వే చేసేందుకు ఎంతమంది ఎన్యుమరేటర్లు అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఉమ్మడి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పని చేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. గణనకు ఎంత మంది ఎన్యూమరేటర్లు అవసరమవుతారు? ఎన్ని బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది? ఏఏ ప్రభుత్వ శాఖల నుంచి ఎన్యూమరేటర్లను సేకరించాలి? అన్ని అంశాలపై ప్రస్తుతం అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2011జనాభా లెక్కల ప్రకారం ఉన్న వివరాలను పరిగణలోకి తీసుకుని బృందాలను, ఎన్యూమరేటర్లను నియామకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1500 జనాభాకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, సంబంధిత బృందంలో సుమారు 10మంది ఎన్యూమరేటర్లను నియమించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు నెలల్లో కుల గణన సర్వేను పకడ్బందీగా పూర్తిచేసి నివేదించేందుకు సిద్ధమవుతున్నారు.

బీసీల లెక్కింపు ఇదే మొదటి సారి..

ప్రతీ పదేళ్లకొకసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన మాత్రం చేపట్టలేదు. దీనితో బీసీలు ఎంత మంది ఉన్నారు? ఏ కులం వారు ఎంత మంది ఉన్నారు? కచ్చితమైన లెక్కలు లేవు. దీనితో బీసీలు కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ ఎస్టీ జనాభా గుర్తించారు. బీసీ గణాంకాలు బయట పెట్టలేదు. నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయ స్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ప్రభుత్వం కుల గణనకు సంబంధించిన ఓ ప్రశ్నా పత్రాన్ని విడుదల చేసింది. మొత్తం 75 ప్రశ్నలుండగా.. పార్ట్ 1లో యజమాని కుటుంబ సభ్యులు వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలు, పార్ట్ 2లో కుటుంబ వివరాలకు సంబంధించి 17 ప్రశ్నలు ఉంటాయి.

ఏకమవుతున్న కుల సంఘాలు

బీసీ కులగణన నిర్వహిస్తున్న నేపథ్యంలో బీసీ కుల సంఘాలన్నీ ఏకమవుతున్నాయి. కులగణన పక్కాగా పారదర్శకంగా జరిగేలా చూడడానికి తమ వంతుగా గణన జరిగేంత కాలం నిరంతర నిఘా వేసి ఉంచాలనే నిర్ణయానికి వచ్చాయి. ఈ మేరకు కుల సంఘాల నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అంతే కాకుండా బీసీ కుల గణన వల్ల కలిగే ప్రయోజనాలు, కులగణనలో భాగస్వాములు కావలసిన ఆవశ్యకత గురించి బీసీలకు అవగాహన కలిగించేందుకు అప్పుడే గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో బీసీ విద్యావంతులు, కుల సంఘాల ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తున్నాయి.

గణాంకాలు దేనికైనా అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యర్థనలు వస్తున్నాయి. గతంలో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్టు అంచనా వేస్తున్నారు. కులగణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. త్వరలో నిర్వహించే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

నేడు బీసీ కమిషన్ రాక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం హనుమకొండ జిల్లాలో బీసీ కమిషన్ పర్యటన ఉంటుందని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పి. ప్రావీణ్య , సత్యశారద శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనాభా ధామాషా ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, ఈ ప్రజాభిప్రాయ సేకరణలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీలు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుల సంఘాల ప్రతినిధుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని, ఈ సేకరణ ఉదయం 10 గంటలక ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను బీసీ కమిషన్ బృందం స్వీకరిస్తుందని పేర్కొన్నారు. బీసీ కమిషన్ బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ అప్పయ్య

బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ అల్లం అప్పయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలోనే సివిల్ సర్జన్ డీఎంహెచ్‌వోగా హనుమకొండలో జాయిన్ అయిన డాక్టర్ అప్పయ్య ఇంతవరకు ములుగు డీఎంహెచ్‌వోగా సేవలందించారు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అప్పయ్యను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.లలితాదేవి, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, డీఐవో డాక్టర్ మహేందర్, డాక్టర్ గోపాల్‌రావు, ఏడీ యాదగిరి, ఏవో కె.రమేశ్, డెమో అశోక్‌రెడ్డి, ప్రసన్నకుమార్, సీహెచ్‌ఓలు నెహ్రూచంద్, యాదనాయక్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ డీఎంహెచ్‌వోగా సాంబశివరావు బాధ్యతల స్వీకరణ

పోచమ్మమైదాన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బి.సాంబశివరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో వెంకటరమణ కరీంనగర్ జిల్లాకు బదిలీ కాగా వరంగల్ జిల్లాకు సాంబశివరావు నియామకమయ్యారు. అలాగే వరంగల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాలరావు ములుగు జిల్లా డీఎంహెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఆయనకు పలువురు సిబ్బంది, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

డీఎంహెచ్‌వోకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సన్మానం

వరంగల్ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సాంబశివరావును జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపి సత్కరించారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) :మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. గురువారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఇందిరాగాంధీ ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, వరం గల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వరద రాజేశ్వరరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్‌తో పాటు నాయకులు మోజెస్ ఆనంద్, మండల సమ్మయ్య పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

మాజీ ఉప ప్రధాన మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమం గురువారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు స్మరించారు.

పండుగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- జనగామ జిల్లా గోవర్ధనగిరిలో ఘటన

రఘునాథపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. దాంతో జనగామ జిల్లా రఘునాథపల్లి గోవర్ధనగిరి విషాదం నెలకొంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.



నారాయణ రెడ్డి(ఫైల్)



రవిందర్(ఫైల్)

గోవర్ధనగిరికి చెందిన సంపత్ నారాయణ రెడ్డి(57), జనగామకు చెందిన కడార్ల రవిందర్(59)గోవర్ధనగిరి శివారులో ఉన్న మహేష్ ఫ్యాట్స్ అండ్ అయిల్స్ కంపెనీలో ఒకరు ఆఫీస్ అసిస్టెంట్‌గా, ఇంకొకరు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. దీపావళి పండుగ కావడంతో డ్యూటీ పనులను త్వరగా ముగించుకుని కంపెనీ నుంచి నారాయణ రెడ్డి తన ద్విచక్ర వాహనంపై రవిందర్‌తో కలిసి గురువారం సాయంత్రం తమ ఇళ్లకు బయలుదేరారు. గోవర్ధనగిరి బస్టాండు సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్ వద్ద జనగామ వైపు వెళ్తుండగా, వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు అతివేగంగా బైక్‌ను ఢీ కొంది. దాంతో నారాయణరెడ్డి, రెడ్డి, రవిందర్ రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనంను ఢీకొన్న కారు హైదరాబాద్ వైపునకు వెళ్తే కోమల్ల టోల్ ప్లాజాకు సంబంధించిన సీసీ కెమెరాలో రికార్డు అవుతుందని గ్రహించిన కారు డ్రైవర్ కారును వెనక్కు మలుపుకొని తిరిగి వరంగల్ వైపునకు వెళ్లినట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రఘునాథపల్లి సిఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

సెంట్రల్ లైట్లు ఉన్నా.. వెలగకపోవడంతో..

గోవర్ధనగిరి బస్టాండు సమీపంలోని జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏ ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలుగకపోవడం... ప్రమాదానికి కారణం కావచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నేషనల్ హైవే అధికారులు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత మాదే
- గత సర్కారు రాష్ట్రాన్ని దివాలా తీయించింది
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం
- ధర్మసాగర్, వేలేరుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

6



ధర్మసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నగరంలో టపాసులు కాలుస్తున్న ఓ కుటుంబం



దివ్యాంగ చిన్నారితో దీపావళి వేడుక జరుపుకొంటున్న ఎంపీ

విరజిమ్మిన వెలుగులు

- ఉత్సాహంగా దీపావళి పర్వదినం
- భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాలు, ధనలక్ష్మీ పూజలు
- ఇంటింటా సందడే సందడి
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

8



శివకేశవుల ప్రీతికరం.. కార్తీకం

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నెల రోజుల పాటు దీపోత్సవాలు, వ్రతాలు, వన భోజన కార్యక్రమాలు

8




ఆర్థిక స్వావలంబన దిశగా..

వృత్తి నైపుణ్య శిక్షణ

- నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ

8








మాడ వీధుల నిర్మాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కుడా అధికారులు

భద్రకాళి మాడ వీధుల పరిశీలన

వరంగల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి ఆలయం చుట్టు నిర్మించే మాడ వీధుల ప్రాంతాలను శుక్రవారం కుడా అధికారులు పరిశీలించారు. మాడ వీధులు నిర్మాణం జరిగే ప్రాంతాల్లో ఆలయ ఈవో అర్చకులతో కలిసి సమీక్షించారు. అలాగే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు అజిత్‌రెడ్డి, ఇంజనీర్లు, ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే, ఎంపీకి ఆహ్వానం


ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ఆహ్వానిస్తున్న నేతకాని కులస్థులు

హసన్‌పర్తి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో నేతకాని కులస్థులు వినూత్నంగా ఆదివారం దీపావళి బతుకమ్మ వేడుకలకు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో పాటు ఎంపీ కడియం కావ్యను ఆహ్వానిస్తూ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, నేతకాని కుల ప్రతినిధి జాడి రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో కుల పెద్దలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో మొదటి రోజు శుక్రవారం కేదారీశ్వరస్వామి వ్రతం, రెండో రోజు శనివారం పురుషులు మాత్రమే నిర్వహించే జోడెద్దుల ఊరేగింపు, నిమజ్జనం, మూడో రోజు ఆదివారం మహిళల బతుకమ్మ వేడుకలతో ముగుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకుడు తోకల జగన్‌మోహన్‌రెడ్డి, నేతకాని కుల పెద్దలు జనగాం కనకయ్య, సారయ్య, విలాకర్, దుర్గం నరేష్, బొౌతు వెంకటేష్, సమ్మయ్య, వీరస్వామి, బండారి సురేష్, గోళ్ల మొగిళి, సుమన్, అశోక్ తదితరులున్నారు.

సౌత్ జోన్ పురుషుల బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులోని ఈనెల 1 నుంచి 5 వరకు క్రిస్తు యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ జట్టు ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో కె.యశ్వంత్, (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), టి.కన్నారావు, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), టి.విశ్వనాథ్, (ఎల్‌బీ డిగ్రీ కళాశాల, ములుగు రోడ్డు , వరంగల్), ఎమ్డీ. ఖైసొద్దీన్ (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), ఆర్.నరేందర్, (ఆర్ఆర్ అండ్ బీజీఎస్ఆర్ కళాశాల, ఖమ్మం), కె.పవన్‌పాల్ (వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), సీహెచ్ .ఈశ్వర్, (నలంద డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), టి .తారకేశ్‌యాదవ్ ,(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), జే .గణేశ్ కుమార్, ఎం. ప్రవీణ్ (ఎల్‌బీ డిగ్రీ కళాశాల, ములుగురోడ్డు, వరంగల్), ఎం.ప్రణయ్‌కుమార్ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ), బి. ఈశ్వర్(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు వెంకయ్య తెలిపారు. జట్టుకు మేనేజర్‌గా హనుమకొండలోని వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్. మోహన్‌కృష్ణ వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టును కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం
- ధర్మసాగర్, వేలేరుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ధర్మసాగర్ / వేలేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధర్మసాగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ధాన్యం ఏ గ్రేడ్ 2, 320, బీ గ్రేడ్ 2, 300, సన్నరకానికి అదనంగా 500 బోనస్ చెల్లిస్తామన్నారు. రైతులకు రూ.2లక్షలు రుణాలను ఏక కాలంగా మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించిందన్నారు. ఓ వైపు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే, మరో వైపు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. కడియం శ్రీహరి మార్క్ కనిపించే విధంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. నవంబరు 6 నుంచి తెలంగాణలో కులగణన జరగబోతుందని పేర్కొన్నారు.


వేలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఈ సమగ్ర సర్వేకు అందరూ సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదవ కుమార్, డీసీవో, ఎంపీడీవో, తహసీల్దార్, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వేలేరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేయాలని నిర్వాహకులు, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదవ్ కుమార్, ఏఈవో రాజశేఖర్, మాజీ కుడా డైరెక్టర్ బిల్లా యాదగిరి, తహసీల్దార్ కొమి, డైరెక్టర్లు మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మండల కాంగ్రెస్ నాయకులు, సద్దాం హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వర్ధన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణను కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వేను చేపట్టడానికి అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సేర్వేకు నియమించిన ఎన్యుమరేర్లు, సూపర్‌వైజర్లకు మండలస్థాయిలో శిక్షణ నివ్వడం జరుగుతుందని 150 కుటుంబాలను ఒక్కో ఎన్యుమరేటర్ బ్లాక్‌గా విభజించి 10 బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు ఇళ్ల జాబితాను రూపొందించుకోవాలని సూచించారు. 6 నుంచి 18వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు సేకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్వే విషయాలు గోప్యంగా ఉంచాలని ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పక్కాగా ఉండాలన్నారు. సర్వే నిర్వహించే తీరు, మార్గదర్శకాలు తదితర అంశాలను సమగ్రంగా తెలుసుకోవాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. సర్వే అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కాగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

సమగ్ర వివరాలతో సర్వే చేపట్టండి

బల్దియా అదనపు కమిషనర్ జోనా

వరంగల్ కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ వివరాలతో కూడిన సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని బల్దియా అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా సూచించారు. శుక్రవారం బల్దియా పరిధిలోని పోచమ్మమైదాన్, కాశిబుగ్గ సర్కిల్ ప్రాంతాల్లో డీసీ పీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్యుమనేటర్ల శిక్షణా కార్యక్రమాలను సందర్శించారు. అక్కడి అధికారులతో మాట్లాడారు. అక్కడ శిక్షణ పొందుతున్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోనా మాట్లాడుతూ.. కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్యుమనేటర్లకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఇందు కోసం మునిసిపల్ సిబ్బంది, ఆశవర్కర్లకు మునిసిపల్ బిల్ కలెక్టర్లు, రిసోర్స్ పర్సన్స్, వార్డు ఆఫీసర్స్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రూపొందించిన 73 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిపై సంపూర్ణ అవగాహన కలిగి, సంపూర్ణ అవగాహనతో సర్వే నిర్వహించాలన్నారు. ప్రతీ ఎన్యుమనేటర్ వారికి కేటాయించిన గృహాలకు సంబంధించిన పూర్తి జాబితా సేకరించిన ప్రభుత్వానికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వోలు షహజాది బేగం, శ్రీనివాస్, సూపరిటెండెంట్ హబీబ్, రమేష్ పాల్గొన్నారు.

ఐఎంఏ వరంగల్ శాఖకు ఉత్తమ శాఖ అవార్డు

వరంగల్ మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐఎంఏ వరంగల్ శాఖ రాష్ట్రస్థాయిలో అవార్డుల పంట పండింది. హైదరాబాద్‌లో జరిగిన ఐఎంఏ రాష్ట్ర సమావేశంలో మూడు అవార్డులను ఐఎంఏ వరంగల్ శాఖ కైవసం చేసుకుంది. ఐఎంఏ ఉత్తమశాఖ అవార్డును ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బన్సాలీ, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అన్వర్, డాక్టర్ బింగి శ్రీనివాస్‌లకు ప్రదానం చేశారు. ఈ సంవత్సర కాలంలో చేసిన వివిధ సేవా కార్యక్రమాలు, మేడారం జాతర, మెడికల్ క్యాంపులు, సీపీడీ కార్యక్రమాలు, కారణంగానే ఉత్తమ శాఖ అవార్డు వచ్చిందని వరంగల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ తెలిపారు. రికార్డు స్థాయిలో 185 మందితో సభ్యత్వ నమోదు చేయడం కారణంగా మరో అవార్డు, అత్యుత్తమ సభ్యత్వ నమోదు శాఖ అవార్డు పేరిట దక్కినట్లు తెలిపారు.
అలాగే ఐఎంఏ వరంగల్ శాఖ కోశాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్‌కు ప్రత్యేక అవార్డు కూడా వచ్చినట్లు తెలిపారు. వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు రాష్ట్ర నాయకులు డాక్టర్ విజయ చందర్‌రెడ్డి, డాక్టర్ సుదీప్, డాక్టర్ శేషుమాధవ్,



అవార్డు అందుకుంటున్న దృశ్యం

డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ మల్లేశం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఐఓబి అధికారులు

ఐవోబీ తీరు అభినందనీయం : వరంగల్ సీపీ

హనుమకొండ టౌన్, నవంబర్1(ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో సమగ్ర నిజాయితీని ప్రోత్సహించేందుకు ఐవోబీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం వెబినార్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ఇతివృత్తం సమగ్రత సంస్కృతి దేశ శ్రేయస్సుకు మూలం అన్నారు. విజిలెన్స్ అనేది ఒక కర్తవ్యంగా మాత్రమే కాకుండా నిష్పాక్షిక, విశ్వసనీయమైన పనితీరు సృష్టించేందుకు ఒక భాగస్వామ్య బాధ్యతగా కూడా ప్రతిబింబిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వరంగల్ ప్రాంతీయ కార్యాలయ రీజినల్ మేనేజర్ నారాయణ్ ప్రసాద్ నాయక్, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఐవోబీ బ్యాంక్ మేనేజర్లు, ఆయా బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి..

వడ్డెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో జరిగిన అణచివేతపై వీరోచిత పోరాటం చేసి రాష్ట్ర సాధన కోసం త్యాగపూరిత పోరాటాలను నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్రా ప్రాంతాన్ని తెలంగాణలో కలిపిన నాటి నుంచి తెలంగాణ ప్రజల విముక్తి కోసం జరిగిన ఎన్నో పోరాటాల్లో ప్రతీ గ్రామంలో నెత్తుటి మరకలు ఉన్నాయని అన్నారు. ఎందరో త్యాగఫలితం, మరెందరో ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని వాగ్దానం చేయడంతో ఉద్యమకారులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచి అధికారాన్ని అప్పగించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినప్పటికీ ఉద్యమకారుల ఆకాంక్షలను ఇప్పటి వరకు నెరవేర్చకుండా నిర్లక్ష్య ధోరణి వహిస్తోందని ఆరోపించారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందు కోసం ఈనెల 3న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల గర్జన సభను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోదుమల కుమారస్వామి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. తొలుత గర్జన సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

3న ఉద్యమకారుల గర్జన సభ..

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలనే లక్ష్యంతో ఈ నెల 3న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఉద్యమకారుల గర్జనను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోదుమల కుమారస్వామి తెలిపారు.

సమగ్ర కుల గణనతో వెనుకబడిన వర్గాలకు న్యాయం

కేయూ క్యాంపస్, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సమగ్ర కుల గణనతో వెనుకబడిన వర్గాల వారికి న్యాయం జరుగుతోందని పూలే ఆశయ సాధన సమితి (పాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. శుక్రవారం కేయూ జర్నలిజం విభాగంలో జరిగిన సమావేశంలో మల్లేశ్వర్ మాట్లాడారు. అందరికీ సమాన రాజ్యాంగ పదవులతో పాటు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కుల గణనతోనే సాధ్యమవుతోందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ మేరకు కుల గణన చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాడూరి శాస్త్రి, పాల్గొన్నారు.

'కులగణనను స్వాగతిస్తున్నాం'

కాశీబుగ్గ జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణనను తాము స్వాగతిస్తున్నామని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు, బీసీ ఐక్యకులాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం హనుమకొండలో వారు మాట్లాడుతూ ఆయా వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కులగణన తోడ్పడుతుందని అన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

చిలుపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన వంగాలపల్లి సమీపంలో, హైదరాబాద్ - హన్మకొండ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం... వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పోతిరెడ్డిపల్లి శివారు లకావత్‌తండాకు చెందిన లకావత్ రాజమ్మ (61) తన భర్త భీమ్లాతో కలిసి ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల సమీపంలో ఉన్న మామిడితోటలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యక్తిగత పని నిమిత్తం హన్మకొండకు వెళ్లేందుకు వంగాలపల్లి - కరుణాపురం స్టేజీ వద్ద, ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్న రాజమ్మను వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ రాజమ్మను ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కొడుకు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్ఐ వేధిస్తున్నాడంటూ ఆత్మహత్యాయత్నం

- వరంగల్ మట్టెవాడ పీఎస్‌లో కలకలం
- సీపీ సార్ కాపాడాలంటూ చిరువ్యాపారి వేడుకోలు

మట్టెవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమను డబ్బు కోసం ఎస్ఐ విఠల్ వేధిస్తున్నాడంటూ గురువారం రాత్రి వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు శ్రీధర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ క్రమంలో ఎస్సై నవీన్, పోలీసు సిబ్బంది శ్రీధర్ నుంచి పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. క్యాన్‌తో నీటిని శ్రీధర్‌పై పోసి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజులుగా మట్టెవాడ ఎస్సై విఠల్ ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకుల వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. సెంటర్ వద్ద పార్కు చేసిన వాహనాలను ఫొటోలు తీస్తున్నారని, దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, తమ వ్యాపారానికి నష్టం వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం కూడా శ్రీధర్‌కు చెందిన షాపు వద్దకు వచ్చి ఫొటోలు తీయడంతో మనోవేదనకు గురైన శ్రీధర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే శ్రీధర్ పీఎస్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకునే వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'సీపీ సార్ నమస్కారం... కొండ మురళి సార్ నమస్కారం... నేను శ్రీధర్‌ని వరంగల్ కొత్తవాడ ప్రాంతంలో తెలంగాణ ఫాస్టుఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నా. నన్ను నెల రోజులుగా మట్టెవాడ పోలీసు స్టేషన్ ఎస్సై విఠల్ డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నాడు.


మట్టెవాడ పీఎస్‌లో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న శ్రీధర్

షాపు వద్దకు వచ్చి ఇబ్బంది పెడుతున్నాడు. చిరువ్యాపారులు మంచిగా బతికితే పోలీసులు ఓర్వలేక పోతున్నారు. ఎస్సై వేధింపులు భరించలేకే నేను చనిపోతున్నా. నేను చనిపోతే ఎస్సై విఠలే బాధ్యత వహించాలి' అంటూ పేర్కొన్న వీడియో బయటకు రావడంతో మట్టెవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్సై విఠల్‌పై శ్రీధర్ చేసిన ఆరోపణలు విరవింపచుకోవాలని పోలీసులు అతడిపై ఒత్తిడి తేవడమే కాకుండా, శ్రీధర్ చేసిన ఆరోపణలు తప్పు అంటూ పోలీసులు మరో వీడియో విడుదల చేశారు.

విఠల్‌కు వివాదాస్పదుడిగా పేరు..

ఎస్సై విఠల్ ఎక్కడ విధులు నిర్వహించినా వివాదాస్పదుడిగానే పేరుంది. 2019లో చెన్నారావుపేట భూవివాదంలో తలదూర్చి 2 నెలలకే సస్పెండ్ అయ్యారు. అదేవిధంగా కేయూ పీఎస్‌లో భూవివాదంలో జోక్యం చేసుకుని సస్పెన్షన్ వేటుకు గురయ్యారు.

చట్టపరంగానే విధుల నిర్వహణ : పోలీసులు

చట్టపరంగానేపోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు, చిరు వ్యాపా రులు, ప్రజలపై పోలీసులకు ఎలాంటి దురుద్దేశం లే దని మట్టెవాడ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని శ్రీధర్‌ను మట్టెవాడ ఎస్ఐ విఠల్ వేధిస్తున్నాడన్న మెసెజ్ సోష ల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయంపై పోలీ సులు స్పందించారు. అక్టోబరు 30న ఎస్ఐ విఠల్ కొత్త వాడలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా నిల పడంతో వాటి ఫొటోలు తీశారన్నారు. దీంతో శ్రీధర్ క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం చేసినట్లు వివరిం చారు. పోలీసులు అతడి ప్రాణాలు కాపాడి ఆస్పత్రికి తరలించినట్లు మట్టెవాడ పోలీసులు స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీధర్ ఒక వీడియోను విడుదల చేశాడు. ఎస్ఐ విఠల్ తప్పులేదని పొరపాటున ఆరోపణ చేశానని, ప్రైవేట్ డ్రైవర్ ఇబ్బంది పెట్టడం వల్లే ఆత్మహత్యాయత్నం చేసినట్లు ఒక వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.

ప్రతీ ఒక్కరు సర్వేకు సహకరించాలి: కలెక్టర్



జయగిరిలో సమగ్ర సర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు కుటుంబ సర్వేకు సహకరించాలని స్టిక్కర్లు వేయని ఇంటి యజమానులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండలంలోని జయగిరిలో నిర్వహిస్తున్న సర్వే పనులను ఆమె స్వయంగా పరిశీలించి తనిఖీ చేశారు. ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు వేస్తున్నారా.. లేదా అని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్యుమరేటర్లు గ్రామంలోని ఇండ్ల సంఖ్యను లెక్క వేసి ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేయాలని ఆదేశించారు. ఆ గ్రామంలో ఉన్న ఇంటితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాలకు కూడా స్టిక్కర్లు అంటించాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట తహసీల్దారు చల్ల ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, ఎంపీఎస్‌వో రోజ, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



శివనగర్‌లో ఏఐటీయూసీ జెండాను ఎగురవేస్తున్న గన్నారపు రమేష్

ఖిలావరంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మొట్టమొదటి సంఘంగా ఏర్పడి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన చరిత్ర ఏఐటీయుసీ ఉందని జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. గురువారం శివనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏఐటీయుసీ 105 ఆవిర్భావ దినోత్సవాన్ని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాషుమియా అధ్యక్షతన రమేష్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపద కొద్దిమంది చేతుల్లో మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేయడం సరి కాదన్నారు. దేశ సంపదను కొంతమంది వ్యక్తుల ఆస్తిగా మార్చడానికి బీజేపీ సహరిస్తోందని ఆరోపించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ దండు లక్ష్మణ్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎమ్డీ ఖాసీం, దామెర కృష్ణ, సంపీ ఏలేందర్, గుండె బద్రి, యాకూబ్, జాన్‌పాల్, ఏకాంబ్రాచారి, రాజేందర్, శరత్, వెంకటాద్రి, సింగారపు విక్టోరియా, సురాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద..

గిర్మాజిపేట (ఆంధ్రజ్యోతి): సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం వరంగల్ నగరంలోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమేష్ జెండాను ఎగురవేశారు. సీకేఎం అవుట్‌సోర్సింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు రాజు, సక్కుబాయి, గిరి, రవీందర్, శ్రీశైలం, సంధ్య, కవిత, సురేష్, స్వరూపాదేవి, సుమతి, లక్ష్మి, ఎలీషా, అర్చన, జీవన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు

ఆలయాల్లో వేడుకగా ధనలక్ష్మీ పూజలు ● ఇంటింటా కేదారీశ్వర వ్రతాలు

బాణసంచా వెలుగుల్లో యువత కేరింతలు ● నగరంలో పండుగ వాతావరణం

కాశిబుగ్గ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం మంగళహారతులు, లక్ష్మీ పూజలు చేశారు. శుక్రవారం కేదారీశ్వరస్వామి నోములు నోముకున్నారు. ఈసారి స్వాతి నక్షత్రం శుక్రవారం కావడంతో కొత్తగా నోములు పట్టేవారు ఆసక్తి కనబరిచారు. చాలా మంది ఈ ఏడాది కొత్త నోములు నోముకున్నారు.

కృష్ణకాలనీలోని వాసవిదేవి నివాసంలో మహిళలు ఒక చోట చేరి సందడి చేశారు. పిండి వంటలు చేసుకొని పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇళ్లను పూలు, దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి, బాణసంచా కాల్చారు. రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులు విరజిమ్మాయి. కార్యక్రమంలో కుసుమ వాసవిదేవి, అరుణ, సుధ, మంజుల, జ్యోతి, శ్రీదేవి, శిరీష, సుధారాణి, తులసి, ఉమ, రజని, ప్రభ, గీత, విజయలక్ష్మి, మాధురి, సుహాసిని, రమాదేవి, శృతికీర్తి, పుష్ప, స్వర్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.







దత్తక్షేత్రంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు ● రామన్నపేటలో కేదారీశ్వర వ్రతం ఆచరిస్తున్న కుంటుంబం ● దీపాలతో మహిళలు

శంభునిపేటలో..

శంభునిపేట (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను నగర ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవి పూజలు, కేదారీశ్వరి, నోములు గౌరమ్మ వ్రతాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పిల్లలు, పెద్దలు బాణసంచా కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. ఇంటింటా పండుగ సందడి నెలకొంది. నగరంలోని రంగశాయిపేట, శంభునిపేట, ప్రాంతాలతో పాటు విలీన గ్రామాల్లో పండుగను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పటాకుల దుకాణాలు, కిరాణ, పూలు, పండ్లు, పూజా సామగ్రి దుకాణాలు కిటకిటలాడాయి.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి

ఖిలావరంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధానమంతి స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి జరిపారు. గురువారం 35వ డివిజన్ శివనగర్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, శ్రీరాం రాజేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు కాశిబుగ్గలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్ రావు, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, ఓని స్వర్ణ భాస్కర్, దూపం సంపత్, రవి తదితరులు పాల్గొన్నారు.

– 19వ డివిజన్‌లో టీపీసీసీ కార్యదర్శి ఆయూబ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు దాసరి రాజేష్, కూచన రవీందర్, పుష్ప, సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ గ్రేటర్ వరంగల్ మాజీ అధ్యక్షుడు రాజనాల శ్రీహరి, జిల్లా కార్యదర్శి ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- గిర్మాజిపేటలో..

గిర్మాజిపేట (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వరంగల్ నగరం గిర్మాజిపేటలోని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీసాల ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికి చేర్చడమే ఇందిరాగాంధీకి నిజమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, సందెల లాజర్, వరియోగుల శ్రీనివాస్, మంద శ్రీనివాస్, తైమూర్, అన్వేష్, జలంధర్, దౌడు నాగరాజు, నయిమా జహీరా తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సారయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, నేతలు

ఆటోనగర్‌లో..

ఆటోనగర్ (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ 80ఫీట్ల రోడ్డు వద్ద టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కంటెస్టెడ్ కార్పొరేటర్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశ్, సందేల దామోదర్, కొక్కుల సతీష్, బొల్లు సతీష్, హైదర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 23వ డివిజన్ కొత్తవాడలో కాంగ్రెస్ నాయకుడు గొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్, అధ్యక్షుడు దామెర రాజ్‌కమల్, కొక్కుల సతీష్, దామోదర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

7వ డివిజన్‌లో ఇందిరాగాంధీ వర్ధంతి

హనుమకొండ సిటీ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 7వ డివిజన్ బ్రాహ్మణవాడలో మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కానుగంటి శేఖర్, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరా గాంధీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగ సోమేశ్వరరావు, తోట పవన్, వీన్న, చీకటి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

'కుల గణన ఉత్తర్వులు మార్చాలి'

వరంగల్ ఎడ్యుకేషన్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుల గణన విధులకు సంబంధించి ఉత్తర్వులను ప్రభుత్వం సరిచేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నన్నెబోయిన తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉపాధ్యాయులను గుర్తించి కుల గణన విధులను పాఠశాలల పనివేళలకు ఆటంకం కలగకుండా కేటాయించాలని కోరారు. ఉదయం పూట స్కూల్లో పనిచేసి మధ్యాహ్నం పూట గణనకు వెళ్లాలని ఉత్తర్వులు ఇవ్వడం అసంబద్ధమన్నారు. ఉదయం పూట సర్వే నిర్వహించి మధ్యాహ్నం పూట పాఠశాలల్లో విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు మార్చి ఇవ్వాలని ఆయన ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఒకరిపై కేసు నమోదు

శంభునిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తండ్రీ కూతుళ్లపై దాడి చేసిన వ్యక్తిపై మామునూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మామునూరు శివారులో అన్వర్ అయాన్ అనే వ్యక్తి పోలీసు అకాడమీ నిర్వహిస్తుండగా అందులో ఖమ్మంనకు చెందిన ఓ మహిళ అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. తనకు రావాల్సిన జీతం గురించి మాట్లాడేందుకు అక్టోబరు 28న తన తండ్రితో కలిసి అకాడమీకి వచ్చింది. ఈ విషయంలో వారికి అన్వర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అన్వర్ చెప్పుతో తండ్రీ కూతుళ్లపై దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అన్వర్‌పై కేసు నమోదు చేసినట్లు మామునూరు సీఐ రమేష్ తెలిపారు.





వెంకట్రామ జంక్షన్‌లో వల్లభాయ్‌పటేల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు, నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



ఫోర్త్ బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్

వల్లభాయ్ పటేల్‌కు నివాళులు

కాశిబుగ్గ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వెంకట్రామ కూడలిలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, కాంగ్రెస్ నేతలు నేతలు బాషపాక సదానందం, ఎర్రం కమల్, సందెల లాజర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రేటర్ వరంగల్ మాజీ అధ్యక్షుడు రాజనాల శ్రీహరి, జిల్లా కార్యదర్శి ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో పటేల్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, డా.వి. వెంకటరమణ, సముద్రాల పరమేశ్వర్, ఎరుకల రఘునారెడ్డి, రంజిత్, కుమార్, బాకం హరిశంకర్, మురళీకృష్ణ, వెంకటేష్, ఓంప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫోర్త్ బెటాలియన్‌లో..

శంభునిపేట (ఆంధ్యజ్యోతి) : దేశాన్ని సమైక్య పరిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్ అన్నారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని గురువారం మామునూరులోని టీజీఎస్పీ ఫోర్త్‌బెటాలియన్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం జరుపుకున్నారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణప్రసాద్, ఆర్ఐలు పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● 41వ డివిజన్‌లో బీజేపీ నాయకుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో వరంగల్ విశ్వనాథకాలనీలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్, పేర్న భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కళోత్సవ్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



యజ్ఞశ్రీకి బహుమతి అందజేస్తున్న విద్యాశాఖ డైరెక్టర్ ఏవీ. నర్సింహారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళోత్సవాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభను చూపారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీల్లో కూచిపూడి నృత్య విభాగంలో సెయింట్ పీటర్స్ పాఠశాలలో చదువుతున్న ఎ. యజ్ఞశ్రీ ప్రథమ స్థానాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. మరో విద్యార్థిని దివ్య వెంకట్రామన్ గాత్ర సంగీతంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. వారికి విద్యాశాఖ డైరెక్టర్ ఏవీ. నర్సింహారెడ్డి బహుమతులను అందజేశారు. డీఈవో దౌలాగర్ వాసంతి, ఏఎంవో శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

కార్తీక మాసోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని అవిష్కరిస్తున్న ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్‌శర్మ

హనుమకొండ చౌరస్తా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాల ఆలయంలో కార్తీక శుద్ధ పాడ్యమిని పురష్కరించుకుని శనివారం నుంచి కార్తీక మాసోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు వేయి స్తంభాల ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. శుక్రవారం దేవాలయంలో కార్తీక మాసోత్సవ వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసంలో నెల రోజుల పాటు ప్రతీ రోజు స్వామి వారికి మాసోత్సవ పూజలు చేస్తామన్నారు. ఆదే విధంగా ప్రతీ రోజు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, సిబ్బంది మధుకర్, రామకృష్ణ భక్తులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ టెన్నిస్ ఎంపికలు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) అండర్ 14, 17 బాయ్స్, గర్ల్స్ ఎంపికలు శుక్రవారం జరిగాయి. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఎస్జీఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ దస్రు నాయక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నీస్ ఎంపికలు జరిగాయి. శనివారం నుంచి 5వ తేదీ వరకు ఖమ్మంలో నిర్వహించే స్టేట్ మీట్‌లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని హనుమకొండ దస్రు నాయక్ తెలిపారు.

బాల్య స్నేహితుల అండ



స్రవంతికి నగదు అందిస్తున్న స్నేహితులు

మడికొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మడికొండకు చెందిన జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో 2005- 06 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని స్రవంతి కుటుంబంతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరులో ఉంటోంది. కొద్ది రోజులుగా ఆమె కుమారుడు అనారోగ్యానికి గురవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తెలిసి మడికొండకు చెందిన ఆమె బాల్య స్నేహితులు శుక్రవారం చిత్తూరు వెళ్ళి ఆమెను పరార్శించారు. అలాగే రూ. 25వేలు ఆర్థిక సహాయం అందజేసి అండగా మేము ఉన్నామంటూ భరోసా ఇచ్చారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. ఆర్. నాగరాజు

మడికొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెంలో శుక్రవారం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు క్షేమంగా ఉండాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వడం కోసం రూ. 25 వేల కోట్ల నిధులు సమకూర్చినట్లు స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా సన్నరకం, దొడ్డు రకం వడ్ల కోసం వేర్వేరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గురుకులాల్లోని విద్యార్థుల కోసం సన్న బియ్యం అందిచనున్నట్లు పేర్కొన్నారు. 43 లక్షల మంది రైతులకు రూ. 31 వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకటనర్సింహారెడ్డి, ఫాక్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల కిసాన్ అధ్యక్షుడు నీలం వేణు, డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాజ్, తహసీల్దార్ బావుసింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



టేకులగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

మడికొండలో కమాన్ ఏర్పాటు

మడికొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మడికొండ చౌరస్తాలో, పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద పోలీసులు శుక్రవారం కమాన్ ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాల రాకపోకలకు చెక్ పడింది. చౌరస్తా నుంచి ధర్మసాగర్ రోడ్డు వరకు గ్రామంలోని ఇరుకైన రోడ్డు నుంచి భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఇప్పటి వరకు ఏడుగురు మృత్యువాత పడ్డారు. ఈ విషయమై స్థానిక ప్రజలు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అనేకసార్లు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఈసమస్యను కాంగ్రెస్ నాయకులతో కలిసి మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకోవాలని వరంగల్ సీపీకి, మునిసిపల్ శాఖ అధికారులకు సూచించారు. సీపీ ఆదేశాల మేరకు స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజబాబు రైల్వే వ్యాగన్‌షెడ్ అధికారుల సహకారంతో మడికొండ చౌరస్తా వద్ద, ధర్మసాగర్ రోడ్డు పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద కమాన్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీకి, ఎమ్మెల్యేకు మడికొండ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'

ఖిలావరంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలోని ఆదివాసీలను చంపేస్తోందని, వెంటనే దాడులను ఆపివేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖిలావరంగల్ అమరవీరుల స్థూపం వద్ద నవంబరు 1 నుంచి 9 వరకు అమరవీరుల సంస్మరణలో భాగంగా న్యూడెమోక్రసీ నాయకుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామ్రాజ్యవాద, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడి చంద్ర పుల్లారెడ్డి, సత్యనారాయణసింగ్, టీ నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, చారు మజుందార్ అమరులయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వ బ్రాహ్మణ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో పాల్గొనాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బన్న నర్సింగం, గంద్రాతి హరిబాబు, గద్దల ప్రభాకర్, రాజు, ఏలియా, ఇనుముల కృష్ణ, ఎమ్డీ అక్బర్, పుప్పాల రవి, జీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచడం హర్షణీయం



ఉర్సుగుట్ట ఎంజీపీ గురుకులంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అంజిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహాత్మ జ్యోతిబా పూలే గురుకులాల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచిన ముఖ్యమంత్రికి గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులంతా రుణపడి ఉంటారని వరంగల్ ఉర్సుగుట్ట ఎంజేపీ గర్ల్స్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం విద్యాలయంలో విద్యార్థులు ముఖ్యమంత్రికి కృతజ్ఞత కార్యక్రమం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ అంజిరెడ్డి మాట్లాడుతూ... అపరిష్కృతంగా ఉన్న మెస్ చార్జీలను పెంచినందుకు ముఖ్యమంత్రితో పాటు బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం గురుకులాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు మెస్ చార్జీల పెంపుదలకు కృతజ్ఞతకు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విరజిమ్మిన వెలుగులు

- ఉత్సాహంగా దీపావళి పర్వదినం
- భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాలు, ధనలక్ష్మీ పూజలు
- ఇంటింటా సందడే సందడి
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు


కళాకారిణి శ్రావణి


కళాకారిణి హిమాన్వి

హనుమకొండ కల్చరల్ / వరంగల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతిని ప్రతిబింబించే ముఖ్యమైన పండుగల్లో ఒకటైన దీపావళి పర్వదినాన్ని ప్రజలు గురు, శుక్రవారాల్లో ఉత్సాహంగా జరుపుకొన్నారు. అలాగే కేదారేశ్వర వ్రతాలు, ధనలక్ష్మీ పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు ప్రముఖులు దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం తెల్లవారు జామునే ప్రజలంతా అభ్యంగనస్నానాలు ఆచరించి ఆడబిడ్డల నుంచి మంగళ హారతులను అందుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ఇష్ట దైవాలకు పూజలు చేశారు. రాత్రి వేళలో ధనలక్ష్మీ పూజలు చేశారు. హనుమకొండ చౌరస్తాలోని అన్ని ప్రధాన వ్యాపార సంస్థల్లో గురువారం రాత్రి ధన లక్ష్మీ పూజలను నిర్వహించి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం నగర వాసులతో పాటు జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లోను కేదారేశ్వర వ్రతాలను జరుపుకున్నారు. నువ్వుల నూనెతో మట్టి ప్రమిదలతో వత్తులు వేసి నేత్ర పర్వంగా దీపాలను వెలిగించి చీకట్లను పారదోలి ప్రజలంతా పర్వదిన విశిష్టతను చాటారు. నగరంలోని గణపతి సచ్చిదానం వరద దత్తక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళం, కుంభ, కాగడ హారతులు అమ్మవారికి నివేదించారు. ఈ వేడుకలకు వెయ్యి మంది భక్తులు హాజరయ్యారు. 1008 దీపాలతో దీపోత్సవాన్ని ఆచరించి భక్తులకు ధనార్చన నాణాన్ని ప్రసాదంగా అందించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టీ వైవీ వామన రావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు లక్ష్మీ అమ్మ వారి నాణాలను బహూకరించారు. నగరంలోని అపార్ట్‌మెంట్లలో ఇతర అన్ని ప్రాంతాల్లో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సారి కొత్త నోములకు కూడ అవకాశం రావడంతో శని, ఆదివారాల్లో కూడా కొందరు నోముకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అలాగే నగరంలోని అన్ని అమ్మవారి దేవాలయాల్లో దీపాలు వెలిగించి అలంకరణలు జరిపి విశేష పూజలు జరిపించారు.


రంగవల్లులను తీర్చిదిద్ది దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కుటుంబసభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి దీపావళి పర్వదిన వేళ మల్లికాంబ మానసిక, దివ్యాంగ చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకొన్నారు. చిన్నారులకు స్వీట్లు తినిపించి కాకర వత్తులను కాల్చి ఉత్సాహం నింపారు. నగర మేయర్ గుండు సుధారాణి నగరంలోని ఆమె నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హనుమకొండలోని తన నివాసంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.



చెస్‌లో దేవాన్ష్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని రాంనగర్‌కు చెందిన బైరి రఘువీరారెడ్డి-దివ్యారెడ్డిల ఆరేళ్ల కుమారుడు బైరి దేవాన్ష్‌రెడ్డి చెస్‌లో అంతర్జాతీయ స్థాయి రాపిడ్‌లో రేటింగ్ సాధించారు. ఇటీవల తెలుగురాష్ట్రాల్లో నిర్వహించిన పీడే అంతర్జాతీయ స్థాయి రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ స్థాయి 1485 రేటింగ్ సాధించడం విశేషం. కొన్ని నెలల క్రితం ప్రైవేటు స్కూల్‌లో 1వ తరగతి చదువుతూ, రాంనగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ కోచ్ వద్ద దేవాన్ష్‌రెడ్డి ఓనమాలు దిద్దుకున్నాడు. తల్లిదండ్రుల వద్దనే చెస్‌లో మెళకువలు నేర్చుకొని అంతర్జాతీయస్థాయిలో రాణించడం గమనార్హం. చెస్‌లో గ్రాండ్ మాస్టర్ అవడమే తన లక్ష్యమని దేవాన్ష్‌రెడ్డితో పాటు తల్లిదండ్రులు రఘువీరారెడ్డి- దివ్యారెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లా చదరంగ సమైక్య సభ్యులు కన్నా, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ దేవాన్ష్‌రెడ్డిని అభినందించారు.

ప్రారంభమైన దీపావళి బతుకమ్మ

- మొదటి రోజు కేదారీశ్వరస్వామి వ్రతం
- కుంటకు చేరి బంక మట్టి సేకరణ
- జోడెద్దుల ప్రతిమల తయారీ

సంప్రదాయం


బంక మట్టిని సేకరించి తిరిగి వస్తున్న నేతకాని కులస్తులు

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే వినూత్న రీతిలో మూడు రోజుల పాటు నిర్వహించే సీతంపేట నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు శుక్రవారం సాంప్రదాయం బద్ధంగా ప్రారంభమయ్యాయి. కేదారీశ్వరస్వామి వ్రతంతో ప్రారంభమయ్యే ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన సీతంపేటకు చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామానికి చేరుకోవడంతో ఊరంతా కోలాహలంగా మారింది. దీపావళి పర్వదినం రోజు ప్రారంభం కావాల్సిన ఈ వేడుకలు అనివార్య కారణాల వల్ల మరుసటి రోజు (మొదటి రోజు) శుక్రవారం ప్రారంభమయ్యాయి. పురుషులు ఊరు శివారులోని కుంటకు చేరుకొని బంక మట్టిని సేకరించి జోడెద్దుల ప్రతిమలను తయారు చేశారు. ఇంట్లో రకరకాల పిండి వంటలతో తయారు చేసిన నగలు (నాగళి, కోల, దుత్తలు, గొడుగు) వంటి వ్యవసాయ పనిముట్లను జోడెద్దులకు అలంకరించి కుటుంబ సభ్యులంతా కలిసి కేదారీశ్వరస్వామి వ్రతం పూర్తి చేశారు.


పిండి వంటలతో తయారు చేసిన నగలు

నేడు జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం

మూడు రోజుల పాటు గ్రామంలో జరిగే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకల్లో రెండో రోజు శనివారం పురుషుల ఘట్టం ప్రారంభమవుతుంది. ఆ రోజు సాయంత్రం కేదారీశ్వర వ్రతం ముందు ఏర్పాటు చేసిన జోడెద్దుల ప్రతిమలకు ప్రత్యేకంగా అలంకరించిన నగలతో కూడిన ప్రతిమలను కోలాటాలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకుంటారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగవారు మాత్రమే) సరసాలాడి రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేయడంతో రెండోవ రోజు ఘట్టం ముగుస్తుంది.

రేపటితో ముగియనున్న వేడుకలు

తెలంగాణ ప్రాంతంలో దసరాకు ముందు రోజు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు సాంప్రదాయబద్ధంగా తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకంగా జరుగుతాయి. అయితే మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన నేతకాని కులస్థులు మాత్రం ఒక్క హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో ఒక్క నేతకాని కులస్థులు మాత్రమే దీపావళి బతుకమ్మ వేడుకలు దీపావళి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించుకోవడం వినూత్న ఆచారంగా వస్తోంది. ఇక్కడి ప్రాంత నేతకాని కులస్థుల ప్రత్యేకత దీపావళి బతుకమ్మ కావడంతో ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన వారి కులస్థులు, బంధువులు పెద్ద ఎత్తున సీతంపేటకు తరలివస్తారు. ఈ పండుగను అత్యంత ప్రాధాన్యంగా జరుపుకుంటారు.


కోలాటాలతో జోడెద్దుల ఊరేగింపు (ఫైల్ ఫొటో)

మూడో రోజు ఆదివారం తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను కేదారీశ్వరస్వామి ముందు ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులంతా ప్రత్యేకంగా పూజిస్తారు. అనంతరం బతుకమ్మతో పాటు పసుపుతో చేసిన గౌరమ్మను, రకరకాల పిండి పదార్థాలను (సద్దిని) వెంట తీసుకొని మహిళలు ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురాలు జరుపుకుంటారు. అనంతరం బతుకమ్మపై ఏర్పాటు చేసిన గౌరమ్మను వాయినం ఇచ్చి పుచ్చుకొని వారి వెంట తెచ్చుకున్న సద్దిని పంచుకొని ఒకరికొకరు తినిపించుకుంటారు. అనంతరం గౌరమ్మను (బతుకమ్మను) చెరువులో నిమజ్జనం చేయడంతో మూడు రోజులు నిర్వహించే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ముగుస్తాయి.


కాళేశ్వరంలోని ముక్తీశ్వర స్వామి ఆలయం

శివకేశవుల ప్రీతికరం.. కార్తీకం

- నేటినుంచి కార్తీక మాసం ప్రారంభం
- ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నెల రోజుల పాటు దీపోత్సవాలు, వ్రతాలు, వన భోజనాలు

వరంగల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివ కేశవుల ప్రీతికరమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కాబోతోంది. శుభముహూర్తాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలకు నెలవైన ఈ నెలంతా.. వనభోజనాలు, దీపోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. శనివారం నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజల కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కార్తీక మాసంలో శివుడు, విష్ణువుకు విశేష పూజలు నిర్వహిస్తారు. శివాలయాల్లో నిత్యం నమక చమక రుద్రపారాయణాలతో శివుడికి అభిషేకం నిర్వహిస్తారు. ఈ మాసంలో వచ్చే ప్రతీ సోమవారం భక్తులు శివుడికి అభిషేకం నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి రాత్రి ఆకాశంలో నక్షత్రాలు చూసిన అనంతరం దీపాలు వెలిగించి భోజనాన్ని స్వీకరిస్తారు. అలాగే కార్తీక మాసంలో లక్ష్మీదేవి.. దీపం పరబ్రహ్మ స్వరూపమై కొలువై ఉంటుందని ఆలయాలు, ఇంటింటా దీపాలు వెలిగిస్తారు. ఈ నెలలో ప్రత్యేకంగా ఏకాదశి పర్వదినం, కార్తీక పౌర్ణమి, బహుళ అష్టమి రోజుల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు, అష్టసిద్ధులతో కూడిన అనఘాష్టమి వ్రతాలను ఆచరించుకుంటారు. ఇవే కాకుండా కుంకుమ పూజలు, వాయినాలు అందిస్తారు. ఆహ్లాదకరమైన నేపథ్యంలో ఇంటిల్లిపాది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి వన భోజనాలకు వెళ్తారు. ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగించి చెట్టుకింద కూర్చొని భోజనం చేస్తే ఎంతో పుణ్యఫలమని నమ్మకం. అలాగే నెల రోజుల పాటు రోజుకొక అధ్యాయం చొప్పున కార్తీక పురాణ పారాయణాన్ని నిర్వహిస్తారు.

కాళేశ్వరం, కోటగుళ్లలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్ / గణపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిలింగాలలో ఒకటైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి కార్తీక శోభ సంతరించుకుంది. శివుడికి ప్రీతికరమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుండగా నెలంతా శివుడికి ప్రత్యేక పూజలు జరగనున్నాయని అర్చకులు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు కార్తీక మాసం ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక దీపోత్సవం ఉంటుంది. సోమవారాలు, 15వతేదీ కార్తీక పౌర్ణమి రోజుల్లో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించనున్నారు. 12, 15వతేదీల్లో మంగళ వాయిద్యాలతో పంచరత్నాలతో గోదావరి వద్ద హారతి కార్యక్రమం ఉంటుంది. 14న వైకుంఠ చతుర్ధశి సందర్భంగా రాత్రి 8 గంటల నుంచి భజన, ప్రవచన కార్యక్రమం ఉంటుంది. 15న సాయంత్రం 4 గంటల నుంచి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు, 7 గంటలకు జ్వాలా తోరణం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే గణపురం మండలంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో కార్తీకమాసోత్సవాలు శనివారం నుంచి ఘనంగా జరగనున్నాయి. నెలరోజుల పాటు కొనసాగే కార్యక్రమాల్లో భాగంగా కార్తీక వనభోజనాలు, గోమాతలకు పూజలు, సత్యనారాయణవ్రతాలు నిర్వహించనున్నట్టు అర్చకుడు నాగరాజు తెలిపారు. ఏటా సుమారు 10వేల మట్టి ప్రమిదలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.





హనుమకొండ బస్టాండ్ రోడ్డులోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం


మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

చేయూత

ఆర్థిక స్వావలంబన దిశగా..

వృత్తి నైపుణ్య శిక్షణ

నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యువతలో అంతర్లీనంగా దాగిఉన్న నైపుణ్యాలకు మెరుగులు దిద్ది వారిని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్య శిక్షణనందిస్తోంది. ఈ క్రమంలో హనుమకొండ బస్టాండ్ రోడ్డు, కాకతీయ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న కేంద్రాల్లో స్వయం ఉపాధి వృత్తి నైపుణ్య కోర్సుల్లో చేరేందుకు 18నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువత ఆసక్తి చూపుతోంది. హనుమకొండ జిల్లా యువజన క్రీడల అభివృద్ధి సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతీ, యువకులు వివిధ కోర్సుల్లో రాణించి అనతికాలంలోనే జీవితాల్లో ఆర్థికంగా స్థిరపడుతున్నారు.

పదోతరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్, ఎలక్ట్రీషియన్, ఎయిర్ కండీషన్, రిఫ్రిజిరేటర్ రిపేరింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాల్, మొబైల్ సర్వీసింగ్, తదితర కోర్సుల్సో మూడు నెలల పాటు శిక్షణ అందిస్తున్నారు. వీటిలో శిక్షణ పొందడానికి నామమాత్రపు రుసుము వసూలుచేయడంతో పాటు సెలవు దినాలు, పండగ సెలవులు మినహాయించి ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నారు. నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న సెట్వార్ శిక్షణ కేంద్రంలో ఇప్పటికే 18బ్యాచ్‌లకు శిక్షణ అందించగా, ఇందులో ప్రతిభ కనబర్చిన పలువురు యువత స్వయం ఉపాధిని పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ప్రధానంగా మహిళలు తమకు నచ్చిన ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో నైపుణ్య పాఠాలను నేర్చుకొని ఆర్థికంగా బలపడేలా ఆసక్తిని చూపిస్తున్నారు.

ఉద్యోగావకాశాలు

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు తాము ఎంచుకున్న రంగంలో శిక్షణ పొందిన తర్వాత నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో వచ్చే సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుంది. ప్రధానంగా వివిధ ప్రైవేటు సంస్థలు నిర్వహించే జాబ్ మేళాలో వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందిన యువతకు ముందుగా ప్రాధాన్యం కల్పిస్తారు. అదేవిధంగా వృత్తి నైపుణ్య కోర్సుల్లో ప్రతిభ ఆధారంగా స్వయం ఉపాధిని పొందడానికి యువతకు చాలా అవకాశాలు ఉంటాయి. వృత్తి నైపుణ్య కోర్సుల్లో చేరడానికి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువత సైతం ఈ ఉపాధి కోర్సుల్లో చేరడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు.

కుట్టు మిషన్లు, బ్యూటీషియన్ కోర్సులకు ఆదరణ

- విజయశ్రీ, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం సూపరింటెండెంట్



వృత్తి నైపుణ్య కేంద్రంలో మహిళలు కుట్టు మిషన్లు, బ్యూటీషియన్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిలో రాణించి స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వీరికి జాబ్‌మేళాల్లో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం ప్రారంభం నుంచి నేటి వరకు 629 మంది శిక్షణ తీసుకోగా, వారిలో కొందరు ప్రభుత్వసంస్థల్లో ఉపాధి పొందగా, మరికొందరు తాము ఎంచుకున్న రంగంలో స్వయం ఉపాధి పొందుతున్నారు.

మహిళలకు శిక్షణ అందిస్తున్నా..

- ఇమ్మడిశెట్టి గాయత్రి, భీమారం హనుమకొండ.



ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ మేకింగ్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ పొందా. ఆ తర్వాత భీమారంలో నూత నంగా మగువ లేడీస్ టైలర్‌ను నెల కొల్పి డిజైనర్ బ్లౌజులు రూపొందించడంతో పాటు ఆసక్తి కలి గిన మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ అందిస్తూ నెలకు రూ.30వేల వరకు సంపా దిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నా. హ్యాండ్ ఎంబ్రాయిడరీతో పాటు మగ్గం వర్క్‌లో ప్రావీణ్యం పొందడంతో పెద్ద మొత్తంలో ఆర్డర్లు వస్తున్నాయి.

రూ.18వేలు సంపాదిస్తున్నా

- టి.శేఖర్, పత్తిపాక, శాయంపేట మండలం.



మూడు నెలల పాటు ఎలక్ట్రిషన్ కోర్స్‌లో శిక్షణ పొందా. ఇందులో ప్రావీణ్యం పొందాక మా ఊరిలో నూతనంగా నిర్మించే భవనాలకు హౌస్ వైరింగ్‌తో పాటు స్విచ్‌బోర్డులు, గీజర్, రైస్ కుక్కర్లు, ఫ్యాన్లు, మిక్సీలు రిపేరు చేస్తూ నెలకు సుమారు రూ.18వేల వరకు సంపాదిస్తూ జీవనోపాధి పొందుతున్నా.

టైలరింగ్‌లో శిక్షణ అందించా...

- సోమ శైలజ, టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షకురాలు



ప్రస్తుతం మహి ళలు బ్లౌజులపై డిజైన్ల కోసం హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌పై మక్కువ చూపుతుండటంతో టైలరింగ్ శిక్షణ కోసం మహిళలు ఆసక్తి చూపుతున్నారు. శుభకార్యాల కోసం రూ.వేలకు వేలు వెచ్చించి డిజైన్ బ్లౌజులు కుట్టించుకోవడంతో టైలరింగ్ కోర్సుకు డిమాండ్ పెరిగింది. మూడు నెలల వ్యవధిలో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన మహిళలు.. సొంతంగా తమ ఇళ్లలోనే షాపులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. వృత్తి శిక్షణ కేంద్రం ప్రారంభం నుంచి నేటి వరకు 300మందికి టైలరింగ్‌లో శిక్షణ అందించా.

డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నా..


- బి.అనూష, నీరుకుళ్ల, ఆత్మకూరు మండలం.



హనుమకొండలోని వృత్తి నైపుణ్యం కేంద్రంలో 11వ బ్యాచ్‌లో మూడు నెలల పాటు కంప్యూటర్ శిక్ష ణ పొందా. ఎంఎస్ ఆఫీస్ కోర్సులో ఎం ఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్స్‌ఎల్, షార్ట్‌కట్ కీస్ శిక్షణలో రాణించి సర్టిఫికెట్ పొందడంతో ములుగురోడ్డులోని టాటా సెలక్ట్ కంపెనీలో ఉద్యోగం సాధించా. ప్రస్తుతం నెలకు రూ.12వేల వేతనం రావడంతో కుటుంబానికి బాసటగా నిలవడం చాలా సంతోషంగా ఉంది.

ఉత్తమ దర్యాప్తునకు ప్రశంస

- డీఎస్పీ సత్యనారాయణకు యూనియన్ మెడల్


సత్యనారాయణ

హనుమకొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో నిందితులను సకాలంలో పట్టుకొని, వారికి ఉరిశిక్ష పడేలా దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ చూపిన వరంగల్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఆడెపు సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికయ్యారు. 2019లో ఆసిఫాబాద్ జిల్లాలో ఓ మహిళను గ్యాంగ్ రేప్ చేసి కిరాతకంగా హత్య చేసిన ముగ్గురు వ్యక్తులను నాడు ఆసిఫాబాద్ డీఎస్పీగా పనిచేస్తున్న సత్యనారాయణ సకాలంలో పట్టుకొని ఏడాది వ్యవధిలోనే ముగ్గురికి ఉరిశిక్ష పడేలా సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. సత్యనారాయణ దర్యాప్తు చేసిన తీరు, ఆయన చేసిన కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యూనియన్ మెడల్ అవార్డుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఎంపిక చేసింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే ఓ కార్యక్రమంలో సత్యనారాయణ ఈ అవార్డు అందుకోనున్నారు. దీంతో నర్సంపేట మండలం తిమ్మంపేటకు చెందిన సత్యనారాయణను గ్రామస్తులు, బ్యాచ్‌మేట్స్ అభినందించారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం
2 నవంబరు 2024



తీపి అంటే అందరికీ ఇష్టమే. అలా అని ఎప్పుడూ తినే స్వీట్లు తింటే బోర్ కొడుతుంది. అలాంటప్పుడు ఇలా కాస్త వెరైటీగా వీటిని తయారుచేసుకుని రుచిచూస్తే సూపర్బ్ అనకుండా ఉండలేరు. మరి మీరూ ట్రై చేయండి.

వంటిల్లు

తియ్యగా.. నోరూరించేలా..

ఆప్రికాట్ డిలైట్

కావలసిన పదార్థాలు

ఆప్రికాట్- 200గ్రాములు, బిస్కట్ క్రంబ్స్- 50 గ్రాములు, స్పాంజ్ క్రంబ్స్- 50 గ్రాములు, పాలు- 200 ఎంఎల్, పంచదార- 100 గ్రాములు, కస్టర్డ్ పౌడర్- 30గ్రాములు.

తయారీ విధానం

- ముందుగా ఆప్రికాట్స్‌ని వేడినీళ్లలో రెండు గంటలు నానబెట్టుకోవాలి.
- ఒక బౌల్‌లో పాలు తీసుకుని వేడి చేయాలి. 50 గ్రాముల పంచదార, కస్టర్ పౌడర్‌ని మరుగుతున్న పాలలో వేసి బాగా కలపాలి. కాసేపయ్యాక దింపి పక్కన పెట్టుకోవాలి.
- మరొక బౌల్‌లో నానబెట్టుకున్న ఆప్రికాట్‌లను స్టవ్‌పై పెట్టి వేడి చేయాలి. అందులో పంచదార వేసి, పాకం వచ్చాక దింపుకోవాలి.
- చల్లారిన తరువాత ఆప్రికాట్‌లను మిక్సీలో వేసి బ్లెండ్ చేయాలి.
- ఒక ట్రేలో ఆప్రికాట్ మిశ్రమాన్ని లేయర్‌లా వేయాలి. తరువాత దానిపై బిస్కట్ క్రంబ్స్, స్పాంజ్ క్రంబ్స్‌ని లేయర్‌గా వేసుకోవాలి. దానిపై కస్టర్డ్ మిల్క్‌ని పోయాలి. ఇదే విధంగా మరో లేయర్ చేయాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లగా సర్వ్ చేసుకోవాలి.

తిరమిసు



కావలసిన పదార్థాలు

కోడిగుడ్లు- 5, పంచదార- పావుకేజీ, కాఫీ లిక్కర్- 15 ఎంఎల్, మస్కర్‌పోన్ చీజ్- 200 ఎంఎల్, వైట్ చాక్లెట్- 100ఎంఎల్, క్రీమ్- 200 ఎంఎల్, లేడీఫింగర్స్ - సరిపడా.

తయారీ విధానం

- ఒక కప్పులో వేడి నీళ్లు తీసుకుని కొంచెం పంచదార, కాఫీ లిక్కర్ వేసి ఇన్‌స్టంట్ కాఫీ తయారు చేసి పక్కన పెట్టుకోవాలి.
- ఒక బౌల్‌లో కోడిగుడ్డు పచ్చ సొన తీసుకుని కొద్దిగా పంచదార వేసి గిలక్కొట్టాలి. తరువాత వైట్ చాక్లెట్‌ను కలుపుకోవాలి.
- ఇప్పుడు మస్కర్‌పోన్ కలిపి మళ్లీ గిలక్కొట్టాలి. తరువాత క్రీమ్ వేసి కలియబెట్టి పక్కన పెట్టుకోవాలి.
- ఒక వెడల్పాటి ట్రేలో లేడీఫింగర్స్ (స్వీట్ స్పాంజ్ కేక్ బిస్కట్లు)ను వరుసగా పరుచుకోవాలి. దానిపై ఒక లేయర్‌లా మస్కర్‌పోన్ మిశ్రమాన్ని వేయాలి.
- తరువాత మరొకసారి లేడీఫింగర్స్‌ని వరుసగా పరుచుకోవాలి. దానిపై మరో లేయర్ మస్కర్‌పోన్ మిశ్రమాన్ని వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.
- సర్వ్ చేసుకునే ముందు కాఫీ పౌడర్‌తో గార్నిష్ చేసుకోవాలి.

సకోరా ఫిర్నీ



కావలసిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, బియ్యం- 100గ్రాములు, యాలకులు- 10గ్రాములు, పిస్తా పలుకులు- 10గ్రాములు.

తయారీ విధానం

- స్టవ్‌పై ఒక కడాయిపెట్టి పాలు పోసి మరిగించాలి.
- బియ్యం శుభ్రంగా కడిగి ఆరబెట్టుకోవాలి. ఆరిన తరువాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిని పాలల్లో వేసి మరిగించుకోవాలి. చిక్కగా అవుతున్న సమయంలో పంచదార వేయాలి.
- యాలకుల పొడి వేసి దింపుకోవాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లబడిన తరువాత పిస్తా పలుకులతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేయాలి.

కొడాలి వెంకటేశ్వరరావు
ఎగ్జిక్యూటివ్ చెఫ్,
గోల్కొండ హోటల్,
హైదరాబాద్.
ఫోన్: 9666003930



షాహీ తుక్డా



కావలసిన పదార్థాలు

బ్రెడ్ ప్యాకెట్- ఒకటి, పంచదార- రెండు కేజీలు, నెయ్యి- ఒక కేజీ, యాలకుల పొడి- ఒక టీస్పూన్, బాదం పలుకులు- 100గ్రాములు, పిస్తా- 100 గ్రాములు, రబ్డీ- 500 గ్రాములు, నిమ్మకాయలు- రెండు.

తయారీ విధానం

- ముందుగా బ్రెడ్‌ని ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- తరువాత నిమ్మకాయ ముక్కలతో పంచదార పానకం తయారు చేసుకోవాలి.
- ఒక కడాయిలో నెయ్యి వేసి వేడి అయ్యాక బ్రెడ్ ముక్కలను గోల్డెన్ బ్రౌన్ రంగులోకి మారే వరకు వేయించుకోవాలి.
- ఇప్పుడు ఆ బ్రెడ్ ముక్కలను పంచదార పానకంలో వేయాలి. కాసేపయ్యాక తీసి ట్రేలో పెట్టుకోవాలి.
- ఆ బ్రెడ్ ముక్కలపై రబ్డీ పోయాలి. బాదం పలుకులు, పిస్తా పలుకులతో గార్నిష్ చేసుకోవాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లని షాహీ తుక్డా సర్వ్ చేసుకోవాలి.

భోజన కుతూహలం


బార్లీ గొప్ప చెప్పతరమా!

యూక్షశీతో గురుః స్వాదుస్సరో విడ్వాత కృద్యవః
వృష్య స్సస్థైర్య కరోమూత్రమేదః పిత్తకఫాన్ జయేత్
పీనస శ్వాసకాసోరు స్తంభ కంఠత్వగామయాన్!

బార్లీ అంటే జ్వరాలు వచ్చినప్పుడు జావ కాచుకుని తాగేందుకు మాత్రమే వాడతారనే ఓ బలమైన అభిప్రాయం ఉంది. కానీ వరి కన్నా, గోధుమకన్నా బార్లీ అనేక రెట్లు ఆరోగ్యదాయకమైన, బలకరమైన, ప్రయోజనకరమైన ధాన్యం అని చాలా మందికి తెలీదు. ఆ మాటకొస్తే అన్ని ధాన్యాలకన్నా బార్లీయే ఎక్కువ శక్తిదాయకం కూడా! ఋగ్వేద కాలం నాటి ప్రజలకు బార్లీ ప్రధాన ఆహార ధాన్యం. వాళ్లు దానిని 'యవలు' అని పిలిచేవారు. ఈ పేరు రావటానికి కూడా ఒక కారణముంది. ఋగ్వేద కాలంలో అంగుళంలో ఆరో వంతు ప్రమాణాన్ని 'యవ' అనేవారు. బార్లీ అంగుళంలో ఆరోవంతు ఉంటుంది కాబట్టి దీనిని 'యవ' అన్నారు. ఇదే విధంగా వేలిముద్రల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కొన్ని వేళ్ల మీద గీతలు యవ కంకుల్లా కనిపిస్తాయి. అందుకే వేళ్ల మీద గీతల్ని యవ అంటారు. జ్యోతిష శాస్త్రంలో కూడా యావ అనేది ఒక యోగం. ఇక దీనికి శూకముండాఖ అనే పేరు కూడా ఉందని 'భోజన కుతూహలం' గ్రంథం పేర్కొంది.

అనేక గుణాలు...

బార్లీ గింజలకు 'లేఖనం' అనే గుణం ఉంది. అంటే జిడ్డుని తొలగింస్తుందన్నమాట. శరీరంలో జిడ్డుని కలిగించేది కొవ్వు. ఆ కొవ్వుని తగ్గించే శక్తి బార్లీకుంది. అందువ్ల స్థూలకాయులకు ఇది దివ్యౌషధమని ఆయుర్వేదం పేర్కొంటుంది. అంతే కాదు... మిగతా ధాన్యాలకన్నా ఆహార పీచు (డయటరీ ఫైబర్) బార్లీలో ఎక్కువ. 'గురు' అనే గుణం కలిగి ఉండటం చేత బార్లీ ఆలస్యంగా జీర్ణం అవుతుంది. అందుకని షుగరు రక్తంలో చేరకుండా, షుగరు సూచిక వెంటనే పెరగకుండా ఆపుతుంది. బార్లీ గింజలకు కడుపులో, మూత్రంలో, విరేచనంలో మంటను తగ్గించే గుణం ఉంది. మూత్రాశయంలో కలిగే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది కూడా. ఊపిరితిత్తుల్లో పేరిన కఫాన్ని తగ్గిస్తుంది. తేలికగా జీర్ణం అవుతుంది. గొంతులో వచ్చే వ్యాధుల్లో బార్లీ ఔషధంగా ఉపయోగపడ్తుంది. దీర్ఘకాలం వదలని పడిశ భారాన్ని తగ్గిస్తుంది. దగ్గుని, ఆయాసాన్ని, ఉబ్బసాన్ని నివారిస్తుంది. కండరాలు పట్టేయటాన్ని ఆపుతుంది. రక్త దోషాల్ని, దప్పికని తగ్గిస్తుంది. వడ దెబ్బ తగలకుండా ఆపుతుంది. గడ్డల్ని కరిగించే ఫెరూలిక్ యాసిడ్ అనే రసాయనం ఇందులో ఉంటుంది. ఇది ట్యూమర్లను, కేన్సర్ గడ్డల్ని కరిగిస్తుంది. కేన్సర్ ముదరకుండా సాయపడుతుంది.



- ఒకప్పుడు జావా ప్రాంతంలో బార్లీ ఎక్కువగా పండేది. ఆ సమయంలో బార్లీని యవలు అనేవారు. యవలు అనే పదం నుంచే జావా అనే పదం వచ్చింది.
- హరప్పా, మోహంజోదారో నాగరికత సమయంలోనే బార్లీని పండించినట్లు ఆధారాలున్నాయి.

బార్లీ నీళ్లే కాదు...

బార్లీ గింజల్లో నీళ్లు పోసి, మెత్తగా ఉడికించి, వార్చిన జావ తాగుతుంటారు. కానీ, గింజల్ని వదిలేస్తుంటారు. ఇది సరికాదు. నీటిలో కరిగే స్వభావం ఉన్న పోషకాలు మాత్రమే ఈ జావలోకి వస్తాయి. మిగిలిన మినరల్స్, ఫైబరు వగైరా ఆ గింజల్లోనే ఉండిపోతాయి. అందుకని గింజలతో సహా జావ తాగాలి. బార్లీ, గోధుమ పిండిని చెరిసగం కలిపి తయారు చేసిన చపాతీలు, పుల్కాలు ఎంతో మృదువుగానూ, ఆరోగ్యదాయకంగానూ ఉంటాయి. దోశలు ఇతర పిండివంటల్లో కూడా బార్లీని కలుపుకోవచ్చు. కొందరు బార్లీని దోరగా వేగించి మెత్తగా మిక్సీ పట్టిన పిండిని కూరల్లోనూ పులుసుల్లోనూ చిక్కదనం కోసం వాడుతుంటారు. ఈ పిండిని నీళ్లలో వేసి ఉడికించగా వచ్చిన చిక్కని గంజిలో ఉప్పు గానీ తీపి గానీ నిమ్మరసం గానీ కలుపుకుని తాగుతారు. సమానంగా పెరుగు కలిపి మిక్సీ పట్టిన బార్లీ మజ్జిగవల్ల ప్రోబయాటిక్ ప్రయోజనాలు కూడా అదనంగా అందుతాయి. బి- విటమిన్ లోపంతో బాధపడేవారికి రోజూ రెండు చెంచాల బార్లీ పిండిని జావకాచి ఇస్తుంటే విటమిన్ మాత్రల అవసరం ఉండదు. మూత్రపిండాలలో రాళ్లు కరిగించే గుణం దీనికి ఉంది. విరేచనం ఫ్రీగా అవుతుంది. ఎక్కువగా నడవటం ద్వారా నీరు పట్టటం తగ్గుతుంది. చర్మానికి మంచి రంగుని, మృదుత్వాన్ని ఇస్తుంది. బీపీ త్వరగా తగ్గేందుకు తోడ్పడుతుంది. అతిసారం, కలరా లాంటి వ్యాధుల్లో చిక్కని బార్లీ జావని పెరుగు కలిపి, చిలికి, ఉప్పు, పంచదార వేసి తాగితే విరేచనాలు తగ్గుతాయి.

గంగరాజు అరుణాదేవి

బ్యూటీ

చలి కాలంలో చర్మం పదిలంగా...

చలికాలంలో ఎదురయ్యే ప్రధాన సమస్య చర్మం పొడిబారడం. చలిగాలుల వల్ల చర్మం తేమను కోల్పోయి పగిలిపోతుంది. కోల్డ్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు రాసినప్పటికీ ప్రయోజనం ఉండదు. అలా కాకుండా చర్మ సంరక్షణ కోసం శీతాకాలంలో పాటించాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం!

- సాధారణంగా చలికాలంలో నీళ్లు తక్కువగా తాగుతాం. దీని వల్ల శరీరానికి కావాల్సిన తేమ అందదు. పైగా చలిగాలులు చర్మం మీదున్న తేమను పీల్చుకొని నిస్తేజంగా మారుస్తాయి. రోజుకు కనీసం రెండు లీటర్ల నీటిని త్రాగడం వల్ల చర్మం హైడ్రేటెడ్‌గా ఉంటుంది.
- చలికాలంలో అందరూ వేడివేడి నీళ్లతో స్నానం చేస్తుంటారు. దీనివల్ల కూడా చర్మం పొడిబారుతుంది. అలా కాకుండా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.
- శీతాకాలంలో ముఖం శుభ్రం చేసుకోవడానికి స్ట్రాంగ్ క్లెన్సర్స్‌ను, బాగా నురగ వచ్చేవాటిని ఉపయోగించకూడదు. ఇవి చర్మంపై సహజసిద్ధమైన నూనె ఉత్పత్తి కాకుండా చేస్తాయి. ఎస్ఎల్ఎస్, ఆల్కహాల్ లేని తేలికపాటి క్లెన్సర్స్‌ను మాత్రమే వాడాలి. సబ్బు వాడకాన్ని తగ్గించాలి.



- చర్మం పొడిబారినపుడు ముందుగా టోనర్ ఆ తరవాత మాయిశ్చరైజర్ రాసుకోవాలి. టోనర్ రాయడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ అంది మాయిశ్చరైజర్ ఎక్కువసేపు నిలిచేలా చేస్తుంది. కొబ్బరి నూనె, ఆముదం, ఆలివ్ నూనెలు సహజ మాయిశ్చరైజర్లు.
- ముఖానికి హైఅలూరోనిక్ యాసిడ్ లేదా పెప్టైడ్ సీరమ్ అప్లయ్ చేసినా మంచి ఫలితముంటుంది.
- బయటికి వెళ్లేటపుడు సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. ఇది చర్మం తేమగా మృదువుగా ఉండేలా చేస్తుంది.

హాట్ టాపిక్

అవి ప్లాస్టిక్ మెరుపులేనా..!

సినీ ప్రపంచంలో విమర్శల స్థానాన్ని నేడు ట్రోల్స్ ఆక్రమించేశాయి. రూపురేఖలను, ముఖ కవళికలనూ మునుపటి ఫొటోలతో పోల్చి తేడాలను ఎత్తి చూపి, ప్లాస్టిక్ సర్జరీ ట్యాగ్‌ను తగిలించడం, వాటికి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించడం పరిపాటిగా మారింది. అలా తాజాగా ట్రోలింగ్ బారిన పడిన తారలు, వారి ప్రతిస్పందన గురించి తెలుసుకుందాం!

వెండి తెరల వినోదాన్ని పండించే తారలకు సైతం ట్రోలింగ్ తిప్పలు తప్పడం లేదు. అంతకంతకూ స్పష్టతను పెంచుకుంటున్న కెమెరా కళ్లు, వీటికి తోడవుతున్న కృత్రిమ మేథస్సులు అగ్ర తారల అందాలను అనుమానించే అవకాశాలను కల్పిస్తున్నాయి. నిజానికి తరగని వన్నెతో ఆకర్షణీయంగా కనిపించడం కోసం తారలు వాళ్లకు నచ్చిన మార్గాలను ఎంచుకోవడంలో తప్పు లేదు. అది పూర్తిగా వాళ్ల వ్యక్తిగత విషయం. అయినప్పటికీ వేళ్ల కొసల్లో ఉండే ఇంటర్నెట్‌తో ఇష్టారాజ్యంగా ట్రోల్ చేసేయడం నెటిజన్లకు కాలక్షేపంగా మారిపోయింది. అందరి దృష్టినీ ఆకర్షించడం లేదా తారలను మనోవేదనకు గురి చేయడం... ఇలా ట్రోలింగ్ లక్ష్యం ఏదైనా, దానికి అడ్డుకట్ట వేయడం ఎవరి తరం కావడం లేదు. అందుకే ఆ పనికి తారలే స్వయంగా నడుం బిగిస్తున్నారు. తమపై వస్తున్న ట్రోల్స్‌కు దీటుగా సమాధానాలివ్వడం మొదలుపెట్టారు. అలాంటి అగ్రతారల్లో వీళ్లు కొందరు.

అందులో ఆశ్చర్యం లేదు



ఈ తార పాత కొత్త ఫొటోలను సరిపోల్చుతూ, ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుందనే ట్రోల్స్ ఇంటర్నెట్‌లో షికార్లు చేయడం మొదలుపెట్టాయి. నయనతార ముఖకవళికలు మారిపోయాయనీ, ఆమె కనుబొమలు కూడా తరచూ మారుతూ ఉంటాయనీ వీటికి కారణం ఆమె తరచూ ప్లాస్టిక్ సర్జరీని ఆశ్రయించడమేననీ, నెటిజన్లు పదే పదే ట్రోల్ చేస్తూ ఉండడంతో, నయనతార స్పందించక తప్పలేదు. "గత కొన్నేళ్లుగా నా కనుబొమలు ఎన్నో మార్పులకు లోనయ్యాయి. ఇందుకు కారణం కాలంతో పాటు నా ముఖాకృతి కూడా మార్పులకు లోనవుతూ ఉండడమే! ముఖాకృతి మారిన ప్రతిసారీ కనుబొమల ఆకృతి మారడంలో ఆశ్చర్యం లేదు. అలాగే ముఖం కూడా భిన్నంగా కనిపిస్తూ ఉండడంతో, నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్టు భ్రమపడడం పరిపాటిగా మారుతోంది. కానీ ఇది నిజం కాదు. నేను తరచూ ఆహార నియమాలు పాటిస్తూ ఉంటాను. దాంతో బుగ్గలు లోపలకి వెళ్లిపోతూ ఉంటాయి. మీరు నన్ను గిచ్చి చూసినా, కాల్చి చూసినా నాలో ఇసుమంత ప్లాస్టిక్ కూడా మీకు కనిపించదు" అంటూ ట్రోల్స్‌కు ఘాటుగా స్పందించింది **నయనతార**.

◆◆◆

హెచ్చరిక..!



సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ఫొటోలు ట్రోల్స్‌కు దన్నుగా మారుతూ ఉంటాయని గ్రహించిన ప్రియాంకా చోప్రా, ఒక సరికొత్త టెక్నిక్‌ను కనిపెట్టింది. తాజాగా తన చిన్ననాటి ఫొటోతో పాటు మిస్ ఇండియా టైటిల్ గెలుచుకున్నప్పటి ఫొటోను షేర్ చేస్తూ, ట్రోల్ చేసేవాళ్లకు ఒక చిన్న చురక అంటించింది. చిన్ననాటి ఫొటో గురించి ట్రోల్ చేయొద్దని హెచ్చరిస్తూ ప్రియాంక పోస్ట్‌లో ఇలా రాసుకుంది. "హెచ్చరిక: తొమ్మిదేళ్లనాటి నన్ను ట్రోల్ చేయొద్దు. ఎడమ వైపున ఉన్నది టీనేజ్‌కు ముందు నాటి ఫొటో. బడికెళ్లే రోజుల్లో నేనలా బాయ్‌కట్‌తో ఉండేదాన్ని. ఆ కటోరి కట్ నుంచి ఇదిగో ఎడమ వైపున ఉన్న ఈ ఫొటోలో కనిపించే 17 ఏళ్ల టీనేజర్‌గా ఎదిగాను. అది 2000 సంవత్సరంలో మిస్ ఇండియా పోటీలో గెలిచిన నాటి ఫొటో. ఆ రెండు ఫొటోలు ఒక దశాబ్దం వ్యవధిలో తీసినవే అయినా, రెండింట్లో తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నా సినీ ప్రయాణం నన్నెంతో దూరం తీసుకొచ్చింది. అయినా ఇప్పటికీ అందరిలాగే ఇప్పటికీ నన్ను నేను తెలుసుకునే ప్రయత్నంలోనే ఉన్నాను" అంటూ పోస్ట్ చేసింది **ప్రియాంక**.

చాలా పెద్ద తప్పిదం...

ఆలియా చేయించుకున్న కరెక్టివ్ సర్జరీ ఫెయిల్ అయిపోయింది కాబట్టే నవ్వినప్పుడు ఆమె ముఖం విచిత్రంగా మారిపోతోందని, ఒక కాస్మటాలజిస్ట్ యూట్యూబ్ వీడియోలో ఆలియాను ట్రోల్ చేశాడు. దాంతో ఆలియా ఇన్‌స్టా వేదికగా తన ఆవేదనను పంచుకుంది. ఆ పోస్ట్‌లో ఆలియా... "ఒకరి రూపురేఖల గురించి,ఇంటర్నెట్‌లో ప్రత్యక్షమయ్యే ఇలాంటి అసంబద్ధమైన, నిరాధారమైన కామెంట్లు యువత మనసుల మీద ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో ట్రోల్ చేస్తున్న వ్యక్తులు గ్రహించకపోవడం విషాదకరం. నేను చేయించుకున్న బొటాక్స్ వికటించిందనే ఒక వీడియో ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోకు శాస్త్రీయ వివరణలను జోడిస్తూ, నా ముఖం సగభాగం పక్షవాతానికి గురైందని కూడా విమర్శించాడా ప్రబుద్ధుడు. ఎలాంటి ఆధారాలూ లేకుండా ఇలా ఒకరి రూపురేఖల గురించి తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం చాలా పెద్ద తప్పిదం. అసలు ఇలాంటి చెత్త పుకార్లను నమ్మేదెవరు? లైక్స్, షేర్స్ కోసం ఇలాంటి పుకార్లను సృష్టించే వాళ్లు వీటిని అందరూ అంత తేలికగా నమ్మరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి" అంటూ స్పందించి **ఆలియా**.



రసాలూరే పండైనా...

సూపర్ సినిమాలో తన అందచందాలతో తెలుగు ప్రేక్షకుల మనసులను కొల్లగొట్టిన అయేషా, వెండి తెర మీద అలా తళుక్కున మెరిసి ఇలా అంతర్థానమైపోయింది. అయినా ఇంటర్నెట్ ఆమె సంగతులు, విశేషాలను ఎప్పటికప్పుడు బట్టబయలు చేస్తూనే ఉంది. తాజాగా అయేషా టకియా రూపురేఖల గురించి కూడా ట్రోల్స్ మొదలయ్యాయి. ఫుల్లర్ లిప్స్, ఫుల్లర్ చీక్స్ ప్లాస్టిక్ సర్జరీ ఫలితమేనంటూ సోషల్ మీడియా ఆమెను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. అయేషా ఆ ట్రోల్స్‌కు సమాధానంగా, సుప్రసిద్ధ బుర్లెస్క్ డాన్సర్, మోడల్, డీటా వాన్ టీసీ మోటివేషనల్ కోట్‌ను పోస్ట్ చేసింది. ఆ కోట్ ఏంటంటే... "నువ్వు ప్రపంచంలోనే అత్యంత తీయని, రసాలూరే పండువి అయినా, నిన్ను అసహ్యించుకునే వాళ్లు ఈ ప్రపంచంలో ఉంటూనే ఉంటారు". ట్రోల్స్‌కు చెక్ పెట్టాలనే ఉద్దేశం ఈ పోస్ట్‌లో కనిపించకపోయినా, మనమెలా ఉన్నా ట్రోల్ చేసే స్వభావమున్న వాళ్లు ట్రోల్ చేస్తూనే ఉంటారన్నది **అయేషా** ఉద్దేశమని అర్థం చేసుకోవచ్చు.



పేరెంటింగ్

పిల్లల్లో సానుకూల దృక్పథానికి...

సాధారణంగా పిల్లల్లో ఎన్నో భయాలు, అపోహలు, నెగెటివ్ ఆలోచనలు ఉంటాయి. వీటన్నింటినీ తట్టుకుని పిల్లలు సానుకూల దృక్పథంతో ఎదగడానికి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను స్వీకరిస్తూ ఉన్నత లక్ష్యాలవైపు అడుగులు వేసేలా పిల్లల ఆలోచనా తీరును సరిదిద్దడం ఎలానో తెలుసుకుందాం!

- పిల్లలకు చిన్న కష్టం కూడా తెలియకుండా పెంచాలని తల్లిదండ్రులు అనుకుంటారు. ఇలా చేస్తే పిల్లలు సున్నితమనస్కులుగా మారతారు. చిన్న సమస్య ఎదురైనా భూతద్దంలో చూస్తూ భయపడుతుంటారు. అలా కాకుండా సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో పిల్లలకు తెలియజేయాలి.
- తోటి పిల్లలు కొడుతున్నారనో, తిడుతున్నారనో చెప్పినపుడు సాధారణంగా తల్లిదండ్రులు మీరు కూడా అలాగే చేయండి అనేస్తుంటారు. ఇది సమర్థనీయం కాదు. తోటివారితో స్నేహంగా ఎలా మెలగాలో పిల్లలకు నేర్పించాలి. చక్కని మాటతీరుతో స్నేహపూర్వకంగా ఉండేలా ప్రోత్సహించాలి.
- కొంతమంది పిల్లలు హింసాత్మక ధోరణితో ఉంటారు. ఇంటి చుట్టూ ఉండే కుక్కలను, పిల్లులను రాళ్లతో కొడుతుంటారు. దుడుకు స్వభావంతో తోటి పిల్లలతో గొడవపడుతుంటారు. పిల్లల్లో ఈ స్వభావాన్ని మార్చే ప్రయత్నం చేయాలి. సందర్భానుసారం దయ, ప్రేమ, స్నేహం గురించి వివరిస్తూ ఎవరినీ బాధించకూడదని నచ్చచెప్పాలి.



- తోటి పిల్లలకు హోంవర్క్‌లో సహాయం చేయడం, పాఠశాలలో లంచ్ బాక్స్ షేర్ చేసుకోవడాన్ని ప్రోత్సహించాలి. పిల్లలకు బాధ కలిగినపుడు దాన్ని స్నేహితులతో, కుటుంబ సభ్యులతో పంచుకోవడం నేర్పించాలి. అలాగే తోటివారి సమస్యల గురించి ఆలోచించే అలవాటు చేయాలి. ఎదుటివారికి సహాయం చేయడంలో ఉన్న ఆనందాన్ని పిల్లలకు అనుభవంలోకి తెచ్చే ప్రయత్నం చేయాలి.
- పిల్లలతో తల్లిదండ్రులు ఎప్పుడూ ప్రేమగా మాట్లాడాలి. వారిపై చిరాకు, కోపం ప్రదర్శించకూడదు. పిల్లలు ఏదైనా మంచి పనిచేసినపుడు వారిని అభినందిస్తూ ప్రోత్సహించాలి.
- ఓటమి ఎదురైనపుడు పిల్లలు కృంగిపోకుండా అది సహజంగా జరిగేదే అన్న ధోరణిలో తల్లిదండ్రులు నచ్చచెప్పాలి. గెలుపు, ఓటములను; సంతోషం, బాధలను సమానంగా చూడగలిగే మనోధైర్యాన్ని మరోసారి విజయం సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని కల్పించాలి.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 2 నవంబరు 2024
cinema@andhrajyothy.com



సంక్రాంతికి సిద్ధం

వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలయ్యే చిత్రాల జాబితాలోకి మరో పేరు చేరింది. విక్టరీ వెంకటేశ్ హీరోగా నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. వెంకటేశ్ లుంగీ ధరించి, తుపాకీ పట్టుకుని సీరియస్ పోజులో ఉన్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఆయన భార్య పాత్రధారి ఐశ్వర్య రాజేశ్ సంప్రదాయ దుస్తుల్లో, మాజీ లవర్ పాత్రలో మీనాక్షి చౌదరి మోడరన్ లుక్‌లో కనిపించారు.ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుందని, ప్రస్తుతం డబ్బింగ్ పనులు జరుగుతున్నాయనీ నిర్మాత శిరీష్ చెప్పారు. సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రాజకీయ నేపథ్యంలో సినిమా చేస్తా



నాగవంశీ

'మహానటి', 'సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన హ్యాట్రిక్ చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. అక్టోబరు 31న విడుదలైన ఈ సినిమాకు మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ లభించింది. ఈ సందర్భంగా నిర్మాత నాగవంశీ, దర్శకుడు వెంకీ అట్లూరి ప్రెస్ మీట్ నిర్వహించారు. నాగవంశీ మాట్లాడుతూ'సోషల్ మీడియాలో ఎక్కడా సినిమా గురించి ఒక్క నెగెటివ్ కామెంట్ కూడా కనిపించలేదు. అందుకే ప్రేక్షకులకు థాంక్స్ చెప్పేందుకు మీడియా ముందుకి వచ్చాం. థాంక్స్ అనేది చాలా చిన్న మాట. సినిమా పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు మాటల్లో చెప్పలేనంత సంతోషం కలుగుతోంది. బాలకృష్ణ 'ఎన్‌బికె 109' టీజర్, విడుదల తేదీకి సంబంధించిన అప్డేట్ వారం రోజుల్లో ఇస్తాం. ప్రస్తుతం మా బేనర్‌లో పలు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. రాబోయే రోజుల్లో ఒక భారీ రాజకీయ నేపథ్యమున్న సినిమా చేసే ఆలోచన ఉంది' అని అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ 'ప్రీమియర్ షోల నుంచే సినిమాకి ఎంతో మంచి టాక్ వచ్చింది. నాకు చాలా ఆనందంగా ఉంది. దర్శకుడిగా ఇంత మంచి పేరు రావడం చాలా అరుదైన విషయం. ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని సినిమా చూసిన ప్రేక్షకులు సంతృప్తి చెందుతున్నారు. సంభాషణలకు మంచి పేరు వస్తుండటం సంతోషంగా ఉంది. మణిరత్నం, త్రివిక్రమ్ స్ఫూర్తితోనే నేను సినీ పరిశ్రమలోకి వచ్చాను. నా సంభాషణల్లో త్రివిక్రమ్ ప్రభావం ఎంతో కొంత ఉంటుంది.' అని అన్నారు.

నటుడు చారుహాసన్‌కు అస్వస్థత




లెజండరీ నటుడు, 93 యేళ్ళ చారుహాసన్ అనారోగ్యం కారణంగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆయనకు ఆపరేషన్ చేయనున్నట్టు ఆయన కుమార్తె, సినీ నటి సుహాసిని మణిరత్నం ఓ వీడియో సందేశంలో వెల్లడించారు. అగ్రనటుడు కమల్ హాసన్‌కు స్వయానా అన్న అయిన చారుహాసన్‌ను గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు వృద్ధాప్య సమస్యలు వేధిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన ఉన్నట్టుండి గురువారం అస్వస్థతకు లోనుకావడంతో నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే తన తండ్రికి చిన్నపాటి ఆపరేషన్ చేయనున్నారని, ఇందుకోసం ఆయన సిద్ధమవుతున్నారని పేర్కొంటూ ఆస్పత్రి పడకపై ఉన్న తన తండ్రితో కలిసి దిగిన ఒక ఫోటోను సుహాసిని సోషల్ మీడియాలో షేర్ చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

అంచనాలను మించేలా ట్రైన్ ఫైట్

రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ రూపొందిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్‌ఛేంజర్' మీద రోజురోజుకీ అంచనాలు పెరిగిపోతున్నాయి. కియరా అడ్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి పదిన విడుదల చేయనున్నట్లు నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ వెల్లడించారు. ఈ నెల 9న టీజర్‌ను రిలీజ్ చేస్తామని చెప్పారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో లుంగీ, బనియన్, కూలింగ్ గ్లాస్‌తో పక్కా మాస్ గెటప్‌లో రైల్వే ట్రాక్ మీద కూర్చున్న రామ్‌చరణ్ మాస్ లుక్ అదిరిపోయింది. ఈ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సంగీత దర్శకుడు తమన్ ఇందులో ట్రైన్ ఫైట్ ఉందనీ, అది అందరి అంచనాలను మించేలా ఉంటుందని హింట్ ఇచ్చారు.



పాటతో పూర్తి

తమిళ హీరో ధనుష్, నాగార్జున, రష్మిక కాంబినేషన్‌లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్ భారీ స్థాయిలో నిర్మి



స్తున్న ఈ చిత్రం కోసం ఓ పాటను ప్రస్తుతం చిత్రీకరిస్తున్నారు. ఈ పాటతో షూటింగ్ పూర్తవుతుందని నిర్మాతలు చెప్పారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందని తెలిపారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 15న విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. పాత్రలు, వాటి నేపథ్యాలను లోతుగా ఆవిష్కరించే విధంగా టీజర్ ఉంటుందని తెలిపారు. దీపావళి సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషిస్తున్న 'కుబేర' చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలవుతుంది.

'మయూరి' సుధాకర్ కన్నుమూత



మయూరి ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్‌లో జనరల్ మేనేజర్‌గా పని చేసిన గుత్తా సుధాకర్ గురువారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు 65 ఏళ్లు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు.



ఓవైపు పండుగ తెచ్చిన ఊపు... మరో వైపు సినిమా అప్డేట్స్... దీపావళికి అభిమానుల్లో కొత్త జోష్ నింపాయి.

కుటుంబంతో ఎన్టీఆర్

సమంత

రష్మిక

దీపాల వెలుగులో కనుల విందు

ఎప్పుడూ సినిమా పనులతో బిజీగా గడిపే తారాలోకం దీపావళి సంబరాల్లో వెలిగిపోయింది. పలువురు కథానాయకులు కుటుంబ సభ్యులతో కలసి టపాసులు కాల్చి సంబరాలు చేసుకోగా, కథానాయికలు సంప్రదాయ వస్త్రధారణలో కనిపించి పండుగకు కొత్తకళ తెచ్చారు.

- జూనియర్ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో కలసి దీపావళిని సెలబ్రేట్ చేసుకున్నారు. భార్య ప్రణతి, కుమారులు అభయ్, భార్గవ్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, అభిమానులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కథానాయిక సమంత ఈ ఫొటోను చూసి 'ఆల్ మై ఫేవరేట్స్' అంటూ స్పందించారు.
- హీరోయిన్ సమంత ప్రస్తుతం రాజస్థాన్ విహారయాత్రలో ఉన్నారు. అక్కడ బార్వారా కోటలో ఆమె దీపావళి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. దీపాలు వెలిగించి, రాధాకృష్ణుల విగ్రహాలకు పూజ చేస్తున్న ఫొటోలను సమంత సోషల్ మీడియాలో షేర్ చేశారు.
- రష్మిక మందన్న దీపావళిని ఘనంగా సెలబ్రేట్ చేశారు. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. తమ్ముడు ఆనంద్ దేవరకొండతో కలసి టపాసులు కాల్చుతున్న ఫొటోలను విజయ్ దేవరకొండ షేర్ చేశారు.
- కొత్త దంపతులు సిద్ధార్థ్-అదితీరావు హైదరి పండుగ రోజు పెద్దలను కలసి ఆశీస్సులు అందుకున్నారు. కమల్‌హాసన్, మణిరత్నం, సుహాసిని తదితరులతో కలసి దిగిన ఫొటోలను వారు సోషల్ మీడియాలో షేర్ చేశారు.
- నాగబాబు ఇంట్లో దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరిపారు. భర్త, అత్తమామలు, ఆడపడుచుతో కలసి లావణ్య త్రిపాఠి తొలి దీపావళిని సెలబ్రేట్ చేశారు. ఈ వేడుకల్లో రామ్‌చరణ్, నిహారిక, సాయిదుర్గతేజ్, వైష్ణవ్‌తేజ్ సందడి చేశారు.
- విష్వక్‌సేన్, నారా రోహిత్ కుటుంబంతో కలసి దీపావళిని సెలబ్రేట్ చేసుకున్నారు. అవికా గోర్ సరస్వతి పూజ చేశారు. మెహ్రీన్ ఫిర్జాదా జిగేల్‌మనే లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. అరచేతుల్లో దీపాన్ని వెలిగించిన నభానటేశ్ ఆ కాంతిలో మెరిసిపోతూ కనిపించారు. దీపాల మధ్యన దిగిన ఫొటోను హీరోయిన్ శివాని షేర్ చేశారు. రాశీ ఖన్నా, నేహాశర్మ, పూజిత పొన్నాడ, వైష్ణవీ చైతన్య తదితరులు సైతం దీపావళిని ఘనంగా నిర్వహించారు.



రాశీఖన్నా



కమల్‌హాసన్‌తో అదితి, సిద్ధార్థ్



కుటుంబంతో వరుణ్‌తేజ్, లావణ్య



విజయ దేవరకొండ, ఆనంద్



పిల్లలతో సూర్య, జ్యోతిక




కాబోయే భార్యతో నారా రోహిత్



కుటుంబంతో విష్వక్‌సేన్



పూజాహెగ్డే



నభానటేశ్



అవికాగోర్

ఆశించిన ఫలితాన్ని ఇచ్చారు



సుజీత్, సందీప్

హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. రీసెంట్‌గా విడుదలై ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించిన దర్శకులుగా తొలి చిత్రంతోనే తమ ప్రతిభ నిరూపించుకున్నారు సుజీత్, సందీప్. సినిమా సక్సెస్ అయిన సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ విజయం సాధిస్తేనే మనుగడ అనుకున్నాం. అందుకే పట్టుదలగా పనిచేశాం. ప్రేక్షకులు మేము ఆశించిన ఫలితాన్ని ఇచ్చారు. ఈ దీపావళిని ఎంతో స్పెషల్ చేశారు. థియేటర్లలో ప్రేక్షకులు సినిమా చూస్తూ చివరలో స్టాండింగ్ ఓవేషన్ ఇస్తున్నారు. మేము 'క' కథ అనుకున్నప్పుడు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని భయపడ్డాం. కానీ, ఈ రోజు ప్రేక్షకులు కథకు చాలా కనెక్ట్ అవుతున్నారు. మూవీకి సామ్ సీఎస్ ఇచ్చిన మ్యూజిక్ పెద్ద ప్లస్ పాయింట్ అయ్యింది' అని తెలిపారు. దర్శకుడు సందీప్ మాట్లాడుతూ ' సోషల్ మీడియాలో ఎక్కడైనా సినిమా గురించి నెగెటివ్‌గా వస్తే ప్రేక్షకులే వాటికి సమాధానాలు ఇస్తున్నారు. ఏ కథకైనా ప్రిమేజ్ ముఖ్యం. 'క' సినిమాకు మేము చేసింది అదే. ఏ కథ అయినా ఫలానా ఏ, బీ, సీ ఆడియెన్స్‌కు నచ్చుతుందని విభజించుకుంటాం. 'క' సినిమా మల్టీప్లెక్స్ ఆడియెన్స్‌కు బాగా రీచ్ అవుతుంది. సీ సెంటర్‌లో కొంత తక్కువగా ఆదరిస్తారు అనుకున్నాం. కానీ ఈ రోజు రిజల్ట్ చూస్తుంటే సీ సెంటర్ ఆడియెన్స్ మల్టీప్లెక్స్ ఆడియెన్స్ కన్నా ఎక్కువగా ఇష్టపడుతున్నారు. బడ్జెట్ కాదు సబ్జెక్ట్ బాగుంటే ఇంటర్నేషనల్ లెవెల్‌కు సినిమాలు తీసుకెళ్లవచ్చని డైరెక్టర్ రాజమౌళి చెప్పినట్లు మా రాబోయే సినిమాలను సరికొత్తగా రూపొందించే ప్రయత్నం చేస్తాం' అని చెప్పారు.

క్లాసెన్‌కు జాక్‌పాట్



రూ.23 కోట్లతో అట్టిపెట్టుకున్న సన్‌రైజర్స్
విరాట్, పూరన్‌కు రూ.21 కోట్లు
అన్‌క్యాప్‌డ్‌గా ఎంఎస్ ధోనీ
వేలంలోకి పంత్, శ్రేయాస్, రాహుల్
ఆటగాళ్ల రిటెన్షన్ జాబితా వెల్లడి

ముంబై: ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న ఐపీఎల్ రిటెన్షన్ జాబితా వచ్చేసింది. రాబోయే 17వ సీజన్ కోసం డిసెంబరులో మెగా వేలం జరుగబోతోంది. అంతకన్నా ముందే లీగ్‌లోని పది ఫ్రాంచైజీలు తాము అట్టిపెట్టుకునే ఆటగాళ్ల పేర్లను ప్రకటించాల్సి ఉంది. అక్టోబరు 31తో గడువు ముగియడం తో అదే రోజు అన్ని జట్లు గరిష్ఠంగా ఆరుగురితో కూడిన తమ ఆటగాళ్ల జాబితాను ప్రకటించేశాయి. దీంతో ఎవరు వేలంలోకి వెళ్లబోతున్నారనేది స్పష్టమైంది. ఇందులో పలు ఫ్రాంచైజీలు ఆరుగురికన్నా తక్కువ మందితోనే సరిపెట్టుకున్నాయి. తద్వారా ఈ జట్లకు భారీ మొత్తంతో వేలంలోకి వెళ్లే వెసులుబాటు లభించింది. ఇక ఈసారి సీఎస్‌కే తరఫున ధోనీ బరిలోకి దిగుతాడా? లేదా? అనే ఊహాగానాలకు కూడా తెరపడింది. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా ధోనీని చెన్నై జట్టు రిటైన్ చేసుకుంది. భారత్ తరఫున ఆడక ఐదేళ్లు అయిన రిటైర్డ్ ఆటగాళ్లను అన్‌క్యాప్‌డ్‌గా పరిగణిస్తారు. అలాగే రోహిత్‌ను వేలంలోకి వదిలేస్తారని భావించినా.. ముంబై అతడిపై నమ్మకముంచింది. ఓవరాల్‌గా పంజాబ్ కేవలం ఇద్దరిని మాత్రమే రిటైన్ చేసుకోవడంతో అత్యధికంగా రూ.110.5 కోట్లతో, రాజస్థాన్ ఆరుగురిని ఎంపిక చేసుకోవడంతో అత్యల్పంగా రూ.41 కోట్లతో వేలానికి సిద్ధం కానున్నాయి.

అమ్మో.. అంత ధరా?

దక్షిణాఫ్రికా ఆటగాడు క్లాసెన్‌పై కనకవర్షం కురిసింది. గత సీజన్‌లో విధ్వంసకర ఆటతీరును ప్రదర్శించిన క్లాసెన్‌పై సన్‌రైజర్స్ ఏకంగా రూ.23 కోట్లు వెచ్చించింది. ఇది ఓవరాల్‌గా ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక ధర. గత వేలంలో ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్‌ను కేకేఆర్ రూ.24.75 కోట్లకు దక్కించుకున్న విషయం తెలిసిందే. అలాగే ఇతర విదేశీ ఆటగాళ్లయిన నికోలస్ పూరన్ (రూ.21 కోట్లు)పై లఖ్‌నవూ, కోహ్లీ (రూ. 21 కోట్లు) పై బెంగళూరు, ప్యాట్ కమిన్స్ (రూ.18 కోట్లు)పై సన్‌రైజర్స్ భారీ మొత్తాలను వెచ్చించి రిటైన్ చేసుకున్నాయి.

ఆ ముగ్గురిపై అందరి దృష్టి


పంత్

మెగా వేలానికి ముందు మూడు ఫ్రాంచైజీలు తమ కెప్టెన్లను వేలంలోకి వదిలేస్తూ అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇందులో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తో పాటు ఢిల్లీ కెప్టెన్ రిషబ్ పంత్, లఖ్‌నవూ సారథి కేఎల్ రాహుల్ ఉన్నారు. రాహుల్‌కు ఆ జట్టు యజమానితో విభేదాలు ఉండడంతో వేలంలోకి వస్తాడని భావించినా.. కేకేఆర్ శ్రేయా‌స్‌ను, డీసీ పంత్‌ను వదులుకోవడం ఊహించనిదే. అయితే వేలంలో వీరిపై ఆయా జట్లు భారీ మొత్తాలను వెచ్చించే అవకాశం లేకపోలేదు. అలాగే డెత్ ఓవర్లలో వికెట్లను తీసే పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను సైతం పంజాబ్ కింగ్స్ రిటైన్ చేసుకునేందుకు ఇష్టపడలేదు. అలాగే వెంకటేశ్ అయ్యర్, ఇషాన్ కిషన్, పేసర్లు దీపక్ చాహర్, సిరాజ్ సైతం వేలంలోకి రానున్నారు. విదేశీ ఆటగాళ్లలో ఆర్‌సీబీ కెప్టెన్ డుప్లెసీ, మిచెల్ స్టార్క్, జోస్ బట్లర్, మొయిన్ అలీ, శాంట్నర్, గ్రీన్, జాక్స్, మ్యాక్స్‌వెల్, కాన్వే, రచిన్‌లను ఆయా జట్లు వదిలేయడంతో వీరు కూడా అధిక ధర పలికే చాన్స్ ఉంది.



తొలి భారత ఆటగాడిగా విరాట్..

పేరుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ అయినా ధర విషయంలో ఇప్పటి వరకు విదేశీ ఆటగాళ్లదే హవా. అన్ని జట్లు వారిపైనే ఎక్కువ మొత్తం వెచ్చించేందుకు సిద్ధపడుతుంటాయి. ఈనేపథ్యంలో తొలిసారిగా ఓ భారత ఆటగాడు రూ.20 కోట్లకు పైన ధర పలకడం విశేషం. విరాట్ కోహ్లీని ఆర్‌సీబీ జట్టు రూ.21 కోట్లకు రిటైన్ చేసుకుంది. దీంతో ఐపీఎల్‌లో రూ.20+ కోట్లు పలికిన మొదటి భారత ఆటగాడిగా నిలిచాడు. అంతకుముందు స్టార్క్, కమిన్స్ ఈ క్లబ్‌లో ఉన్నారు.

ఆర్‌టీఎం అంటే..

2018లో చివరిసారి రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ఆప్షన్‌ను ఉపయోగించగా, తిరిగి ఈసారి ప్రవేశపెట్టారు. మెగా వేలంలోకి వదిలేసిన తమ ఆటగాళ్లను తిరిగి అదే జట్టు తీసుకోవాలనుకుంటే ఈ ఆర్‌టీఎంను ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో అయితే ప్రత్యర్థి ఫ్రాంచైజీ ఎంత బిడ్ వేసిందో అంతే మొత్తం చెల్లించి తమకు కావాల్సిన ప్లేయర్‌ను ఆయా జట్లు తీసుకునే అవకాశం ఉండేది. కానీ ఈసారి బీసీసీఐ ఆ నిబంధనను మార్చింది. దీనిప్రకారం ముందుగా బిడ్ వేసిన టీమ్‌కు మరోసారి పోటీలో ఉండే చాన్స్ లభిస్తుంది. అంటే ఆ జట్టు తిరిగి వేలం కొనసాగించవచ్చు. అప్పుడు ఆ పెరిగిన ధర చెల్లిస్తేనే ఆర్‌టీఎం ద్వారా పాత జట్లు తమకు కావాల్సిన ప్లేయర్లను సొంతం చేసుకుంటాయి. ఇక రిటెన్షన్ ప్రక్రియలో అట్టిపెట్టుకునే ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడమా? లేక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా తిరిగి తీసుకోవడమా? అనేది పూర్తిగా ఫ్రాంచైజీల నిర్ణయానికే వదిలేశారు.

ధర ఎందుకు పెరిగిందంటే..

ఐపీఎల్ రిటెన్షన్ రూల్ ప్రకారం రిటైన్ చేసుకునే ఆటగాడి అత్యధిక ధర రూ.18 కోట్లు. ఆ తర్వాత మిగిలిన వారికి వరుసగా రూ.14 కోట్లు, రూ.11 కోట్లు, రూ.18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు ఇది బీసీసీఐ నిర్దేశించిన కనీస పరిమితి మాత్రమే. ఫ్రాంచైజీలు తమకు కావాల్సిన ఆటగాడికి ఎంత మొత్తమైనా చెల్లించి రిటైన్ చేసుకునే సౌలభ్యం ఉంది. దీని ప్రకారమే క్లాసెన్‌కు రైజర్స్ జట్టు రూ.23 కోట్లు, ఆర్‌సీబీ విరాట్‌కు రూ.21 కోట్లు, లఖ్‌నవూ పూరన్‌కు రూ.21 కోట్లు ఇచ్చాయి.

రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితా



చెన్నై సూపర్ కింగ్స్	
రుతురాజ్ :	రూ.18 కోట్లు
పతిరణ :	రూ.13 కోట్లు
దూబే :	రూ.12 కోట్లు
జడేజా :	రూ.18 కోట్లు
ధోనీ :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.65 కోట్లు
మిగిలిన మొత్తం:	రూ.55 కోట్లు

ముంబై ఇండియన్స్	
బుమ్రా :	రూ.18 కోట్లు
సూర్యకుమార్ :	రూ.16.35 కోట్లు
హార్దిక్ :	రూ.16.35 కోట్లు
రోహిత్ :	రూ.16.30 కోట్లు
తిలక్‌వర్మ :	రూ.8 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.75 కోట్లు
మిగిలిన మొత్తం:	రూ.45 కోట్లు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	
విరాట్ కోహ్లీ :	రూ.21 కోట్లు
రజత్ పటీదార్ :	రూ.11 కోట్లు
యష్ దయాల్ :	రూ.5 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.37 కోట్లు
మిగిలిన మొత్తం:	రూ.83 కోట్లు

కోల్‌కతా నైట్‌రైడర్స్	
రింకూ సింగ్ :	రూ.13 కోట్లు
వరుణ్ చక్రవర్తి :	రూ.12 కోట్లు
నరైన్ :	రూ.12 కోట్లు
రస్సెల్ :	రూ.12 కోట్లు
హర్షిత్ రాణా :	రూ.4 కోట్లు
రమణ్‌దీప్ :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.69 కోట్లు
మిగిలిన మొత్తం:	రూ.51 కోట్లు

ఢిల్లీ క్యాపిటల్స్	
అక్షర్ పటేల్ :	రూ.16.50 కోట్లు
కుల్దీప్ యాదవ్ :	రూ.13.25 కోట్లు
స్టబ్స్ :	రూ.10 కోట్లు
అభిషేక్ పోరెల్ :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.47 కోట్లు
మిగిలిన మొత్తం:	రూ.73 కోట్లు

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్	
నికోలస్ పూరన్ :	రూ.21 కోట్లు
రవి బిష్ణోయ్ :	రూ.11 కోట్లు
మయాంక్ యాదవ్ :	రూ.11 కోట్లు
మొహిసిన్ ఖాన్ :	రూ.4 కోట్లు
ఆయుష్ బదోని :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.51 కోట్లు
మిగిలిన మొత్తం :	రూ.69 కోట్లు

పంజాబ్ కింగ్స్	
శశాంక్ సింగ్ :	రూ.5.5 కోట్లు
ప్రభ్‌సిమ్రన్ :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.9.5 కోట్లు
మిగిలిన మొత్తం :	రూ.110.5 కోట్లు

సన్‌రైజర్స్ హైదరాబాద్	
క్లాసెన్ :	రూ.23 కోట్లు
కమిన్స్ :	రూ.18 కోట్లు
అభిషేక్ :	రూ.14 కోట్లు
హెడ్ :	రూ. 14 కోట్లు
నితీశ్ కుమార్ :	రూ.6 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.75 కోట్లు
మిగిలిన మొత్తం :	రూ.45 కోట్లు

రాజస్థాన్ రాయల్స్	
శాంసన్ :	రూ.18 కోట్లు
జైస్వాల్ :	రూ.18 కోట్లు
పరాగ్ :	రూ.14 కోట్లు
జురెల్ :	రూ.14 కోట్లు
హెట్‌మయెర్ :	రూ.11 కోట్లు
సందీప్ శర్మ :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.79 కోట్లు
మిగిలిన మొత్తం :	రూ.41 కోట్లు

గుజరాత్ టైటాన్స్	
రషీద్ ఖాన్ :	రూ.18 కోట్లు
శుభ్‌మన్ గిల్ :	రూ.16.50 కోట్లు
సాయి సుదర్శన్ :	రూ.8.50 కోట్లు
తెవాటియా :	రూ.4 కోట్లు
షారుక్ ఖాన్ :	రూ.4 కోట్లు
వెచ్చించిన మొత్తం:	రూ.51 కోట్లు
మిగిలిన మొత్తం :	రూ.69 కోట్లు

అదే తీరు.. బ్యాటింగ్ మారలేదు!


కోహ్లీ (4) రనౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్ 86/4 ● న్యూజిలాండ్ 235 ఆలౌట్

భారత జట్టు బ్యాటింగ్ డొల్లతనం మరోసారి బయటపడింది..ఎప్పటిలానే బౌలర్లు న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు..అపై బ్యాటర్లు సత్తా చాటి బౌలర్ల కష్టానికి ఫలితం రాబట్టాల్సి ఉంది..కానీ మనోళ్ల తీరు మారలేదు ! రెండు టెస్టులు పూర్తయినా స్టార్ బ్యాటర్ల బ్యాటింగ్ గాడిలో పడలేదు..దీంతో బౌలర్ల శ్రమ వృథా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి..స్పిన్నర్లు జడేజా, సుందర్ అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థిని 250 రన్స్‌కులోపే కట్టడి చేయడంతో భారత్‌దే పైచేయి అయింది..అయితే కెప్టెన్ రోహిత్ దారుణ వైఫల్యాన్ని కొనసాగించగా, కోహ్లీ అనూహ్యంగా రనౌట్ కావడంతో మూడో టెస్ట్ మొదటి రోజే టీమిండియా ఇక్కట్లలో పడింది..ఇక తదుపరి బ్యాటర్లలో ఒకరిద్దరైనా పట్టుదలతో ఆడి క్రీజులో నిలవకపోతే ఈ మ్యాచ్ కూడా చేజారడం ఖాయం..

జడేజాకు 5, సుందర్‌కు 4 వికెట్లు

12 స్వదేశంలో ఐదు వికెట్లు తీయడం జడేజాకిది 12వసారి. ఓవరాల్‌గా 14వసారి.


జడేజా (5/65)

ముంబై: న్యూజిలాండ్‌తో కీలకమైన మూడో టెస్ట్‌లోనూ భారత జట్టు..ముఖ్యంగా బ్యాటర్ల తీరు ఏమాత్రం మెరుగుపడలేదు. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఆట నానాటికీ తీసికట్టు అన్న చందమైంది. ఫలితంగా వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఉండాలంటే గెలిచి తీరాల్సిన ముంబై మ్యాచ్‌లో టీమిండియా పరిస్థితులు తలకిందులయ్యేలా ఉన్నాయి. శుక్రవారం మొదలైన ఆఖరి టెస్ట్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్..జడేజా (5/65), సుందర్ (4/81) ధాటికి మొదటి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకే ఆలౌటైంది. విఎచెల్ (82), యంగ్ (71) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ చేపట్టిన భారత్ ఆట ఆఖరికి 86 పరుగులకే నాలుగు వికెట్లు చేజార్చుకుంది. గిల్ (31 బ్యాటింగ్), జైస్వాల్ (30) రాణించారు. రోహిత్ (18), కోహ్లీ (4) తీవ్రంగా నిరాశ పరిచారు.

జైస్వాల్, గిల్ భాగస్వామ్యం: ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన భారత్ ఆనందం.. మొదటి రోజు ఆట చివర్లో ఆవిరైంది. అంతకుముందు..సొంత గడ్డ ముంబైలో కేవలం రెండో టెస్టే ఆడుతున్న రోహిత్ ధాటి షాట్లతో అలరించాడు. ఈక్రమంలో లభించిన లైఫ్‌ను అతడు సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఓ భారీ షాట్ సంధించే క్రమంలో రోహిత్ వికెట్ పారేసుకున్నాడు. 25/1తో ఉన్న దశలో జైస్వాల్‌కు గిల్ తోడయ్యాడు. పుణె టెస్ట్ మాదిరే వీరు జట్టు ఇన్నింగ్స్ చక్కదిద్దారు. సాధికార షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. రెండో వికెట్‌కు 53 పరుగులతో జోడించారు.

10 నిమిషాల్లో తారుమారు: యశస్వీ, శుభ్‌మన్ భాగస్వామ్యం బలపడుతూ తొలిరోజును ప్రశంసనీయంగా ముగిస్తారని భావిస్తున్న దశలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరో 10 నిమిషాల్లో ఆటకు తెరపడనుండగా..భారత ఇన్నింగ్స్ తీవ్ర కుదుపులకు లోనైంది. స్పిన్నర్ ఎజాజ్ లెగ్ స్టంప్ ఆవలిగా వేసిన బంతిని రివర్స్ స్వీప్ చేయబోయిన జైస్వాల్ బౌల్డయ్యాడు. తన టెస్ట్ కెరీర్‌లో గత 14 ఇన్నింగ్స్‌లలో కళ్లు చెదిరే రివర్స్ స్వీప్ షాట్లు ఆడిన జైస్వాల్ మొదటిసారి ఇలా అవుట్ కావడం గమనార్హం. తదుపరి మరో అద్భుతమైన బంతికి నైట్‌వాచ్‌మన్ సిరాజ్‌ను ఎల్బీ చేసిన ఎజాజ్ గట్టి దెబ్బ కొట్టాడు. సిరాజ్ రివ్యూకి వెళ్లినా ఫలితం దక్కలేదు. ఇక..లేని పరుగుకోసం వెళ్లి కోహ్లీ రనౌట్ కావడంతో..ఎనిమిది బంతులలో టీమిండియా ఇన్నింగ్స్ మారిపోగా..కివీస్ మ్యాచ్‌పై పట్టు బిగించింది.

జడేజా 'ఐదు'

వాంఖడే స్పిన్ పిచ్‌పై టాస్ గెలిచిన లాథమ్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఆకాశ్‌దీప్, సుందర్ ధాటికి 72/3తో నిలిచిన పర్యాటక జట్టును మిచెల్, యంగ్ నాలుగో వికెట్‌కు 87 పరుగులు జత చేసి గాడిలో పెట్టారు. కానీ జడేజా విజృంభణకు కివీస్ 159/3 నుంచి 235కు ఆలౌటైంది.

బాబోయ్ ఎండ



మ్యాచ్‌కు తొలిరోజైన శుక్రవారం 37 డిగ్రీల ఎండతో సూర్యుడు ఠారెత్తించాడు. దానికితోడు తీవ్ర ఉక్కపోత. ఫలితంగా ఆటగాళ్లు అల్లాడిపోయారు. బ్యాటర్లు ప్రతి రెండు ఓవర్లకోసారి డ్రింక్స్ తీసుకోవాల్సి వచ్చింది. అలాగే విరామం మధ్యలో ఐస్ టవల్స్, ఐస్ ప్యాక్‌ను మెడ చుట్టూ ఉంచుకుంటూ ఎండనుంచి కాపాడుకోనేందుకు తంటాలు పడ్డారు.

5 టెస్టుల్లో అత్యధిక (314) వికెట్లు పడగొట్టిన ఐదో భారత బౌలర్ జడేజా. ఈక్రమంలో జహీర్‌ఖాన్, ఇషాంత్ (311)లను దాటేశాడు.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : లాథమ్ (బి) సుందర్ 28, కాన్వే (ఎల్బీ) ఆకాశ్‌దీప్ 4, యంగ్ (సి) రోహిత్ (బి) జడేజా 71, రచిన్ (బి) సుందర్ 5, మిచెల్ (సి) రోహిత్ (బి) సుందర్ 82, బ్లండెల్ (బి) జడేజా 0, ఫిలిప్స్ (బి) జడేజా 17, సోఢీ (ఎల్బీ) జడేజా 7, హెన్రీ (బి) జడేజా 0, ఎజాజ్ (ఎల్బీ) సుందర్ 7, ఓ రోర్క్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు 13 : మొత్తం 65.4 ఓవర్లలో 235 ఆలౌట్ ; వికెట్లపతనం** : 1-15, 2-59, 3-72, 4-159, 5-159, 6-187, 7-210, 8-210, 9-228 ; **బౌలింగ్** : సిరాజ్ 6-0-16-0, ఆకాశ్‌దీప్ 5-0-22-1, అశ్విన్ 14-0-47-0, సుందర్ 18.4-2-81-4, జడేజా 22-1-65-5.

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (బి) ఎజాజ్ 30, రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18, గిల్ (బ్యాటింగ్) 31, సిరాజ్ (ఎల్బీ) ఎజాజ్ 0, కోహ్లీ (రనౌట్/హెన్రీ) 4, పంత్ (బ్యాటింగ్) 1 ; **ఎక్స్‌ట్రాలు : 2 ; మొత్తం : 19 ఓవర్లలో 86/4 ; వికెట్లపతనం** : 1-25, 2-78, 3-78, 4-84 ; **బౌలింగ్:** హెన్రీ 5-1-15-1, ఓ రోర్క్ 2-1-5-0, ఎజాజ్ పటేల్ 7-1-33-2, ఫిలిప్స్ 4-0-25-0, రచిన్ 1-0-80.

విజేత సంజన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఏఐటీఏ) నిర్వహించిన ఏఎన్‌టీ అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సిరిమల్ల సంజన విజేతగా నిలిచింది. శుక్రవారం బెంగళూరులో జరిగిన ఈ పోటీల ఫైనల్లో సంజన 6-4, 6-4తో విదుల అమర్ (కర్ణాటక)పై నెగ్గి, టైటిల్ సొంతం చేసుకుంది. అంతకుముందు ముగిసిన సెమీఫైనల్స్‌లో సంజన 6-4, 2-6, 7-5తో టోర్నీ టాప్ సీడ్ ఆమోదిని నాయక్ (కర్ణాటక)ను ఓడించి, ఫైనల్లో ప్రవేశించింది.

సుదర్శన్, పడిక్కళ్ అర్ధ శతకాలు

భారత్ 'ఏ' 208/2

మాకే (ఆస్ట్రేలియా): సాయి సుదర్శన్ (96 బ్యాటింగ్), పడిక్కళ్ (80 బ్యాటింగ్) అర్ధ శతకాలతో చెలరేగడంతో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్ 'ఏ' పట్టు బిగించింది. సాయి సుదర్శన్, పడిక్కళ్ మూడో వికెట్‌కు అభేద్యంగా 178 పరుగులు జోడించడంతో భారత్ 'ఏ' రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆఖరికి 208/2 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ 99/4 స్కోరుతో రెండో రోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 'ఏ' 195 పరుగులకు ఆలౌటైంది. ముకేశ్ ఆరు వికెట్లు తీయగా, ప్రసిద్ధ్ మూడు వికెట్లు సాధించాడు. కాగా..భారత్ 'ఏ' మొదటి ఇన్నింగ్స్‌లో 107 రన్స్ చేసింది.


సుదర్శన్ (96 బ్యాటింగ్)

రెజ్లర్ మాన్సీకి కాంస్యం



టిరానా: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత రెజ్లర్ మాన్సీ అహ్లావత్ కాంస్య పతకం కొల్లగొట్టింది. అల్బేనియాలో జరుగుతున్న ఈ పోటీల్లోని మహిళల 59 కిలోల విభాగం కాంస్య పతక పోరులో మాన్సీ 5-0తో లారెన్స్ బ్యూరెగార్డ్ (కెనడా)ను చిత్తు చేసి, విజేతగా నిలిచింది. అంతకుముందు జరిగిన సెమీస్ బౌట్‌లో మాన్సీ 1-4తో సుఖీ సిరెంచిమెడ్ (మంగోలియా) చేతిలో ఓడింది. మనీషా భన్వాలా 65 కి. కేటగిరీ కాంస్య పతక బౌట్‌లో 2-8తో మివా మోరికావా (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. ఇతర పోటీల్లో కీర్తి (55 కి.), బిపాషా (72 కి.), సందీప్ (92 కి.), ఉదిత్ (61 కి.), మనీష్ (70 కి.), పర్వీందర్ (79 కి.) పతకం లేకుండా ఇంటిముఖం పట్టారు.

భారత టూర్‌కు సఫారీ సైన్యమిదే!

డర్బన్: భారత్‌తో జరుగబోయే నాలుగు టీ20ల సిరీస్‌కు దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించారు. 16 మందితో కూడిన బృందానికి మార్‌క్రమ్ నేతృత్వం వహించనున్నాడు. ఇరు జట్ల మధ్య 8 నుంచి సిరీస్ ఆరంభం కానుంది. **జట్టు:** మార్‌క్రమ్ (కెప్టెన్), హెండ్రిక్స్, స్టబ్స్, మిల్లర్, బార్ట్‌మన్, కొట్జీ, ఫెర్రీరా, జాన్సెన్, క్లాసెన్, క్రుగర్, కేశవ్, మిహ్లాలి, పీటర్, రికెల్టన్, సిమెలనె, సిపమ్లా.

పామాయిల్ కాసుల 'గెల'గల

- టన్ను రూ.19,144.. గత నెల కంటే రూ.2101 పెరుగుదల
- రైతుల్లో హర్షం.. ఖమ్మంలో 7 వేల మందికి ప్రయోజనం
- ధరలపై ఫలించిన మంత్రి తుమ్మల కృషి

అశ్వారావుపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతులకు ఈ ఏడాది అన్నీ శుభ శకునాలే కనిపిస్తున్నాయి. రెండు, మూడు నెలల నుంచి ధర వేగంగా పెరుగుతూ ఆశలు రేకెత్తిస్తోంది. మొన్నటివరకు టన్ను గెలల రేటు రూ.13 వేల లోపే ఉండగా.. అక్టోబరులో ఏకంగా రూ.19,144కు ఎగబాకింది. ఇది సెప్టెంబరు కంటే రూ.2,101 అధికం. సెప్టెంబరు మొదటితో పోలిస్తే ఏకంగా టన్నుకి రూ.4,756 మేర పెరగడం విశేషం. కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం పెంచడం, ఆయిల్ రికవరీ శాతం తదితరాలు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో జరిపిన చర్చలు.. ఏదైతేనేం ఆయిల్‌పామ్ గెలల ధర పైపైకి వెళ్తోంది. దీంతో రైతుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. జూలై వరకు రూ.12వేల లోపు ఉన్న పామాయిల్ గెలల ధర నాలుగు నెలల్లోనే రూ.7 వేలకు పైగా పెరగడం గమనార్హం. వాస్తవానికి చాలా కాలంగా పామాయిల్ గెలల ధర పడిపోతోంది. దీంతో తుమ్మల.. పలుమార్లు కేంద్ర మంత్రి, అధికారులతో సంప్రదింపులు జరిపారు. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5శాతానికి పెంచేలా కృషి చేశారు. తెలంగాణలో 90 శాతం పామాయిల్ పంట ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే పండుతోంది. మొత్తం రెండు లక్షల టన్నుల గెలలను ఉత్పత్తి చేస్తున్నారు. తాజా ధరల పెరుగుదల ప్రభావం ఏడు వేల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చనుంది. సాగును మరింత విస్తరించడానికి అవకాశం కలగనుంది. కాగా, పామాయిల్ రైతులకు మంచి రోజులు వచ్చాయంటూ ఆయిల్‌ఫెడ్ అధికారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతన్న ఆశలపై నీళ్లు

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

- పలు జిల్లాల్లో నేలకొరిగిన వరి
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి
- హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన
- నేడు, రేపు అక్కడక్కడా వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని నిండా ముంచింది. వరి పంటపై విరుచుకుపడి, కోతకొచ్చిన గొలుసులను నేలవాల్చింది. పలు జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో కురిసిన వాన రైతన్న ఆశలపై నీళ్లు చల్లింది. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని మర్రివానిపల్లె, సిరిసేడు, ఇల్లందకుంట తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. మర్రివానిపల్లెలో 65 ఎకరాల్లో వరి పూర్తిగా దెబ్బతింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్, వెల్గటూర్ మండలాల్లో కోతకు వచ్చిన వరి పంట నేల కొరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, సిరిసిల్ల, రుద్రంగి, తంగళ్లపల్లి, మండలాల్లోని కొనుగోలు కేంద్రాలు, పొలాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లితో పాటు పలు గ్రామాల్లో వరి పంట నేలవాలింది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో పెద్ద మొత్తంలో వరి ధాన్యం తడిసింది. పలు చోట్ల వరద నీటిలో వడ్లు కొట్టుకుపోయాయి. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో సుమారు 4సెం.మీకు పైగా వర్షపాతం నమోదైంది. దీంతో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో వందల ఎకరాల్లో వరి నేలవాలింది. ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసి ముద్దయింది.


మియాపూర్-చందానగర్ మార్గంలో రోడ్డుపై నిలిచిన వరద


మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రిలో వరద నీటిలో ధాన్య రాశులు

హైదరాబాద్‌లో జోరు వాన..

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వాన దంచికొట్టింది. రోడ్లపై మోకాళ్లలోతు నీరు చేరడంతో వాహనాలు మునిగిపోయాయి. మెహిదీపట్నం, టోలీచౌకి, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్ బంజారాహిల్స్ బోరబండ, ఇందిరానగర్, కృష్ణానగర్, మాదాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, హైదర్‌గూడ, అల్వాల్ తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శేరిలింగంపల్లిలో భారీ వర్షం కురిసింది. లింగంపల్లి, తారానగర్, గుల్‌మొహర్ పార్కు, అంజయ్యనగర్, గచ్చిబౌలి, మియాపూర్, మదీనగూడ, చందానగర్, మాదాపూర్, రాయదుర్గం ప్రాంతాల్లో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నల్లగండ్ల హుడాకాలనీ తెల్లాపూర్ రోడ్డులో రోడ్డుపై మోకాళ్లలోతు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మాదాపూర్-5.8 సెం.మీ, గచ్చిబౌలి-5.6, చందానగర్-4.1, లింగంపల్లి, అల్లాపూర్-3.8, హఫీజ్‌పేట్-3.1, మియాపూర్-2.7 సెం.మీ వర్షం కురిసింది.

పిడుగుపాటుతో ముగ్గురి మృతి

పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెందారు. ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన సొనవ నవీన్(24) పొలంలో పశువులను మేపుతుండగా పిడుగుపాటుతో మృతిచెందాడు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయిపేటకు చెందిన జనగామ చిన్న మల్లయ్య(35) పొలం పనులకు వెళ్లి వస్తుండగా పిడుగుపడి చనిపోయాడు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొత్త మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మనపేట గ్రామంలో పత్తి ఏరుతుండగా పిడుగు పడి గడ్డం నాగమ్మ(26) చనిపోయింది.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శని, ఆది వారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం మంచిర్యాల జిల్లా కాసిపేటలో అత్యధికంగా 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది.


చెట్టుకు ఢీ కొట్టిన పోర్షే కారు

భార్య మీద కోపం పోర్షే కారు మీద చూపించాడు

- ఆగ్రహంతో అతి వేగంగా నడిపి యాక్సిడెంట్

బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పండగపూట భార్యతో తగాదా పడిన ఓ వ్యక్తి... తన ఆగ్రహావేశాల్ని కారు నడపటంలో చూపించాడు. కట్టలు తెంచుకుంటున్న ఆవేశాన్ని ఆపుకోలేక మితిమీరిన వేగంతో వాహనం నడిపాడు. అలాగే రాత్రంతా నగరంలో చక్కర్లు కొట్టాడు. చివరికి కారు అదుపు తప్పడంతో కేబీఆర్ పార్కు ప్రహరీని ఢీకొట్టాడు. బెలూన్‌లు తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ బంజారాహిల్స్ పరిధిలో జరిగింది. ఇక్కడి రోడ్డు నెంబరు 6లో నివసించే ఉత్సవ్ దీక్షిత్ అనే పారిశ్రామికవేత్త... దీపావళి రోజున భార్యతో గొడవ పడ్డాడు. పట్టరాని కోపంతో తన పోర్షే కారును బయటకు తీసి రాత్రంతా రోడ్లపై తిరిగాడు. శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు నెంబరు 12 వద్ద బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వైపు వాహనాన్ని మళ్లించాడు. కొద్దిదూరం రాగానే వేగంగా ఉన్న కారు అదుపు తప్పింది. పక్కనే ఉన్న డివైడర్‌ను ఎక్కి గాల్లో లేచి కేబీఆర్ ప్రహరీని ఢీ కొడుతూ అక్కడే ఉన్న చెట్టు కొట్టి ఆగిపోయింది. సమయానికి కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో దీక్షిత్ సురక్షితంగా బయటపడ్డాడు. కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. కారు వేగానికి కేబీఆర్ పార్కు ప్రహరీకి ఉన్న చిన్న గేటు ఎగిరి ఫర్లాంగ్ దూరంలో పడింది. కారు చెట్టుకు ఢీకొని ఉండకపోతే వాకర్ల మీదకి వెళ్లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై ఐదుగురి సామూహిక అత్యాచారం

- నిందితుల్లో ముగ్గురు మైనర్లు.. అంతా గంజాయి మత్తులో?
- పోక్సో కేసు.. వికారాబాద్ జిల్లాలో ఘటన

దోమ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని ఓ గ్రామంలో ఘోరం జరిగింది. ఓ బాలికపై ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల్లో ముగ్గురు మైనర్లున్నారు. ఐదుగురూ గంజాయి మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు చెబుతున్నారు. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. బాధితురాలు 8వ తరగతి విద్యార్థిని. ఆమెకు కొన్ని నెలల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ బాలుడితో పరిచయమేర్పడింది. ఇద్దరూ చనువుగా మెలిగారు. అక్టోబరు 28న పాఠశాల నుంచి ఇంటికొచ్చిన బాలికకు ఆ బాలుడు పథకం ప్రకారం గ్రామంలోని మరో బాలుడి ఇంట్లోకి తీసుకెళ్లాడు. అక్కడ ముగ్గురు మైనర్లు సహా ఐదుగురు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత బాలిక ఆలస్యంగా రాత్రి ఇంటికి వెళ్లడంతో తల్లిదండ్రులు ప్రశ్నించగా జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు చెప్పుకొని బోరుమంది. బాధితురాలి తల్లిదండ్రులు అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారు డీఎస్పీ కస్టడీలో ఉన్నట్లు సమాచారం. ఆ నలుగురిపై 96, 172, 127, 76, 351, రెడ్ విత్ 49 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు దోమ ఎస్సై అరవింద్‌కుమార్ తెలిపారు. కాగా ఆ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా 12 వారాల గర్భవతిగా నిర్ధారించినట్లు తెలిపారు.

మానవత్వం లేని ప్రభుత్వం నడుస్తోంది

- కేసులకు భయపడం: సిరికొండ మధుసూదనాచారి
- మహబూబ్‌నగర్ నుంచే మరో ఉద్యమం: శ్రీనివాస్‌గౌడ్

పోలీసు విధులకు ఆటంకం కలిగించారని 19 మందిపై కేసు

మహబూబ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ మాత్రం మానవత్వం లేని ప్రభుత్వం నడుస్తోందని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తను కొట్టడాన్ని ప్రశ్నిస్తూ పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలిపితే శ్రీనివాస్‌గౌడ్‌తోసహా మొత్తం 19 మందిపై కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచే మరో ఉద్యమం ప్రారంభం కాబోతుందన్నారు. సోషల్ మీడియా కార్యకర్తను ఎందుకు కొట్టారని అడిగేందుకు వెళ్తే.. తమపైనా అక్రమంగా కేసు నమోదు చేశారని విమర్శించారు. కాగా, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తపై అక్రమ కేసు బనాయించి.. కొట్టారంటూ గత బుధవారం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టాయి. ఈ నేపథ్యంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ అదే రోజు 19 మంది బీఆర్ఎస్ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎంను కలిసిన 4వ తరగతి ఉద్యోగులు

మంగళ్‌హాట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని 4వ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర 4వ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడు జి. జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈమేరకు శుక్రవారం వారు 4వ తరగతి ఉద్యోగులతో కలిసి కమాండ్ కంట్రోల్ రూంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్, గంగాధర్ మాట్లాడుతూ 4వ తరగతి ఉద్యోగ సంఘం కేంద్ర కార్యాలయం ఏర్పాటు నిమిత్తం వెయ్యి గజాల స్థలం కేటాయించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణకు చెందిన 100 మంది ఉద్యోగులు ఆంధ్రాలో పనిచేస్తున్నారని వెంటనే వారిని వెనక్కి రప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సంఘానికి స్థలం కేటాయించడంతో పాటు ఏపీలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగులను వెంటనే రాష్ట్రానికి రప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇంట్లో చోరీ

కాగజ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇంట్లో గురువారం చోరీ జరిగింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం డాడానగర్‌లో గల ఇంట్లో దుండగులు లూటీకి పాల్పడ్డారు. ఇంటికి ఉన్న తాళాన్ని పగులగొట్టి, సీసీ కెమెరా వైర్లను కట్‌చేసి దొంగలు చోరీ చేశారు. గన్‌మెన్లు ఉండే గది బీరువాను పగులగొట్టి కీలకపత్రాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారని ఆర్ఎస్ ప్రవీణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రామానుజం, సీఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వెల్ఫేర్ ఆఫీసర్'కు 14 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఈ మేరకు శుక్రవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. నవంబరు 14 నుంచి 30 వరకు ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెలుగు వర్సిటీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఈ తేదీల్లో వెరిఫికేషన్‌ను ఉపయోగించుకోలేని అభ్యర్థులకు డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు మరో అవకాశం ఇవ్వనున్నారు. కాగా, తెలంగాణ అమరవీరుడు పోలీసు కిష్టయ్య భార్య పద్మావతికి పదోన్నతిని కల్పించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. కారుణ్య నియామకం పరిధిలో ఆమెకు గతంలో ఇంటర్ బోర్డులో టైపిస్టుగా ఉద్యోగం ఇచ్చారు. తాజాగా లైబ్రేరియన్‌గా పదోన్నతిని ఇచ్చారు.

మోమోస్ కేసులో ఆరుగురి అరెస్టు

- నిందితులంతా బిహార్‌కు చెందినవారే

బంజారాహిల్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మోమోస్ కేసులో బంజారాహిల్స్ పోలీసులు ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల 25న బంజారాహిల్స్ సింగాడికుంటలో జరిగిన సంతలో మోమోస్ తిన్నవారిలో సుమారు 50 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. చికిత్స పొందుతూ రేష్మా బేగం అనే గృహిణి మృతి చెందగా ఇప్పటికీ కొంతమంది కోలుకోలేదు. మృతురాలి సోదరుడు ఫారూఖ్ హుస్సేన్‌తో పాటు అస్వస్థతకు గురైన బాధితుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో చింతల్‌బస్తీలో తయారీ కేంద్రం నుంచి మోమోస్ సంతలకు సరఫరా అయినట్లు తేలింది. తయారీదారుడు అల్మాస్ అలియాస్ అర్మాన్, నందినగర్‌లో సాజిద్ హుస్సేన్, సింగాడికుంటలో అమ్మిన రయీజ్, తయారీ కేంద్రంలో పనిచేస్తున్న షారూఖ్, హనీఫ్, రజీక్‌లపై బీఎన్ఎస్ 105, 110, 274, 275, 125 (ఎ),రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితులంతా బిహారీలే!

3 నుంచి శుభ ముహూర్తాలు

- డిసెంబరు చివరి దాకా పెళ్లి సందళ్లే

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తాలు వచ్చేశాయి. 3వ తేదీ నుంచి డిసెంబరు చివరి వరకూ అంటే రెండు నెలల పాటు ముహూర్తాలున్నాయి. ఆ తర్వాత ధనుర్మాసం రాకతో ముహూర్తాలకు బ్రేక్ పడనుంది. అయితే వివాహ వేడుకల సీజన్ ఆరంభంతో నగరంలో ఒక్కసారిగా సందడి మొదలైంది. ఈ సీజన్‌లో నగరంలో దాదాపు 60-70 వేల వివాహాలు జరిగే అవకాశాలున్నాయని, నవంబరు 3, 14 తేదీల్లో ఎక్కువ పెళ్లిళ్లు ఉన్నాయని ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. గృహప్రవేశాలు, వివాహ ముహూర్తాలను చూసుకుంటే 3, 7, 14, 20, 22, 24 తేదీల్లో అధికంగా ఉన్నాయని చెబుతున్నారు పండితులు. మరికొన్ని ముహూర్తాలు కూడా ఉన్నాయి కానీ, వాటిని ద్వితీయ ప్రాధాన్యంగానే చూస్తామని చెప్పారు. డిసెంబరులో 4, 5, 7, 14, 19, 20, 22, 25 తేదీలను మంచి ముహూర్తాలుగా చెప్పవచ్చన్నారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలకు అనువైన కాలంగా వీటిని చెప్పవచ్చన్నారు. ఫంక్షన్ హాళ్ల యజమానులు కూడా ఈ రెండు నెలలూ తమ వేదికలకు బుకింగ్స్ ఇప్పటికే పూర్తయ్యాయని చెబుతున్నారు.

వామ్మో స్టిరాయిడ్స్!

పల్లెలు, బస్తీల్లో ఇష్టారాజ్యంగా ఇస్తున్న ఆర్ఎంపీలు.. కొంత మంది ఎంబీబీఎస్‌లదీ అదే దారి

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శరీరంలో వాపులను తగ్గించే స్టిరాయిడ్ ఔషధాల వాడకం రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వాటి అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యులు.. నొప్పులంటూ తమ వద్దకు వస్తున్న పేదసాదలకు తక్షణ ఉపశమనం కలిగించేందుకు అడ్డగోలుగా స్టిరాయిడ్ ఇంజెక్షన్లు చేసేస్తున్నారు. పట్టణాల్లోని బస్తీల్లో కూడా అదే పరిస్థితి! స్టిరాయిడ్ల విచ్చలవిడి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలిసిన కొందరు ఎంబీబీఎస్ వైద్యులు కూడా.. వాటిని సిఫారసు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రోగులు కూడా.. నొప్పుల నుంచి తక్షణ ఉపశమనం కావాలనుకోవడం ఈ జాడ్యాన్ని మరింత పెంచుతోంది. స్టిరాయిడ్లను ఇష్టం వచ్చినట్టుగా వాడేవారు తీవ్ర దుష్ప్రభావాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రమంతా వైరల్ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న సంగతి తెలిసిందే. చాలా మంది ఒకేసారి చికున్ గున్యా, డెంగీ బారిన పడ్డారు. ఒళ్లంతా నొప్పులు, ముఖ్యంగా కీళ్లనొప్పుల బారిన పడ్డవారి సంఖ్య అధికం. కొందరిలో ఆ నొప్పులు కొన్నివారాల వ్యవధిలో తగ్గితే మరోకొందరిలో నెలల తరబడి వాటి తీవ్రత కొనసాగుతూనే ఉంది. అలాంటివారిలో చాలామంది నొప్పుల బాధ భరించలేక స్టిరాయిడ్స్ వాడి కొత్త అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు.

ఏంటీ ఈ స్టెరాయిడ్స్...

మన శరీరంపై వైరస్‌లు, బ్యాక్టీరియా దాడి చేసినప్పుడు.. లేదా మనకు ఏదైనా దెబ్బ తగిలి గాయమైనప్పుడు.. మన రోగనిరోధక వ్యవస్థ స్పందించి ఇన్‌ఫ్లమేటరీ కణాలను, సైటోకైన్లను పంపిస్తుంది. ఆ కణాలు అక్కడికి చేరుకోగానే.. బ్యాక్టీరియా/వైరస్‌లను నిర్వీర్యం చేసే ప్రక్రియ చేపడతాయి. దీన్ని వైద్య పరిభాషలో 'ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్' అంటారు. ఈ ప్రక్రియలో నొప్పి, వాపు, ఆ ప్రాంతం ఎర్రగా కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ లక్షణాలు కనిపించాయంటే రోగనిరోధక వ్యవస్థ సరిగ్గా పనిచేస్తోందనడానికి నిదర్శనం. అలాగే.. కొన్ని సందర్భాల్లో మన రోగ నిరోధక వ్యవస్థ అదుపు తప్పి శరీరభాగాలపైనే దాడి చేసి ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతుంది. కీళ్లవాతం (రుమటాయిడ్ ఆర్థరైటిస్), సోరియాసిస్ (చర్మ వ్యాధి), లూపస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఇందుకు ఉదాహరణ. అలాంటి వ్యాధుల బారినపడ్డవారికి సాధారణ నొప్పి నివారణ మందుల వల్ల అంతగా ఉపశమనం కలగదు. అలాంటి సందర్భాల్లో వారికి వైద్యుల సిఫారసు ప్రకారం స్టిరాయిడ్ ఔషధాలను ఇస్తే.. అవి రోగనిరోధక వ్యవస్థ స్పందనను మందగింపజేసి (ఇమ్యూన్ సప్రెషన్) ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను తగ్గిస్తాయి. తద్వారా వాపు తగ్గి, రోగికి ఉపశమనం కలుగుతుంది. అంతటి శక్తిమంతమైన మందులను వైరల్ జ్వరాల వల్ల వచ్చే వాపులు, నొప్పులు తగ్గడానికి.. అది కూడా జ్వరం వచ్చిన వెంటనే ఎక్కువ మోతాదులో వాడడం తీవ్ర దుష్ప్రభావాలకు దారితీస్తోంది. నిపుణులైన, అర్హులైన, అనుభవజ్ఞులైన వైద్యులెవ్వరూ స్టిరాయిడ్స్‌ను తప్పనిసరి అయితే తప్ప సిఫారసు చేయరు.

శరీరంలోనే స్టిరాయిడ్ల ఉత్పత్తి!

స్టిరాయిడ్‌ల మాట వినగానే చాలామంది భయపడతారు! నిజానికి మనం ట్యాబ్లెట్లు/ఇంజెక్షన్లు/ఆయింట్‌మెంట్‌లు/ఇన్‌హేలర్లు/స్ప్రేల రూపంలో తీసుకునేవన్నీ సింథటిక్ స్టిరాయిడ్‌లు. మన శరీరంలోనే ఉత్పత్తి అయ్యే.. హార్మోన్లుగా మనం చెప్పుకొనే.. టెస్టోస్టిరాన్, ప్రొజెస్టిరోన్, కార్టిసాల్ వంటివన్నీ సహజ స్టిరాయిడ్‌లు. వీటిలో పురుష హార్మోన్ అయిన టెస్టోస్టిరాన్ కండరాల నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సహజ స్టిరాయిడ్లను వాటిని అడ్రినల్ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. కానీ.. మందుల రూపంలో స్టిరాయిడ్స్‌ను శరీరంలోకి పంపడం వల్ల కొంత కాలానికి అడ్రినల్ గ్రంథి పనితీరు దెబ్బతింటుంది.





పద్ధతిగా వాడాలి..

స్టిరాయిడ్ ఔషధాలను నిర్ణీత విధానం ప్రకారం వాడాల్సి ఉంటుంది. రోగి వయసు, ఎత్తు, బరువు ఆధారంగా వైద్యులు ఎంత మోతాదులో వాడాలో సిఫారసు చేస్తారు. కొంతకాలం పాటు ఆ డోసు వాడిన తర్వాత.. మళ్లీ వైద్యపరీక్షలు చేయించి, మోతాదు తగ్గిస్తారు. మరికొంతకాలం ఆ డోసు వాడాక ఇంకొంత తగ్గిస్తారు. ఇలా తగ్గించుకుంటూ వచ్చి చివరికి ఆపేసే విధానాన్ని 'టేపరింగ్' అంటారు. ఆ పద్ధతిలో కాకుండా.. నొప్పులు రాగానే వాడి, తగ్గగానే ఆపేయడం వల్ల శరీరంపై తీవ్ర ప్రభావం పడుతుంది. అలాగే.. కొన్ని చర్మ సంబంధిత సమస్యలకు వైద్యులు స్టిరాయిడ్లు రాస్తారు. రోగులు.. మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లకుండా అవే ఆయింట్‌మెంట్/క్రీములను దీర్ఘకాలంపాటు వాడేస్తారు. కానీ.. అందులోని స్టిరాయిడ్ చర్మం ద్వారా శరీరంలోకి వెళ్తుంది. దాన్ని ప్రాసెస్ చేయాల్సింది కాలేయమే. కాబట్టి పైపూతగా వాడే స్టిరాయిడ్‌ల వల్ల ప్రమాదం ఉంటుందనుకోకూడదు. వాటిని కూడా వైద్యులు చెప్పిన ప్రకారం ఎంత కాలం వాడాలో అంతకాలమే వాడి ఆపేయాలి. మళ్లీ సమస్య వస్తే మళ్లీ వైద్యులను సంప్రదించాలి తప్ప సొంతవైద్యం కూడదు.

దీర్ఘకాలం వాడితే..

స్టిరాయిడ్‌ల వాడకం వల్ల ఆకలి విపరీతంగా పెరుగుతుంది. దీంతో ఎక్కువగా తినేసి బరువు పెరుగుతారు. కోపం, చిరాకు, మూడ్ స్వింగ్స్ వంటివి కలుగుతాయి. ఎముకలు బలహీనపడతాయి. అందుకే వైద్యులు ఈ దుష్ప్రభావాలను తగ్గించే ఇతర ఔషధాలను కూడా సిఫారసు చేస్తారు. ఇక.. వైద్యుల పర్యవేక్షణ లేకుండా, ఇష్టం వచ్చిన డోసులో దీర్ఘకాలంపాటు స్టిరాయిడ్లు వాడితే అడ్రినల్ గ్రంథి పనితీరు దెబ్బతింటుంది. శరీరంలోని ఎముకలు గుల్లబారిపోతాయి. కంటి శుక్లాలు, మధుమేహం, చర్మం పల్చబారిపోవడం, అలర్జీలు, రక్తం గడ్డకట్టడం, హృద్రోగాల, మూత్రపిండ వ్యాధుల వంటి బారిన పడే ప్రమాదం ఉంటుందని.. గుండెపోటు ముప్పు అధికమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అనవసరంగా వాడితే తీవ్ర అనర్థాలు



స్టిరాయిడ్స్ అంటే.. ప్రాణాలను కాపాడే ఔషధాలు. కానీ వీటిని అవసరంగా వాడితే తీవ్రమైన అనర్థాలుంటాయి. నొప్పులకు సంబంధించి సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయకుండానే గ్రామీణ ప్రాంతాల్లో పెయిన్ కిల్లర్స్‌గా వీటిని విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇవి కేవలం నొప్పులను మాత్రమే తగ్గిస్తాయిగానీ.. జబ్బును కాదు. ఇష్టం వచ్చినట్టు వాడితే.. కాళ్లు, చేతులు సన్నబడి పొట్ట పెద్దగా అవుతుంది. అల్సర్స్ వస్తాయి. ఎముకలు బలహీనపడి ఆస్టియో పోరోసిస్‌కు దారి తీస్తుంది. కొన్నిసార్లు తుంటి కీలు మార్చాల్సిన దుస్థితి తలెత్తుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల.. క్షయ, ఫంగస్ వంటివాటి బారిన సులభంగా పడతారు. ఫ్లూ, న్యూమోనియా లాంటివి వస్తే త్వరగా తగ్గవు. గుండె, కిడ్నీ సమస్యలు పెరుగుతాయి.

- డాక్టర్ ఎంవీరావు, కన్సల్టెంట్ ఫిజిషియన్, యశోదా ఆస్పత్రి, హైదరాబాద్



ప్రత్యామ్నాయాలున్నాయి



నొప్పినివారణకు.. నేరుగా స్టిరాయిడ్ ఇంజక్షన్స్, ట్యాబ్లెట్ల వాడకం మంచిది కాదు. వాటికి చాలా ప్రత్యామ్నాయాలున్నాయి. ముఖ్యంగా యాంటీ ఇన్ఫ్లమేటరీ డైట్‌ను తీసుకోవాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల పళ్లతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. అల్లంతో పాటు పసుపు మంచి యాంటీ ఇన్ఫ్లమేటరీగా పనిజేస్తుంది. ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్ ఉండే విత్తనాలు, ఫిష్ ఆయిల్ వాడాలి. అలాగే ఆలివ్ ఆయిల్‌ను నొప్పిఉన్న ప్రాంతంలో వేసి మర్దన చేయాలి. ఫిజియోథెరపీ, ఆక్యుపంచర్, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ లాంటివి చేయించుకోవచ్చు. నొప్పులను తాత్కాలికంగా తగ్గించుకోవాలన్న ఆలోచన కంటే.. దీర్ఘకాలికమైనా సురక్షిత విధానాలను అనుసరించడం మంచిది.

- డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, క్రిటికల్‌కేర్ మెడిసిన్ స్పెషలిస్ట్, ఎండీ, శ్రీరక్ష హాస్పిటల్, ఖమ్మం

స్కిన్ వైటెనింగ్ స్టిరాయిడ్స్‌తో క్యాన్సర్ ముప్పు



చర్మ సంబంధిత సమస్యల్లో కొన్నింటికి తప్పకుండా స్టిరాయిడ్స్ వాడాల్సి ఉంటుంది. లేకుంటే రోగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కొన్ని సార్లు యాంటీబయాటిక్ రియాక్షన్స్ వచ్చినప్పుడు కూడా వీటిని వినియోగించాల్సి వస్తుంది. అలాగే స్టీవెన్‌జాన్సన్ సిండ్రోమ్‌కూ ఓరల్ స్టిరాయిడ్ వాడతాం. అయితే ముఖం తెల్లగా ఉండటం కోసం స్కిన్ వైటెనింగ్ స్టిరాయిడ్స్‌ను కొందరు వినియోగిస్తుంటారు. దానివల్ల వారంలో ముఖమంతా తెల్లబడుతుంది. కానీ, వాటిని ఎక్కువకాలం వాడితే చర్మ క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. అలాగే ముఖం కూడా మారిపోతుంది. ముఖ్యంగా.. చర్మవ్యాధులకు, చర్మానికి సంబంధించి వాడే స్టిరాయిడ్ల విషయంలో మరింత ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా, సిఫారసు, పర్యవేక్షణ లేకుండా వాడడం అనేక అనర్థాలకు దారి తీస్తుంది.

- డాక్టర్ రత్న కిషోర్, ఎండీ, ఎల్ఆర్మే స్కిన్‌గ్లో హాస్పిటల్, హైదరాబాద్

ఆ పోలీసుల గంజాయి దందా?

- రవాణా ముఠా నుంచి పెద్ద మొత్తంలో పట్టుకుని దారిమళ్లింపు
- ఇద్దరు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, ఏఆర్ పీసీ సస్పెండ్
- నిందితులిచ్చిన సమాచారంతోనే.. సంగారెడ్డి జిల్లాలో ఘటన

హైదరాబాద్, సంగారెడ్డి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠాలు పట్టుబడితే ఆ పోలీసులకు పండగే! పట్టుబడ్డ సరుకులోంచి కొంత దారి మళ్లించి సొమ్ము చేసుకుంటారు. కొన్ని నెలలుగా వారిది ఇదే పని! ఓ కేసులో పట్టుబడ్డ నిందితులను విచారించిన సమయంలో ఈ దందా బయటపడింది. సంగారెడ్డి జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. దీనికి సంబంధించి ఇద్దరు ఎస్సైలు, హెచ్‌సీ, పీసీ సస్పెండయ్యారు. జిల్లాలోని ఝరాసంగం పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న మల్లుగొండ, మల్లేశ్ నాయక్, లకాస్‌ను పట్టుకున్నారు. నిందితులను ప్రశ్నించగా తాము గతంలోనూ గంజాయి రవాణా చేసినట్లు అంగీకరించారు. విచారణలో భాగంగా గతంలో మానూరు పోలీస్ స్టేషన్‌లో పని చేసి ప్రస్తుతం పటాన్‌చెరువు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న అంబారియా, గతంలో సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసి ఇటీవల వీఆర్‌పై సంగారెడ్డికి బదిలీ అయిన వినయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మారుతి నాయక్, ఏఆర్ పీసీ మధుకు గంజాయి రవాణా చేసే ముఠాలతో సంబంధాలున్నట్లు తేలింది.. మే 31న ఎస్సై అంబారియా బృందం గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారంతో సనత్పూర్‌లో వాహనాన్ని అడ్డుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న వారి వాహనం నుంచి 120 కిలోల గంజాయి తీసుకుని నిందితులను వదిలేసినట్టు విచారణలో తేలింది. అంతేకాదు మరో కేసులో 400 ప్యాకెట్ల గంజాయి తీసుకుని ముఠాను వదిలేసినట్లు తేలింది. ప్రాథమిక చర్యల్లో భాగంగా ఇద్దరు ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. న్యాయనిపుణులతో సంప్రదింపుల అనంతరం వీరిపై ఎన్డీపీఎస్ యాక్ట్ నమోదు చేయనున్నామని వెల్లడించారు. అయితే వీరు గంజాయిని ఏం చేశారు? ఎవరికి.. ఎంతకు విక్రయించారు? అనే విషయాలను పోలీసులు తేల్చే పనిలో పడ్డారు.

కలకలం సృష్టించిన కానిస్టేబుల్ ఆత్మహత్య

దసరా రోజు కొత్తగూడెం జిల్లా బుర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన సాగర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం శాఖలో తీవ్ర కలకలం సృష్టించింది. సాగర్‌ను గంజాయి కేసులో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. బుర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి మాయం కావడం వెనక ఇద్దరు ఎస్సైల ప్రమేయం ఉందని సాగర్ సెల్ఫీ వీడియో తీశారు. ఈ విషయంలోనూ ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

నిర్వాసితులతో ఒకరోజు ఉండండి!

కేటీఆర్, హరీశ్, ఈటలకు ఆహ్వానిస్తూ వినూత్న నిరసన.. ఇళ్లలో మడత మంచాలు, కుర్చీలు.. బయట వారి ఫ్లెక్సీలు

చాదర్‌ఘాట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసిత కుటుంబీకులతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గురువారం వినూత్న నిరసన తెలిపారు. దీపావళి పండుగ రోజున మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మూసీ నిర్వాసిత కుటుంబీకులతో ఒకరోజు నివాసం ఉండాలంటూ మూసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహనన గర్ కాలనీ మూసీ పరీవాహక ప్రాంతమైన సాయిలు హట్స్‌లోని ఇళ్లలో మడత మంచాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ ఈటల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పూల దండలు, బొకేలతో స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశారు. మూసీనదిని ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటి నుంచి నిరుపేద కుటుంబాలపై కేటీఆర్, హరీశ్, ఈటల, ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నారంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ ఆరోపించారు. మూసీ నిర్వాసిత కుటుంబీకులు గౌరవంగా బతికేందుకు అవసరమైన డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తుంటే చూస్తూ ఓర్వలేకే కేటీఆర్, హరీశ్ ఈటల.. తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మొదలుపెట్టారని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ చేపట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ఇదే తరహాలో అడ్డుకునే ప్రయత్నం చేసిందా? అని వారిని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, మూసీ పునరుజ్జీవనం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును చేపడుతుంటే అందుకు సహకరించాల్సింది పోయి డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమైన మూసీ గర్భంలో ఉన్న నిరుపేద కుటుంబీకులను ఎందుకు అడ్డుకుంటున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.



ఇళ్లలో ఏర్పాటు చేసిన మడత మంచాన్ని చూపిస్తున్న టీపీసీసీ నేత శ్రీనివాస్

స్వచ్ఛందంగా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం

అయ్యా సారూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తాము మూసీ గర్భంలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించే డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పలువురు మహిళలు స్పష్టం చేశారు. ఇందులో ఏ ఒక్క రాజకీయ నాయకుని నుంచి గానీ, ఏ ఒక్క అధికారి నుంచి గానీ ఒత్తిడి లేదన్నారు. కాగా మూసారాంబాగ్ శాలివాహన నగర్ కాలనీలో గల సాయిలు హట్స్‌లో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ చిత్రపటానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్‌తో కలిసి మూసీ నిర్వాసిత కుటుంబీకులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు.

ఈ నెల చలి తక్కువే!

- ఎక్కువ ఉష్ణోగ్రతలు కొనసాగొచ్చు.. భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత శతాబ్దానికి పైగా కాలంలో ఈ ఏడాది అక్టోబరులో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 1901 నుంచి అక్టోబరు నెలలో నమోదైన గరిష్ఠ, కనిష్ఠ సగటు ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఈ ఏడాది 1.23 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. నవంబరులో కూడా కూడా ఇదే విధంగా ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని, రానున్న శీతాకాల ప్రారంభ సూచిక ఇచ్చే అవకాశం లేదని, చలి తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ విభాగం శుక్రవారం వెల్లడించింది. వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ బలహీనపడడం, మధ్య పసిఫిక్ మహాసముద్రంలో లానినా ఏర్పడకపోవడం, బంగాళాఖాతంలో వరుసగా ఒక వాయుగుండం, ఒక తీవ్ర తుఫాన్ ఏర్పడడంతో సముద్రం మీదుగా భూమిపైకి రావాల్సిన గాలులు నిలిచిపోయాయి. వీటన్నింటి ప్రభావంతో అక్టోబరులో అనేక ప్రాంతాల్లో వేసవి మాదిరి వాతావరణం నెలకొందని తెలిపింది. రానున్న రెండు వారాల పాటు వాయవ్య మైదాన ప్రాంతాల్లో 2-5 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని, ఆ తర్వాత క్రమంగా తగ్గుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. దీని వలన నవంబరును శీతాకాలం నెలగా పరిగణించడం లేదని చెప్పారు. ప్రపంచంలోని అన్ని వాతావరణ సంస్థల అంచనాలకు భిన్నంగా పసిఫిక్‌లో ఇంకా లానినా ఏర్పడలేదు. అందువల్ల ఈ నెలలో దేశంలో చలి ప్రభావం అంతంతమాత్రంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి లానినా ఏర్పడే అవకాశం ఉంది. దాంతో డిసెంబరు, జనవరి నెలల్లో చలి గాలుల ప్రభావం ఉంటుందని చెబుతున్నారు.

ఈనెల దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువ వర్షపాతం

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నవంబరులో దేశంలో ప్రధానంగా ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపించే దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుంది. ఏపీ విషయానికి వస్తే దక్షిణ కోస్తా, రాయలసీమలకు ఈశాన్య రుతుపవనాలు అత్యంత కీలకం. అందువల్ల ఈ నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఝార్ఖండ్‌లో కాంగ్రెస్‌దే గెలుపు

- ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇక్కడే ఉంటా
- ఝార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జ్ భట్టి విక్రమార్క



రాంచీలో సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఝార్ఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జ్‌లు నియోజకవర్గాలను వదిలి వెళ్లొద్దని చెప్పారు. రాంచీలో శుక్రవారం కాంగ్రెస్ ఝార్ఖండ్ సీనియర్ నేతలు, పీసీసీ నాయకులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడారు. ఝార్ఖండ్ ఎన్నికల్లో సీనియర్ పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే రామ్‌గఢ్, బొకోరో అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలు తీసుకున్నానని చెప్పారు. కాంగ్రెస్ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నాయని.. రామ్‌గఢ్, బొకోరో స్థానాల్లో పక్కాగా గెలిచి తీరతామని అన్నారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తాను ఝార్ఖండ్‌లోనే ఉంటానని, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పెద్దలు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని తెలిపారు. కాగా, ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై శుక్రవారం సాయంత్రం రాంచీలో నేతలు కసరత్తు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ భట్టి విక్రమార్క, ఝార్ఖండ్ పీసీసీ అధ్యక్షుడు కేశవ్ మహతో, పార్టీ సీనియర్ నేతలు మ్యానిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలను పరిశీలించారు.

ఇంటింటికి స్టిక్కర్!



(మొదటిపేజీ తరువాయి)

వెళ్లి అసలు గ్రామంలో, వార్డులో ఎన్ని ఇళ్లు ఉన్నాయనే వివరాలను సేకరిస్తారు. వెంటనే ఆ ఇంటికి కులగణనకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే ఒక స్టిక్కర్‌ను అంటిస్తారు. ఇంటిపై స్టిక్కర్ ఉందంటే కులగణన ఫారమ్‌లో వివరాలు నమోదు చేయాలని అర్థం. ఒక్కో ఎన్యుమరేటర్ 150 నుంచి 175ఇళ్లలో సర్వే చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఒక వేళ ఒక బ్లాక్‌లో 175కంటే ఎక్కువ ఇళ్లు ఉంటే.. అదనంగా మరో ఎన్యుమరేటర్‌ను కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒక ప్రశ్నావళి ఫామ్‌ను నింపేందుకు సగటున 30-40నిమిషాలు పడుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. కులగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ఎప్పుడు ఏ గ్రామం లేదా వార్డుకు వస్తారనే వివరాలను ముందుగానే సామాజిక మాధ్యమాలు, డప్పు చాటింపుల ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. కాగా, కులగణనలో 50వేలకుపైగా ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లను ఈ కార్యక్రమానికి ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం పాఠశాలలను కొనసాగిస్తూ, మధ్యాహ్నం తర్వాత కులగణనలో ఉపాధ్యాయులు పాల్గొనే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కుల గణన బాధ్యతల నుంచి మినహాయించారు. ఈ మేరకు కుల గణనలో పాల్గొనే ఉపాధ్యాయుల బాధ్యతలకు సంబంధించి శుక్రవారం పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ప్రత్యేక సర్క్యులర్‌ను జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 36,559 మంది ఎస్జీటీలు, 3,414 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మరో 6,256 మంది ఎంఆర్సీ సిబ్బంది, 2 వేల మంది ప్రభుత్వ, ఎంపీపీ, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, మరో రెండు వేల మంది మినిస్టీరియల్ సిబ్బంది కలిపి మొత్తం 50,229 మంది కుల గణన బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కులగణన జరిగే రోజుల్లో ప్రాథమిక పాఠశాలలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే నిర్వహించనున్నారు. మధ్యాహ్న భోజనాన్ని అందించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. ఆ తర్వాత ఎంపిక చేసిన ఉపాధ్యాయులు కుల గణనలో పాల్గొనాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలలు మాత్రం షెడ్యూల్ ప్రకారమే పని చేస్తాయి. కాగా, కులగణనకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులు సెలవు రోజుల్లో ప్రణాళిక విభాగం అధికారుల సూచన ప్రకారం ఎన్యుమరేషన్ విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. కులగణనలో పాల్గొనే ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.10వేలు, ఒక్కో సూపర్‌వైజర్‌కు రూ.12వేలు చొప్పున అందించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనుందని అధికార వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

‘ప్రత్యేక కమిషన్’పై సర్కారు అభ్యంతరం!

- హైకోర్టులో కౌంటర్ దాఖలుకు నిర్ణయం
- కులగణనకు ప్రత్యేక కమిషన్ ఉండాలంటూ కృష్ణయ్య పిటిషన్.. పరిశీలించాలన్న హైకోర్టు
- అడ్వకేట్ జనరల్‌తో చర్చిస్తున్న అధికార వర్గాలు

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన, రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియను ప్రత్యేక కమిషన్ ద్వారా చేపట్టే అంశాన్ని పరిశీలించాలన్న హైకోర్టు తీర్పుపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఈ నెల 21లోపు తెలియజేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో కౌంటర్ ఎలా దాఖలు చేయాలన్న అంశంపై అడ్వకేట్ జనరల్‌తో ప్రభుత్వ వర్గాలు.. చర్చిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలంటే కులగణన చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే బీసీ కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం.. కులగణనకు కూడా ఇదే కమిషన్ డెడికేటెడ్ కమిషన్‌గా ఉంటుందని జీవో 199లో పేర్కొంది. అయితే, ఈ అంశంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హైకోర్టులో పిటిషన్ వేశారు. కులగణనకు డెడికేటెడ్ కమిషన్‌గా బీసీ కమిషన్‌నే గుర్తించడం సమంజసం కాదని, సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు పరిచేందుకు కొత్త డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించాలని హైకోర్టు పేర్కొనగా.. దీనిపై తన వాదనను వినిపించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

జిల్లాకో మోడల్ మార్కెట్: తుమ్మల



హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఓ మోడల్ మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కో-ఆపరేటివ్, మార్కెటింగ్ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించిన మంత్రి పలు అంశాలపై చర్చించారు. మార్కెట్ల ఆధీనంలోని గోదాములు, ఖాళీ స్థలాలు వాణిజ్య అవసరాలకు ఉపయోగపడేలా చేసి ఆదాయాన్ని పెంచాలని సూచించారు. ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధి, నూతన శాఖల ఏర్పాటు అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్కెట్లు, జిన్నింగ్ మిల్లులకు వచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో పంట కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని తుమ్మల కోరారు. ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.19,144 చేయడంతో రైతుల తరఫున ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాష, జీఎం సుధాకర్‌రెడ్డి మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో శుక్రవారం భేటీ అయిన తుమ్మల.. సీతారామ ప్రాజెక్టులోని సత్తుపల్లి ట్రంకు పనులు త్వరగా చేపట్టాలని కోరారు.



నాగార్జునసాగర్ బుద్ధవనంలో వ్యూపాయింట్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి తదితరులు

నాగార్జున సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్: జూపల్లి

నాగార్జునసాగర్, హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందులో భాగంగా సాగర్ బ్యాక్ వాటర్‌లో వాటర్ స్పోర్ట్స్ అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అలాగే, నాగార్జున సాగర్, బుద్ధవనంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో స్టార్ హోటళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. ఈ మేరకు శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు కమలేష్ డి పటేల్(దాజీ)తో కలిసి శుక్రవారం ఉదయం ఆయన బుద్ధవనాన్ని సందర్శించారు. విజయవిహార్‌లోని బుద్ధవనంతో పాటు, విజయ విహార్ లే అవుట్లను పరిశీలించారు. వివిధ దేశాల నుంచి బుద్ధవనానికి వచ్చే బౌద్ధులు, పర్యాటకుల కోసం సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. సాగర్ పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి జూపల్లి.. సాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు..

సాగర్, సోమశిల నుంచి శ్రీశైలానికి లాంచీలు

- నేటి నుంచి పర్యాటక శాఖ సేవలు

హైదరాబాద్, నాగార్జునసాగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఒడిలో విహరిస్తూ నల్లమల్ల అందాలను వీక్షిస్తూ శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోవాలనే వారి కోసం తెలంగాణ పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. నాగార్జున సాగర్, సోమశిల డ్యామ్ నుంచి శ్రీశైలం వెళ్లే పర్యాటకుల కోసం వేర్వేరుగా లాంచీ(క్రూయిజ్) సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఈ లాంచీ సేవలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ టూర్ల ప్యాకేజీకి సంబంధించిన వివరాలు, బుకింగ్ కోసం పర్యాటకులు https://tourism.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. సోమశిల- శ్రీశైలం, నాగార్జునసాగర్- శ్రీశైలం మార్గాల్లో ఓవైపు ప్రయాణానికి పెద్దలకు రూ.2000, చిన్నారులకు రూ.1600గా టికెట్ ధరలు నిర్ణయించారు. అలాగే, రానుపోను(రౌండ్ ట్రిప్) ప్రయాణానికి పెద్దలకు రూ.3000, పిల్లలకు రూ.2400 టికెట్ ధరలను నిర్ణయించారు. ఈ ప్యాకేజీలో భాగంగా ప్రయాణికులకు లాంచీల్లో టీ, స్నాక్స్ అందిస్తారు.

రైతుల ఆదాయం పెంచేలా ఉపాధి పనులు

- రూ.1,372 కోట్లతో ప్రణాళిక: మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రైతుల ఆదాయం పెంచేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం కల్పిస్తూ.. శాశ్వతంగా నిలిచేలా ఉపాధి హామీ పనులు చేపట్టనున్నామన్నారు. ఇందుకుగాను రూ.1,372 కోట్లతో వివిధ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మహిళాశక్తి - ఉపాధి భరోసా పేరిట మహిళల స్వయం ఉపాధి కోసం ఉపాధి హామీ నిధులతో 5,400 పశువుల కొట్టాలు, 10,300 అజోలపిట్ల(పచ్చిరొట్ట)ఎరువుల తయారీషెడ్లు, 5,400 వర్మికంపోస్ట్ తొట్ల నిర్మాణం చేపడతామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు మండలానికి ఒకటి చొప్పున మదర్‌యూనిట్ పేరిట 540 కోళ్లషెడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఫల వనాల పేరిట 2,700 ఎకరాల్లో చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకం ద్వారా ఆదాయం పొందేలా ప్రోత్సహిస్తామన్నారు.

అనుమతి లేకుండా ‘కృష్ణా’పై ప్రాజెక్టులు వద్దు

- తెలంగాణకు కృష్ణా యాజమాన్య బోర్డు లేఖ

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఏ ప్రాజెక్టు చేపట్టాలన్నా అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, కౌన్సిల్ ఆమోదం లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి వీల్లేదని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు బోర్డు లేఖ రాసింది. అనుమతి లేకుండా చేపడుతున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను సమర్పించాలని కోరింది. అనుమతి లేకుండా ఈ లిఫ్టును చేపడుతున్నారని, తక్షణమే పనులను నిలిపివేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోర్డుకు ఫిర్యాదు చేసింది.

5 నెలల కాలానికి టారిఫ్ సబ్సిడీ 4,791 కోట్లు

వివిధ వర్గాలకు ఉచితంగా, రాయితీతో విద్యుత్‌ను అందిస్తున్నందుకుగాను విద్యుత్ సంస్థలకు ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న ఐదునెలల కాలానికిగాను టారిఫ్ సబ్సిడీగా రూ.4,791.65 కోట్లను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు నవంబరు మాసానికిగాను రూ.958.33 కోట్లను విడుదల చేస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం జీవో జారీ చేశారు.

తల్లుల బంగారం: లెక్క చెప్పండి సారూ!

మేడారం మహాజాతరకు ఇన్నాళ్లుగా వచ్చిన పసిడి ఎంత?.. భక్తులు సమర్పించే నగదులో మాత్రమే పూజారులకు వాటా

- బంగారం, వెండి కానుకలన్నీ నేరుగా బ్యాంకు లాకర్‌లోకే!
- 1968 నుంచి 10కిలోల పుత్తడి వచ్చిందంటున్న అధికారులు
- ఆ లెక్కపై పూజారుల సందేహం.. గత 4 జాతరల్లోనే 3.2 కిలోల బంగారం, 200 కిలోల వెండి వచ్చినట్టు వెల్లడి



మేడారం గద్దెల వద్ద జనం(ఫైల్)

వరంగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తిరుమలలో వెంకన్న, బెజవాడ దుర్గమ్మకు, యాదగిరీశుడికి, బాసరలో సరస్వతీ అమ్మవారికి.. ఇలా ప్రధాన ఆలయాల్లో కొలువై ఉన్న దేవుళ్లకు భక్తులు ఏటా సమర్పించుకుంటున్న బంగారం ఎంత? ఆభరణాలెన్ని వస్తున్నాయో?.. ఇలా అన్నింటికీ ఒక లెక్క ఉంటుంది! మరి.. మేడారం మహజాతరకు భారీగా తరలివచ్చే భక్తులు సమర్పించే బంగారం, వెండి కానుకలు ఎన్ని? 1968 నుంచి.. జాతరకు వచ్చే ఆదాయ, వ్యయాల లెక్కలే చూపిస్తున్న అధికారులు బంగారం, వెండి కానుకల వివరాలను ఎందుకు వెల్లడించట్లేదు? ఈ 56 ఏళ్లుగా బ్యాంకుల్లో జమ చేసిన బంగారం ఎంత? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పట్లేదని గిరిజన పూజారులు వాపోతున్నారు. ఆ వివరాలను వెల్లడించడంతోపాటు.. వాటిలోనూ తమకు వాటా ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్లకొకసారి జరిగే మేడారం మహజాతరలో.. భక్తులు బెల్లాన్నే బంగారంగా సమర్పిస్తారు. అయితే.. కొందరు భక్తులు మాత్రం నిజంగానే వెండి, బంగారాలను తల్లులకు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. జాతర తరువాత డబ్బు లెక్కలను వెల్లడించి.. వచ్చే ఆదాయంలో పూజారులకు 33 శాతం వాటా ఇస్తున్న దేవాదాయ శాఖ అధికారులు బంగారాన్ని బ్యాంకులో జమ చేస్తున్నారు. ఆ వివరాలనే ఇప్పుడు గిరిజన పూజారులు అడుగుతున్నారు. ఆ వెండి, బంగారాల్లో ఎవరి వాటా ఎంతనేది స్పష్టత లేదు.

పూజారుల్లో అనుమానాలు

1968 నుంచి మేడారం జాతర దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నా అప్పట్లో బంగారం, వెండి కానుకలు చాలా తక్కువగా వచ్చేవి. 1996లో ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి, ప్రత్యేకంగా నిధులిచ్చి, ఆర్టీసీ బస్సులను కేటాయించటంతో భక్తుల సంఖ్య కోటి దాటింది. 1968 నుంచి.. అంటే ఈ 56 ఏళ్లలో భక్తులు వనదేవతలు మొక్కుగా చెల్లించుకున్న బంగారం దాదాపు 10 కిలోలు, వెండి సుమారుగా 587 కిలోలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, ఆ లెక్కలపై గిరిజన పూజారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 2018 జాతర నుంచి పరిశీలిస్తే.. ఆ ఏడాది భక్తులు తల్లులకు 824 గ్రాముల బంగారం, 47 కిలోల వెండిని మొక్కులుగా చెల్లించారు. 2020లో 1,064 గ్రాముల బంగారం, 55 కిలోల వెండి.. 2022లో 631గ్రాముల బంగారం, 48 కిలోల వెండి, 2024లో 779 గ్రాముల బంగారం, 55 కిలోల వెండి వనదేవతలకు కానుకల రూపంలో వచ్చాయి. నాలుగు జాతరలకే 3,298 గ్రాముల బంగారం, 203 కిలోల వెండి తల్లులకు వస్తే.. 1968 నుంచి ఇప్పటిదాకా జరిగిన 28 జాతరల్లో వచ్చింది 10 కిలోల బంగారమేనా? అన్నది గిరిజన పూజారులు, కొందరు భక్తుల ప్రశ్న. తల్లుల బంగారానికి సంబంధించిన వాస్తవ వివరాలు వెల్లడించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

1994లో 10 కిలోల వెండి విక్రయం!



దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటి వరకూ ఎప్పుడూ బంగారం, వెండి కానుకల వివరాలు తెలుపలేదు. 1994 మహా జాతర సమయంలో జాతర నిర్వహణ కోసం 10 కిలోల వెండిని అమ్మినట్లు మాత్రం నాకు కొంత సమాచారం ఉంది. బ్యాంకులో ఎంత బంగారం ఉందో తెలియదు. పూర్తి వివరాలను తెలిపి,పూజారుల వాటా చెల్లించాలి.

-సిద్దబోయిన జగ్గారావు,
మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు

వెండి, బంగారాల్లో వాటా ఇవ్వలే!



యాభై ఆరు సంవత్సరాలుగా డబ్బు రూపేణా వచ్చిన కానుకలను మాత్రమే తీసుకుంటున్నాం. నాకుగానీ, మా పూర్వీకులకుగానీ ఎప్పుడూ వెండి, బంగారు కానుకల్లో వాటా ఇవ్వలేదు. తల్లులకు సంబంధించిన బంగారం, వెండి బ్యాంకులో ఎంత ఉన్నాయో తెలియదు. ఆ వివరాలు వెంటనే వెల్లడించి పూజారులకు వాటా ఇవ్వాలి.

- కాక సారయ్య,
ప్రధాన పూజారి, ప్రధాన వాటాదారు

బ్యాంకు లాకర్‌లో భద్రం



మేడారం వనదేవతలకు భక్తులు సమర్పించిన బంగారం, వెండి మొత్తం బ్యాంక్ లాకర్‌లో భద్రపరించాం. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతానికి 10 కిలోల మిక్స్‌డ్ బంగారం, 587 కిలోల మిక్స్‌డ్ వెండి ఉంది. పైఅధికారులకు నివేదికలు పంపాం. అనుమతులు రాగానే ప్యూరిఫై చేసి వివరాలు వెల్లడిస్తాం. ఆ బంగారం మొత్తాన్ని నగదీకరించి.. వచ్చే ఆదాయాన్ని మేడారం అభివృద్ధికి ఉపయోగించుకునేలా ప్రతిపాదనలు, నివేదికలు రూపొందించాం. పూజారులకు త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తాం.

రాజేంద్రం, మేడారం మహజాతర, ఈవో



తేల్చేద్దాం.. కారు కథ

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆదేశిస్తేనే విదేశీ సంస్థలకు నిధులు విడుదల చేశామని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. అయితే, నాటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఎక్కడా నోట్ ఫైల్ గానీ, ఆదేశాలిస్తూ పత్రాలు కానీ జారీ చేయలేదు. ఇప్పుడు విచారణ సంస్థకు ఏం చెప్పాలో తెలియని పరిస్థితి అధికారులది. వారు ఏసీబీకి ఏం చెప్పనున్నారు..? ఎలాంటి ఆధారాలు సమర్పించనున్నారు..? వాటి ఆధారంగా గత సర్కారులోని కీలక ప్రజాప్రతినిధుల వరకు ఏసీబీ ఎలా చేరుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

అసలేం జరిగిందంటే

2023లో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహించారు. సచివాలయం ఎదురుగా ట్యాంక్‌బండ్ చుట్టూ ప్రత్యేకంగా సుమారు మూడు కిలోమీటర్ల ట్రాక్ నిర్మించారు. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. దీంతో 2024 ఫిబ్రవరి 10న రెండోసారి రేస్ నిర్వహించేందుకు 2023 అక్టోబరులోనే విదేశీ సంస్థలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విదేశీ సంస్థలకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) రూ.55 కోట్లు చెల్లించింది. అయితే, ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వం మారిన వెంటనే విదేశీ సంస్థలు తాము ఫార్ములా ఈ ఆపరేషన్ నిర్వహించడం లేదని ప్రకటించాయి. ఒప్పందంలో ప్రస్తావించిన అంశాలు పాటించకపోవడమే కారణంగా పేర్కొన్నాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్ములా ఈ రేస్ నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. ఆర్థిక శాఖ, ఇతర విభాగాల నుంచి ముందస్తు అనుమతులు లేకుండానే విదేశీ సంస్థలకు రూ.55 కోట్లు చెల్లించినట్లుగా తేల్చింది.

డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ప్రభుత్వం

- కొత్త చార్జీలు పది రోజుల్లో అమల్లోకి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- 7.65లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

హైదరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల హాస్టళ్ల పరిధిలోని విద్యార్థులందరికీ ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచింది. పెంచిన చార్జీలను పది రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అదే విధంగా విద్యార్థులకు పోషకాహారం అందేలా డైట్‌లో మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. పెంచిన చార్జీలతో రాష్ట్రంలో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఈ సందర్భంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సంక్షేమ విభాగాల సెక్రటరీలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చార్జీల పెంపు విషయంలో కమిటీ ప్రతిపాదనను యథాతథంగా అమలు చేయడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా దీపావళి (31-10-2024) రోజు రాష్ట్ర ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచుతూ జీవో ఎం.ఎస్ నెంబర్ 9ని విడుదల చేసింది. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులందరికీ ఇదే అసలైన దీపావళి పండుగ అని మంత్రి సీతక్క తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. చార్జీలు పెరగడంతో ఇకపై హాస్టళ్ల విద్యార్థులు ఆర్థాకలితో అవస్థలు పడే అవసరంలేదన్నారు. పెంచిన ఈ చార్జీలను గ్రీన్ చానల్ ద్వారా చెల్లిస్తామన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్.. ఎస్సీ గురుకుల విద్యార్థుల హర్షం

అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మొటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని పలు ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు "థ్యాంక్యూ సీఎం సార్" అనే ప్లకార్డులు పట్టుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

26 మంది రాష్ట్ర పోలీసులకు కేంద్ర పతకాలు

విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా(అక్టోబరు 31) ప్రకటించే కేంద్ర హోం మంత్రి దక్షత పతక్ అవార్డుకు రాష్ట్రం నుంచి 26 మంది పోలీసులు ఎంపికయ్యారు. కేంద్ర, రాష్ట్ర భద్రతా విభాగాల సంబంధించి ఈ సంవత్సరం మొత్తం 463 మంది సిబ్బంది అవార్డులకు ఎంపికైనట్టు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. తెలంగాణ నుంచి స్పెషల్ ఆపరేషన్ ఫీల్డ్ విభాగంలో ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆర్.భాస్కర్‌తో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సై ఇతర సిబ్బంది ఉన్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఐపీఎస్ డా.సంగ్రామ్ సింగ్ పాటిల్, ఏసీపీ శ్రీధర్ రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ దీపు, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

విలువల కొలువుగా బాపూఘాట్

- మహాత్ముని సిద్ధాంతాలు, నైతికతపై బోధన..
- ప్రపంచంలో ఎత్తయిన గాంధీ విగ్రహం ఏర్పాటు
- మూసీ, ఈసీ సంగమంలో సరోవరం నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- విస్తృతంగా చర్చలు



హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూసీ తీరంలోని బాపూఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్ది ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును చేస్తోంది. ఇందుకు సంబంధించిన నమూనాలపై అధికారులు చర్చలను ప్రారంభించారు. బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అక్కడ కల్పించాల్సిన ఇతర ఆకర్షణలపైనా సమాలోచనలు జరుగుతున్నాయి. ఈసీ, మూసీ నదుల సంగం ప్రాంతంలో బాపూఘాట్ ఉండడంతో అక్కడ బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మించాలని నిర్ణయించారు. దానికి గాంధీ సరోవర్ అన్న పేరు పెట్టనున్నారు. గాంధీ భావజాల కేంద్రం(గాంధీ ఐడియాలజీ సెంటర్)ను ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. గాంధీ బోధనలు, ఆయన ఆచరణ, ఆశయాలను ప్రతిబింబించేలా ఐడియాలజీ సెంటర్‌తో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్, నైతిక విలువల కోర్సులు నిర్వహించే ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీ ఆశ్రమం కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాపూఘాట్‌లో ఏర్పాటు చేసే మహాత్మాగాంధీ విగ్రహం ఎలా ఉండాలనేదానిపై ఆయా రంగాల నిపుణుల నుంచి అధికారులు సూచనలను స్వీకరించనున్నారు. దేశ విదేశాల్లో ఉన్న గాంధీ విగ్రహాలు, ఆశ్రమాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారు. 2013లో పాట్నాలోని గాంధీ మైదాన్‌లో ఉన్న విగ్రహమే ప్రస్తుతం దేశంలో అత్యంత ఎత్తయినది. కాంస్యంతో తయారు చేసిన దీని ఎత్తు 72 అడుగులు. ఇద్దరు చిన్నారులతో గాంధీ అప్యాయంగా ఉన్నట్లుగా ఈ విగ్రహం ఉంటుంది. అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న ఇర్వింగ్ మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద దండియాత్రకు నడుస్తున్న భంగిమలో 8 అడుగుల కాంస్య విగ్రహముంది. 2018లో గుజరాత్‌లోని నర్మదా నదీ తీరం వద్ద ఐక్యతా చిహ్నంగా 182 మీటర్ల ఎత్తులో సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే విగ్రహం అంతకంటే ఎత్తు ఉండాలా? పాట్నాలో ఉన్న విగ్రహానికి మించిన ఎత్తులో దీనిని నిర్మించాలా? ఏ భంగిమలో ఉన్నట్టు తయారు చేయించాలి? అన్నదానిపై విస్తృత స్థాయిలో చర్చలు జరపాలని భావిస్తోంది. అసెంబ్లీ ఎదుట ఉన్న మహాత్మగాంధీ కాంస్య విగ్రహమే ఇప్పటి వరకు తెలంగాణలో పెద్దది. ధ్యాన ముద్రలో ఉన్న ఈ గాంధీ విగ్రహం ఎత్తు 22 అడుగులు ఉంది. నా జీవితమే నా సందేశం (మై లైఫ్ ఈజ్ మై మెసేజ్) అన్న స్ఫూర్తితో దీన్ని తయారు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1999లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో బాపూఘాట్‌లో ఏర్పాటు చేయబోయే గాంధీ విగ్రహంపై ఆసక్తి నెలకొంది.

గవర్నర్ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గవర్నర్ ప్రతిభా పురస్కారాల(2024)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రతి విభాగంలో రెండు కేటగిరీల్లో అవార్డులు ఉంటాయి. ఒకటి వ్యక్తిగతంగా విజయం సాధించిన వారి కోసం, రెండో కేటగిరీలో ఆయా విభాగాల్లో కృషి చేసిన సంస్థలు, సొసైటీలు, ట్రస్ట్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన వివరించారు. ప్రతి అవార్డుకు రూ.2లక్షల ప్రోత్సాహకం, ప్రశంసా పత్రం అందజేస్తామని చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నవంబరు 23 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందేలా పంపించాలన్నారు. జనవరి 26న రాజ్‌భవన్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందజేస్తారన్నారు. వివరాలకు https://governor.telangana.gov.inను సందర్శించాలని కోరారు.

గిరిజన వర్సిటీకి 211 ఎకరాల కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి మరో ముందడుగు పడింది. ఇటీవలే యూనివర్సిటీ పేరును ఖరారు చేసిన ప్రభుత్వం... తాజాగా అవసరమైన భూమిని కేటాయించింది. వర్సిటీ కోసం 211 ఎకరాల 26.5గుంటల భూమిని కేటాయిస్తూ శుక్రవారం రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం... తెలంగాణలోని ములుగు (కొత్త జిల్లా)లో గిరిజన ఏర్పాటు చేయాలని గతంలోనే కేంద్రం నిర్ణయించింది. గిరిజన వర్సిటీకి సమ్మక్క, సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం అని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసింది. వర్సిటీ కోసం ములుగులోని సర్వే నంబర్ 837/1లో గల 211 ఎకరాల 26.5 గుంటల భూమిని గుర్తించినట్లు ఆ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. ఇక్కడ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఎకరా ధర రూ.3,37,500 వరకూ ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో రూ.5లక్షల దాకా పలుకుతోందని వివరించారు. ఈ వివరాలను సీసీఎల్ఏ తెలంగాణ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీకి పంపించగా.. గిరిజన యూనివర్సిటీకి భూమిని కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాంతో సమ్మక్క, సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి 211 ఎకరాల 26.5 గుంటల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూకేటాయింపు కొలిక్కి రావడంతో గిరిజన వర్సిటీ ఏర్పాటు చర్యలు ఊపందుకుంటాయని యంత్రాంగం భావిస్తోంది.

కేసీఆర్‌పై చర్యలు?

(మొదటిపేజీ తరువాయి)

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న కారణంగా ప్రజలపై ఏ మేరకు భారం పడనుంది? కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల కలిగిన నష్టమేంటి? నామినేషన్ ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లను బీహెచ్ఈఎల్‌కు అప్పగించడం వల్ల జరిగిన నష్టాలేంటి? తదితర అంశాలపై విచారణకు ప్రభుత్వం మార్చి 14న జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సూచనల మేరకు విచారణ ప్రారంభించిన కమిషన్.. బహిరంగ ప్రకటన ఇచ్చి ప్రజాభిప్రాయాలు స్వీకరించింది. అఫిడవిట్ల రూపంలో వివరాలు అందించిన వారిని క్రాస్ ఎగ్జామినేషన్ కూడా చేసింది. ఈ క్రమంలో తెలంగాణ విద్యుత్ రంగ నిపుణుడు కంచర్ల రఘు, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ వేణుగోపాల్, తిమ్మారెడ్డి ఆయా అంశాల్లో కేసీఆర్ చేసిన తప్పిదాలను కమిషన్‌కు నివేదించారు. వాటిని పరిగణనలోకి తీసుకున్న కమిషన్ లాభదాయం కానీ ఆయా ప్రాజెక్టుల అంశంలో తీసుకున్న నిర్ణయాలకు మాజీ సీఎం కేసీఆర్ బాధ్యులని తన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. సదరు నివేదికను ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. మంత్రివర్గంలో చర్చించిన తర్వాతే నివేదికలోని అంశాలు బయటికొచ్చే అవకాశముంది.

20 ఏళ్లలో తొలిసారి

విద్యుత్ రంగంపై అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు విసిరిన సవాలును స్వీకరించిన ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి నేతృత్వంలోని మొదలైన కమిషన్ విచారణ కీలక దశలో ఉన్నప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో ఆయన కమిషన్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత జూలై 29న జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ బాధ్యతలు స్వీకరించి మూడు నెలల్లోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అవినీతి అక్రమాలపై ఏర్పాటైన కమిషన్ ప్రభుత్వానికి సకాలంలో నివేదిక సమర్పించడం పదేళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పదేళ్ల తెలంగాణ చరిత్రలో మొత్తంగా 20 ఏళ్లలో ఇదే తొలిసారి. ఇక, కాళేశ్వరంపై వేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ కూడా నాలుగైదు నెలల్లోపే ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశాలున్నాయి.

కేవీబీ ఆదాయం రూ.1.76 లక్షల కోట్లు

చెన్నై: ప్రైవేట్ రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ ఆదాయం సెప్టెంబరు 30తో ముగిసిన ఆరు నెలల కాలంలో రూ.1,76,138 కోట్లుగా నమోదయింది. ఇందులో డిపాజిట్లు రూ.95,839 కోట్లు కాగా రుణాలు రూ.80,299 కోట్లున్నాయి. అదే కాలంలో బ్యాంక్ రూ.932 కోట్ల లాభం ఆర్జించింది. నికర మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 0.28 శాతం ఉన్నాయి. ఇదిలా ఉండగా బ్యాంక్ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మరో నాలుగు కొత్త శాఖలను ప్రారంభించింది. అవి బెంగళూరు, కన్యాకుమారి, చెన్నై, తిరుపూర్‌లలో ఏర్పాటయ్యాయి. దీంతో బ్యాంక్ మొత్తం బ్రాంచిల సంఖ్య 848కి చేరింది.

ప్యూరిట్ కొనుగోలు పూర్తి

ఏఓ స్మిత్

న్యూఢిల్లీ: హిందుస్థాన్ యునీలీవర్‌కు చెందిన జలశుద్ధి వ్యాపారం ప్యూరిట్ కొనుగోలును పూర్తి చేసినట్టు ప్రపంచ వాటర్ టెక్నాలజీ కంపెనీ ఏఓ స్మిత్ కార్పొరేషన్ ప్రకటించింది. "ప్యూరిట్" బ్రాండ్ కింద తాము నిర్వహిస్తున్న వాటర్ టెక్నాలజీ వ్యాపార విభాగం విక్రయం పూర్తి చేశామని హెచ్‌యూఎల్ ఒక రెగ్యులేటరీ ప్రకటనలో తెలిపింది. ఈ వ్యాపార విభాగాన్ని ఏఓ స్మిత్‌కు 7.2 కోట్ల డాలర్లకు (రూ.600 కోట్లు) విక్రయించినట్టు గత జూలైలో హెచ్‌యూఎల్ ప్రకటించింది. 2023-24 సంవత్సరంలో ఈ విభాగం టర్నోవర్ రూ.293 కోట్లుంది. హెచ్‌యూఎల్ మొత్తం టర్నోవర్‌లో దీని వాటా 1 శాతం కన్నా తక్కువే.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,560 ▼	73,850 ▼	1,06,000 ▼
ముంబై	79,560 ▼	72,870 ▼	96,670 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	118	విజయవాడ	118
వరంగల్	118	గుంటూరు	121
కరీంనగర్	118	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	129
కర్నూలు	118	నెల్లూరు	129
విశాఖపట్నం	107	అనంతపురం	129
గోదావరి	118		

మురిపించిన 'మూరత్'

లాభాలతో ముగిసిన సూచీలు



ముంబై : శుక్రవారం జరిగిన మూరత్ ట్రేడింగ్‌తో దేశీయ స్టాక్ మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టింది. గంట సేపు సాగిన మూరత్ ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 335.06 పాయింట్ల లాభంతో 79,724.12 వద్ద, నిఫ్టీ 99 పాయింట్ల లాభంతో 24,304.35 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్ వర్గాలు నూతన సంవత్సరంగా పరిగణించే 'సంవత్, 2081' ప్రారంభ శుభవేళ శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు మూరత్ ట్రేడింగ్ జరిగిగింది. బ్యాంకింగ్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లు ఈ సెషన్‌లో మంచి లాభాలతో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 80,023.75 పాయింట్ల ఇంట్రా డే గరిష్ఠ స్థాయిని తాకింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లు లాభాలతో ముగియగా, నిఫ్టీలోని 50 కంపెనీల షేర్లలో 42 లాభాల బాట పట్టాయి. ప్రధాన ఆసియా మార్కెట్లు నష్టాల్లో ఉన్నా, మూరత్ ట్రేడింగ్‌లో భారత మార్కెట్ లాభాల బాట పట్టడం విశేషం.

సంవత్, 2080లో లాభాలే: అక్టోబరు నెల దేశీయ స్టాక్ మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. ఎఫ్‌పీఐల ఎడతెగని అమ్మకాలతో సెన్సెక్స్ 4,910.72 పాయింట్లు (5.82 శాతం), నిఫ్టీ 1,605.5 పాయింట్లు (6.22 శాతం) నష్టపోయాయి. అయినా 2080 సంవత్ మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే సెన్సెక్స్ 14,484.38 పాయింట్లు (22.31 శాతం), నిఫ్టీ 4,780 పాయింట్లు (24.6 శాతం) లాభాలతో ముగిశాయి. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.1234.42 లక్షల కోట్లు పెరిగి రూ.444.71 లక్షల కోట్లకు చేరింది.



జీఎస్‌టీ ఆదాయం రూ. 1.87 లక్షల కోట్లు

రెండో అత్యధిక నెలవారీ వసూళ్లివి..

ఏపీలో 12%, తెలంగాణలో 7% వృద్ధి

న్యూఢిల్లీ: అక్టోబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9 శాతం పెరిగి రూ.1.87 లక్షల కోట్లకు చేరుకుంది. 2017 జూలై నెలలో జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి రెండో అత్యధిక నెలవారీ వసూళ్లివి. దేశీయంగా విక్రయాలు పుంజుకోవడంతోపాటు నిబంధనలకు లోబడి సక్రమంగా పన్ను చెల్లింపులు పెరగడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది అక్టోబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.72 లక్షల కోట్లుండగా.. ఈ ఏప్రిల్‌లో ఆదాయం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.10 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా, గతనెలలో తెలంగాణ జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 7 శాతం పెరిగి రూ.5,211 కోట్లకు, ఆంధ్రప్రదేశ్ వసూళ్లు 12 శాతం వృద్ధితో రూ.3,815 కోట్లకు చేరుకున్నాయి. ఈ అక్టోబరులో సెంట్రల్ జీఎస్‌టీ ఆదాయం రూ.33,821 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.41,864 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.99,111 కోట్లుగా నమోదయ్యాయి. సుంకం రూపంలో మరో రూ.12,550 కోట్లు వసూలయ్యాయి. గతనెలలో దేశీయంగా లావాదేవీలు 10.6 శాతం పెరిగి రూ.1.42 లక్షల కోట్లుగా నమోదు కాగా.. దిగుమతులపై పన్నుల ద్వారా సమకూరిన ఆదాయం 4 శాతం పెరుగుదలతో రూ.45,096 కోట్లుగా ఉంది. కాగా, గతనెలలో జారీ చేసిన రూ.19,306 కోట్ల రిఫండ్లు మినహాయించగా.. జీఎస్‌టీ నికరాదాయం రూ.1.68 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాది అక్టోబరుతో పోలిస్తే ఇది 8 శాతం అధికం.

కార్ల అమ్మకాలు అంతంతే..



ఇన్వెంటరీ తగ్గించేందుకు సరఫరా కుదించిన కంపెనీలు

న్యూఢిల్లీ: ఈ ఏడాది పండగ సీజన్ ప్రయాణికుల వాహన కంపెనీలకు అంతగా కలిసిరాలేదు. అక్టోబరులో కార్ల టోకు విక్రయాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. డీలర్ల వద్ద వాహన నిల్వలిప్పటికే భారీగా పేరుకుపోయిన నేపథ్యంలో కంపెనీలు సరఫరా తగ్గించుకోవడం ఇందుకు కారణం.

మారుతికి ఎగుమతుల దన్ను

మారుతి సుజుకీ కంపెనీ దేశీయ విక్రయాలు 1,59,591 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత ఏడాదిలో ఇదే నెలకు అమ్మకాలు 1,68,047 యూనిట్లుగా ఉన్నాయి. అయితే, గత నెలలో కంపెనీ మొత్తం అమ్మకాలు (ఎగుమతులతో సహా) మాత్రం 4 శాతం పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 2,06,434 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతేకాదు, గతనెలలో కంపెనీ చరిత్రలో అత్యధిక రిటైల్ విక్రయాలు నమోదైనట్లు మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. తద్వారా తమ డీలర్ల నెట్‌వర్క్ వద్ద నున్న వాహన నిల్వలను 40,000 యూనిట్ల మేర తగ్గించుకోగలిగామన్నారు.

హ్యుండయ్ మోటార్స్

కంపెనీ దేశీయ విక్రయాలు అతి స్వల్పంగా పెరిగి 55,568 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎస్‌యూవీ మోడళ్లకు అధిక డిమాండ్ నెలకొందని, ఫలితంగా గత నెలలో రికార్డు స్థాయిలో 37,902 ఎస్‌యూవీల అమ్మకాలు జరిపినట్లు కంపెనీ వెల్లడించింది. దేశీయ విక్రయాల్లో ఎస్‌యూవీల వాటానే 68 శాతమని హ్యుండయ్ మోటార్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ తెలిపారు.

- మహీంద్రా అండ్ మహీంద్రా వాహన విక్రయాలు మాత్రం 25 శాతం పెరిగి 54,504 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం విక్రయాలు 20 శాతం వృద్ధితో 96,648 యూనిట్లకు పెరిగాయి.
- టాటా మోటార్స్ కార్ల దేశీయ విక్రయాలు గతనెలలో 48,131 యూనిట్లకు తగ్గాయి.
- టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ విక్రయాలు అక్టోబరులో 18 శాతం పెరిగి 6,79,091కి చేరాయి. దేశీయంగా డీలర్లకు సరఫరా చేసిన వాహనాల సంఖ్య 6,57,403 కాగా ఎగుమతులు 21,688 యూనిట్లున్నాయి. ఈ కంపెనీకి చెందిన విద్యుత్ వాహనం విడా అమ్మకాలు కూడా బలంగానే ఉన్నాయి. అక్టోబరులో గరిష్ఠ నెలవారీ విక్రయాలు 8,750 యూనిట్లు నమోదయ్యాయి.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎట్ 1,00,000 యూనిట్లు

రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు తొలిసారిగా 1,00,000 యూనిట్ల మైలురాయిని దాటాయి. గ తనెలలో ఎన్‌ఫీల్డ్ దేశీయ విక్రయాలు 26 శాతం వృద్ధితో 1,01,886 యూనిట్లుగా నమోదయ్యాయి.

అక్టోబరులో ఎన్‌సీసీకి రూ.3,496 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్ అక్టోబరు నెలలో మొత్తం రూ.3,496 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు సంపాదించింది. ఇందులో రూ.2,684 కోట్ల ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ ద్వారా, రూ.538 కోట్ల ఆర్డర్లు ఎలక్ట్రికల్ డివిజన్ ద్వారా; రూ.274 కోట్ల విలువైన ఆర్డర్లు వాటర్, ఇతర డివిజన్ల ద్వారా లభించినట్టు కంపెనీ తెలిపింది. ఈ ఆర్డర్లన్నీ వివిధ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థల నుంచి లభించాయి. ఇందులో ఒక్క ఆర్డర్ కూడా తమ అంతర్గత ఆర్డర్లు కావని ఎన్‌సీసీ లిమిటెడ్ తెలిపింది.

'కోహాన్స్' విలీనంతో కొత్త బలం

- 2029 నాటికి రూ.6,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- ఈ నెల 28న వాటాదారుల భేటీ
- సువెన్ ఫార్మా ఎండీ ప్రసాద రాజు

న్యూఢిల్లీ: కోహాన్స్ లైఫ్ సైన్సెస్ విలీనంతో తమ వ్యాపారం మరింత పెరుగుతుందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సువెన్ ఫార్మా భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండు కంపెనీలు రూ.2,392 కోట్ల టర్నోవర్ నమోదు చేశాయి. విలీనంతో 2029 మార్చి నాటికి ఇది రూ.6,000 కోట్లకు చేరుతుందని ఆశిస్తున్నట్టు సువెన్ ఫార్మా ఎండీ ప్రసాద రాజు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, కొత్త కంపెనీల కొనుగోలుకూ సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన సువెన్ ఫార్మా-కోహాన్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీల విలీనానికి బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఇప్పటికే ఆమోదం తెలిపాయి. వాటాదారుల ఆమోదమే ఇంకా మిగిలి ఉంది. ఎన్‌సీఎల్‌టీ ఆదేశాల మేరకు రెండు కంపెనీల వాటాదారులు ఇందుకోసం ఈ నెల 28న భేటీ అవుతున్నారు.

మూడు అంశాలపై దృష్టి

విలీనం తర్వాత కూడాకాంట్రాక్టు పద్ధతిలో సరికొత్త ఔషధాలు, వాటి ముడి పదార్థాల అభివృద్ధి, ఉత్పత్తిపై (సీడీఎంఓ) ప్రత్యేక దృష్టి పెట్టాలని కంపెనీ భావిస్తోంది. ముఖ్యంగా ఫార్మా సీడీఎంఓ, స్పెషాలిటీ కెమికల్స్ (సీడీఎంఓ), తుది ఔషధాల తయారీలో ఉపయోగించే ప్రధాన ముడి పదార్థాలు యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఏపీఐ) విభాగాలపై దృష్టి పెడతామని ప్రసాద రాజు తెలిపారు. సరికొత్త ఔషధాల కోసం చూసే అంతర్జాతీయ ఔషధ కంపెనీలకు వ్యూహాత్మక భాగస్వామ్య సంస్థగా ఎదగడం తమ లక్ష్యమన్నారు. విశ్వసనీయమైన సీడీఎంఓ సేవలు అందించే సంస్థలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమెరికా బయోసెక్యూర్ చట్టం కూడా ఇందుకు కలిసి వస్తుందన్నారు.

అపార అవకాశాలు

కొవిడ్ తర్వాత సరఫరాలకు అంతరాయం లేకుండా విశ్వసనీయ సీడీఎంఓ సేవలు అందించే ఫార్మా కంపెనీలకు డిమాండ్ మరింత పెరిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ సీడీఎంఓ మార్కెట్‌లో మన దేశం వాటా 2.7 శాతం మాత్రమే. వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో ఇది ఐదు నుంచి ఏడు శాతం వరకు చేరుకుంటుందని అంచనా. విలీనం తర్వాత ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, నూతన ఔషధాల అభివృద్ధికి దోహదం చేసే సరికొత్త రసాయనాల (మాలిక్యూల్స్) అభివృద్ధి ద్వారా సీడీఎంఓ మార్కెట్‌పై పట్టు మరింత పెంచుకోవాలని భావిస్తున్నట్టు రాజు చెప్పారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.